ఆంధ్రమహిళ



JUNE '54 ANDHRA MAHILA ANNAS 2

వి జ య ము

డిశంబరు 1953 లో గవర్నమెంటు టెక్నికల్ పరీక్షలకు వెళ్ళిన పారిశ్రామిక విద్యాలయపు విద్యార్థినుల పరీక్షా ఫలితాలు ప్రకటితమైనవి. విజయము పొందిన వారి పేర్లు సూచిస్తూ యిందు ప్రకటించు చున్నాము.

కుట్టుపని హయ్యర్ గ్రేడ్

పరీక్ష వ్రాసిన 12 గురిలో 8 గురు ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులైరి.

ఆర్. పద్మ,	వి. ఎన్. కల్పగమ్,	కె. వి. సరస్వతి,
వి. కుప్పమ్మాళ్,	వి. విశాలాక్షి,	డి. రాజ్యలక్ష్మి.

కుట్టుపని లోయర్ గ్రేడ్

పరీక్ష వ్రాసిన 13 గ్గురిలో 8 గురు ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులైరి.

ఎ. రుక్మిణి,	వి. ఎస్. సంపూర్ణమ్,	ఆర్. సరస్వతి,
ఆర్. మీనాక్షి,	పి. ఆర్. సౌందర్య,	టి. ఆర్. రాధ,
ఎస్. మీన,	ఎ. కమల.	

ఆంధ్ర మహిళా సభలో

1954 మార్చి ఆంధ్ర విశ్వవిద్యాలయపు మెట్రిక్ పరీక్షా ఫలితాలు

1954 మార్చిలో ఆంధ్ర విశ్వవిద్యాలయపు మెట్రిక్ పరీక్షలకు, ఆంధ్ర మహిళా సభవారు ప్రప్రథమంగా యిద్దరికి తరిఫీదునిచ్చి పరీక్షలకు పంపిరి. వారిద్దరు ఉత్తీర్ణులైరి. వారి పేర్లు ఈదిగువ నుదహరించబడినవి.

ఎమ్. కమలకుమారి, కె. స్వరాజ్యలక్ష్మి.

కృతార్థులైన విద్యార్థినులకు మా అభినందనములు. వీరికి తోడ్పడ్డ ఉపాధ్యాయ వర్గమునకు మా కృతజ్ఞతాభివందనములు.

ఆంధ్ర మహిళా సభ.

ఆంధ్ర మహిళ

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

యెం.యే., బి.యెల్.,

సంపాదకురాలు :

శ్రీమతి చన్నఘంటమ్మ

యెం.యే., యెల్.టి.,

సంవత్సర చందా   ఆరు రూపాయిలు

ఆంధ్ర మహిళా సభవారిచే స్థాపించబడిన ముద్రణాలయములో
ముద్రితము.

ఆంధ్ర మహిళా సభ

సంగీతపు తరగతులు

కర్ణాటక సంగీతము వీణా, గాత్రములలో లోయర్ గ్రేడ్ పరీక్షలకు శిక్షణ, ఆంధ్ర మహిళా సభ లజ్‌చర్చిరోడ్డు భవనములలో, ప్రారంభింప బడినది.

శిక్షణ మాసరుసుము: రూ. 5-0-0.

ప్రవేశ రుసుము: రూ. 3-0-0.

సభ్యత్వ రుసుము మాసమునకు: రూ. 1-0-0.

మిగతా వివరములు సభకు మధ్యాహ్నం 3 గంll పైన వచ్చి తెలిసికొనవచ్చును.

ఖాదీ విక్రయము.

మద్రాసు గౌర్నమెంటు రూరల్ వెల్‌ఫేరు శాఖలో తయారయిన ఖద్దరు వస్త్రములు, ఆంధ్ర మహిళాసభ లజ్ చర్చి రోడ్డు కార్యాలయంలో విక్రయింప బడుతున్నవి.

చీరలు, ధోవతులు, దుప్పట్లు, చొక్కా, రవికె గుడ్డలు, ఇంకా అనేక రకములైనవి యిక్కడ దొరకును. రూపాయ విలువకు 3 అణాలు తగ్గించి విక్రయించవలసినదిగా వెల్‌ఫేరు శాఖవారు అనుమతి యిచ్చియున్నారు.

ఉదయం 10 గంll నుండి సాయంకాలం 6 గంll వరకు ఈ విక్రయశాఖలో మీకు కావలసిన వస్తువులు దొరకును.

అ. చన్నఘంటమ్మ.

ఆంధ్ర మహిళాసభ

సర్వసభ్య సమావేశము.

నోటీసు

ఆంధ్ర మహిళాసభ సర్వసభ్య సమావేశము సభాభవనములో ది 8-6-54 మంగళవారమునాడు సరిగా 4 గం॥లకు జరుగును. సభ్యురాండ్రందరు తప్పక హాజరు కావలెను.

విషయములు

1. గత సర్వసభ్య సమావేశపు వివరములు:
2. వివిధ శాఖల కార్యక్రమ నివేదికలు. 1953-54
3. వివిధశాఖల జమా ఖర్చుల నివేదికలు. { 1952-53 / 1953-54
4. తీర్మానములు.
5. ఇతరవిషయములు.
6. నూతన కార్యవర్గ సభ్యురాండ్ర ఎన్నిక.

దుర్గాబాయి దేశ్ ముఖ్,
వ్యవస్థాపక కార్యదర్శిని.

అ. చన్నఘంటమ్మ,
ఆర్. కమలాబాయి,
సంయుక్త కార్యదర్శినులు.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: జూన్ '54 :: సంచిక 2

ఇంకా అల్లికలు, బాలానందం, కథలు మొదలైనవి.

సంవత్సర చందా :: ఆరు రూపాయలు.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: జూన్ '54 :: సంచిక 2

"గుడు గుడు గుంచం-"

"చదువని వాఁడజ్ఞుండగుఁ, జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ........ ...."

చదువుయొక్క అవసరం, ఆశయం ఇంతకంటే మనోజ్ఞంగాను, ముక్తసరిగాను చెప్పడం కష్టమే. ఐతే ఆ చదువులు ఏలాగున్నాయి, ఎట్లాగుండాలి అన్న హంశాన్ని గురించి వ్రాయవలసివస్తే ఎం-తై-నా ఉంది. మన విద్యా విధానం పాశ్చాత్త ప్రభుత్వానికి గుమాస్తాల్ని తర్ఫీదు జేయడాన్కి మహా అనుగుణ్యంగా ఉందని ఏనాడో వివేకానందుడు విశదీకరించేడు. గాంధీజీ మొదలైన వారంతా దీన్ని గర్హించేరు. మన కళ్ళెదుటనే చూచేం : జక్కిర్ హుస్సేన్ కమిటీ, సార్జెంటు కమిటీ, ఎలిమెంటరీ విద్యావిమర్శన కమిటీ, ప్రయిమరీ-సెకండరీ-కలీజియేట్ విద్యా విమర్శన కమిటీలు, ఇంకా ఈరోజున రాజాజీ-నూతన-విద్యా-విధాన-విమర్శన కమిటీ, (మళ్ళా మరో ఎక్స్పర్టు కమిటీ నియామకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి). ఇలా ఎన్నెన్నో కమిటీలను నియమించడం, అవి విచారణలు సాగించి, రిపోర్టుల్ని ప్రకటించడం ; ఫలితం అంతా ఎరిగిందే– గుడుగుడు గుంచం - గుండారాగం !

ఇప్పటి చదువులు వట్టి పుస్తకం చదువులేగాని యదార్థ జీవితానికి సంబంధించి యుండలేదనీ, మన బిడ్డల చేయి-బుర్ర-హృదయాల పూర్తి వికాసాలకు తోడ్పడ్డం లేదనీ అంతా ఎరిగీకూడా, గత్యంతరం లేక, పిల్లల్ని ఉన్న బడులకే, కళాశాలలకే పంపించవలసి వస్తూవుంది. ఈ స్కూళ్ళూ కాలేజీలే ఊరూర తెరుస్తున్నారు. ఇవి కర్మాగారాల్లాగ, వందలాది విద్యార్థుల్ని తయారుచేసి, ప్రజలమీదపడి పరభాగ్యోపజీవుల్లాగ జీవించండని విడిచిపెడుతున్నాయి. తాము చదివిన చదువులు పొట్టకూటికైనా ఉపకరించక తమకు, తమ కుటుంబాలకు గ్రామాలకు, దేశానికీ, నిరర్థకాలనీ, ఉన్న నిరుద్యోగ సమస్య పెంచడాన్కి మాత్రం పనికొస్తున్నాయని పిల్లలు పెద్దవాళ్ళయ్యే కొలదీ గ్రహించవలసి వస్తూవుంది. మన పెద్ద పెద్ద లంతా "విద్య" అంటే (శరీరానికి) భుక్తి, (మనస్సుకు) శక్తి, (ఊహకు) యుక్తి, (జీవితానికి) రక్తి, (ఆఖరుకు) ముక్తి సమకూర్చగలిగిందే నన్నారు. "చదువుకున్నవారు" అంటే తమకాళ్ళపై తాము నిలబడి సంఘానికి తోడ్పడగలవారే నన్నారు. "విద్యకు ఫలితం" నిరాడంబర జీవనం– ఉన్నతాశయం, వినయం– విధేయత వగైరా సుగుణాలు అలవడ్డం అన్నారు. అలాంటప్పుడు ఇప్పటి విద్యావిధానం వీటి కన్నిటికీ స-రి-గ్గా విపరీత లక్షణాలు గల వార్ని తయారు చేయడం ప్రత్యక్షంగా అంతా చూస్తూనే ఉన్నాం, ఇంటింటా అనుభవిస్తూనే

ఉన్నాం. భారత ప్రధాని నెహ్రూ దగ్గరనుంచి, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులవరకు- ఇది మనదేశ కాలపరిస్థితులకు సరిపడియుండలేదన్నవారే గాని బాగున్నదన్నవారు లేరుగదా. ఐనా యీ తప్పు తర్పీదును తగు రీతిని సవరించి, సరియైనది సమగ్రమైనదియైన చక్కటి విద్యావిధానాన్ని నిర్ణయించుకోలేక పోవడంకంటే శోచనీయాంశం మరొకటి కానరాదు. మనం- మన చదువులు అప్పటి పాశ్చాత్య ప్రభుత్వంవల్ల నైతేనేమి, నవ-నాగరికతా - వ్యామోహనా - వివశతవల్ల నైతేనేమి ఏదో అలా తయారయ్యేం అనుకుందాం; స్వరాజ్యం వచ్చేకనైనా ఈ దృక్పథం మారి, ఇదిగో మా సాంప్రదాయాలకు, మా జాత్యోన్నత్వ వికాసాలకు తోడ్పడే "జాతీయ విద్యావిధానం" అని చూపించగల దింత వరకూ సాకారం దాల్చలేదు. ఇదేమీ చుల్కనగా చూడదగ్గ విషయంకాదు. 'భావి' భారతం, భారత పౌరుల్ను ఎలాగుండాలి? అన్నదాని కీలకమంతా ప్రస్తుత' విద్యావిధానం ఎలాగుంది? అన్నదానిమీద ఆధారపడియుంటుందన్న సత్యం గమనిస్తే దీని ప్రాధాన్యత తెల్లమౌతుంది. ఇది ప్రజలు, ప్రభుత్వం ఎంతవరకు అవగాహన చేసుకుంటే అంతముందుకు సాగేమన్నమాట— భావిభారత సౌభాగ్యానికి కొంత పడగలెత్తే మన్నమాట. అంటే (మళ్ళీ మన స్త్రీల భాషలో చెప్పాలంటే)— "పాములపట్టం - పడగా రాగం" వరకు వచ్చేమన్నమాట!

ఇక "కత్తెయ్యనా - బద్దెయ్యనా, వేన్నీళ్ళా-చన్నీళ్ళా!" అని నిర్ణయించే బాధ్యత అందరిమీద ఉంది. ఎలాగంటే బిడ్డల ప్రవృత్తి తల్లి కడుపులో పడ్డప్పుడే ప్రారంభమౌతుంది. అప్పుడూ గర్భవతిగా నున్నప్పుడూ తల్లికుండే మానసిక ప్రవృత్తినిబట్టి, బిడ్డ జీవితం ఉంటుందనడాన్కి- అనేక ఋజువులున్నాయి. భావి జీవితపథకానికి ముద్ర అంతా, బిడ్డ (తల్లిదండ్రుల చుట్టూ తిరుగుతూ వారిని అనుకరిస్తూ గడిపే) మొదటి ఐదేళ్ళ ప్రాయం నాటికే నిర్ణయమైపోతుందని మానసిక శాస్త్రం తేల్చింది. గనుక తల్లిదండ్రులు తమ జీవితాల్ని ముందుగా సంస్కరించుకోవాలి. బిడ్డలికి సరియైన వాతావరణంలో, విద్యాబుద్ధులు గరపుతూ, బడిలో వేసేనాటికే చక్కటి భావాలు నూరి పోయడం జరగాలి. ఇక బడులంటే ఇంట్లో అల్లరిచేసే పిల్లల్ని పడేసేవిగాను, బడి పంతుళ్ళంటే (ఏ వృత్తీ లేకపోతే బడి పంతుల వృత్తేనని) బడులు పెట్టే వారుగాను, అవి గ్రాంటులకోసరం నామమాత్రంగా తంతు నడిపేవిగాను ఉండరాదు. ఉపాధ్యాయులు ఆదర్శకులైయుండాలి. వీరి జీతాలు గౌరవ జీవితానికి సరిపడియుండాలి. చదువు అంటే పిల్లలకు సరదాగా వుండటానికి బదులు హడలు, పంతులుగారి బెత్తాల వాతావరణంమూలాన్ని! అలాగాక ప్రేమ వాతావరణంలో సహజ మాతృశిక్షణ రీతిని విద్యాబుద్ధులు గరపడాన్కి, ఎలిమెంటరీ స్కూళ్ళల్లోనైనా స్త్రీలనే ఉపాధ్యాయినులుగా నియమించడం జరగాలి. చదువులు వట్టి పుస్తకాల చదువులుగాక నిత్యజీవితానికి సంబంధించినవై యుండాలి. నిరర్థక పాఠాలుగాక, సంఘానికుపకరించే వృత్తులకు సంబంధింపజేసి చదవడంతోబాటు — చేయడంకూడా నేర్పాలి. బడిలో చేరేసరికల్లా కాయకష్టానికి దూరమై పోవడం, కుటుంబవృత్తిని ఏవగించుకోవడం, అలా కాయకష్ట పడవలసింది కూలీ—నాలీ గాని తాము ఉద్యోగాలకే యేర్పడి పైపై బ్రతుకులు సాగించవచ్చుననుకునే దృక్పథం నశించాలి. కాయకష్టంలో ఉండే ఘనత, ఆనందం, వృత్తిలోనుండే ప్రాధాన్యత వంటబట్టాలి. పిల్లల బడి జీతాలు అందరికీ అందుబాటులో ఉండాలి. మగపిల్లల చదువులకంటె ఆడపిల్లల చదువుల్లోనున్న అవస్థలు తల్లిదండ్రులందరికీ స్వానుభవమే. అక్కడక్కడ కొన్ని స్త్రీల సంస్థలు స్త్రీలకుపకరించే చదువులు, చేతిపనులు, కళలు నేర్పించడం కొంత గ్రుడ్డిలో మెల్ల. మానవుల పూర్తివికాసానికి విద్య ముఖ్యావసరం అని గమనించిన వెనుక బాలబాలికలందర్నీ బడిలో వేసితీరాలని ఎందుకు శాశించరాదు? బడి జీతాలిచ్చుకోలేమని, చదువుకొన్న పిల్లలు ఉభయభ్రష్టులుగా తయారవుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని బడిలో

వేయడంలేదు. గనుక జీతాలు తీసివేసి, తగ్గించి, సరియైన విద్యావిధానం యేర్పరిస్తే అందరూ చదువుకుందుకు అవకాశం యేర్పడుతుంది. చదువులు శరీర మానసిక శక్తుల విజృంభణకు దోహదమేర్పరచేవిగాను, సంఘీభావం కళాభిరుచి, దైవభక్తి, దేశభక్తి మొదలైన భావాల్ని రేకెత్తించేవిగాను ఉండాలి. నయాగరా జలపాతాన్ని వినియోగించడం నేర్చుకున్నమనిషి, తన హృదయకోశంలోనున్న ప్రచండశక్తిని సక్రమవిధానంలో నడిపేటందుకు వలసిన శిక్షణ విధానాన్నేర్పరచుకున్నాడు గాదు, అందుకే యీ యుద్ధాలు, కష్టాలు, నన్నాడు మహాత్మాగాంధీ ఒకప్పుడు. ఇక ఇప్పుడైనా గుడుగుడు గుంచాలు మాని, పెద్ద పెద్దలు, తల్లిదండ్రులు, బడిపంతుళ్ళు, ప్రజలు, ప్రభుత్వం చక్కటి విద్యావిధానం ఒకటి అందరికీ ఆదర్శప్రాయం కాగలిగింది నిర్మిస్తారనీ, మళ్ళీ భావి భారతానికి మహోన్నత దశ ఉందనీ ఆశిద్దాం.

జాతీయాభివృద్ధి ప్రణాళికకు బంగారం, నగకట్టు రూపంలో ఋణసహాయం.

—— :o: ——

జాతీయ ప్రణాళిక ఋణానికి బంగారం, నగల రూపేణా కూడా రుణాలు చెల్లించడానికి వీలుగా ఇండియా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ రూపేణా విరాళాలు చెల్లించదలచేవారు బంగారాన్నిగాని, నగలని గాని కొన్ని బ్యాంకులకు ఇస్తే ఆ బ్యాంకులు ఈ నగలని విక్రయించి డబ్బుగా మార్చి ప్రభుత్వ రుణంలో నగదుగా జమగట్టుతాయి. ఏ ఏ బ్యాంకులకు ఈ నగలు అప్పగించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

ఇటీవల బంగారాలూ, నగలూ ఈ ఋణానికివ్వడానికి ప్రజలలో చాలా మంది ఉద్యుక్తులైనట్లు కనపడినందు వల్ల, ప్రభుత్వం నగలరూపంలో ఋణాలు తీసుకోడానికి వీలులేనందువల్లా బ్యాంకులద్వారా ఈ ఏర్పాట్లు చేయడానికి నిర్ణయించింది. ఈ విధమైన విరాళాలు చెల్లించడానికి ప్రభుత్వం ఈ క్రింది షరతులు నిర్ణయించింది.

1. బంగారం, నగలూ విరాళంగా ఇవ్వదచేవారు ప్రభుత్వం నిర్ణయించే బ్యాంకులకుగాని. వాటి శాఖలకు గాని ఆ నగలు ఒప్పగించాలి.

2. ఈ విషయం జిల్లా కలెక్టరుకిగాని లేదా, కలెక్టరుచే ఇందునిమిత్తమే నియమించబడే స్థానిక అనధికార సంఘ అధిపతికిగాని తెలియపరచాలి.

3. ఋణప్రదాత, తను ఇచ్చిన బంగారాన్నీ, నగలనూ బ్యాంకు అమ్మగా వచ్చే మొత్తాన్ని పేచీ లేకుండా ఆమోదించాలి. పోతే నగలు అమ్మగా వచ్చిన సొమ్ము ఋణంగా జమకట్టాక, దీనిపై వచ్చే వడ్డీని తను ఏ ఖజానానించి తీసుకుంటారో ముందుగా తెలియచేయాలి.

4. జిల్లా కలెక్టరుతోగాని, అతనిచే నియమితుడైన (పైన చెప్పబడిన విధంగా) ప్రతినిధితోగాని సంప్రతించి ఈ నగలను వీలైనంత తక్కువ ధరకే విక్రయించడానికి బ్యాంకు ప్రయత్నిస్తుంది. అమ్మగా వచ్చిన సొమ్ములో వీలైనంత ఎక్కువ సొమ్ముని ఋణానికి జమకట్టి, మిగతా సొమ్ముని (విక్రయవ్యవహారాలలో అవగల చిల్లరఖర్చులు మినహాయించి) ఋణప్రదాతకి తిరిగి యిచ్చివేస్తుంది.

విజ్ఞప్తి

గృహలక్ష్మి పత్రిక వ్యవస్థాపకులు కీ. శే. కె. యన్. కేసరిగారి మృత వార్షికం సందర్భమున 'గృహలక్ష్మి'ని ప్రత్యేక సంచికగా జూన్ నెలలో ప్రచురించ దలచాము.

శ్రీ కేసరిగారి ఆప్తులు, మిత్రులు, వారి జీవితముతో అత్యంత సన్నిహిత సంబంధము కలిగి యుండినవారు రచించి పంపే అమూల్యమైన వ్యాసములను అందులో ప్రచురించెదము. ఈ రచనలు అచ్చులో రెండు పుటలకు మించ కుండా యుండడం మంచిది.

సి. పున్నయ్య.

సంపాదకుడు.

ఆంధ్ర మహిళా సభ

హిందీ తరగతులు

—— :o: ——

ఎప్పటివలె ఆంధ్ర మహిళాసభలో హిందీ తరగతులు ప్రారంభించబడినవి. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష పరీక్షలకు శిక్షణ జరుగుచున్నది.

మే 9-వ తేదీనుండి ఆంధ్ర మహిళాసభ నర్సింగ్ హోమ్, అడయారునందు హిందీ, కుట్టు తరగతులు ప్రారంభించడమైనది.



రాజకీయాలు

• శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు •

1954 ఏప్రిల్ నాలుగోవారం మొదలుకుని మే నెల మూడోవారం వరకూ అంతర్జాతీయ రాజకీయ రంగంలో నడిచిన సంఘటనలు మూడు అంశాలను కనపరిచినవి — (1) ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి తటస్థరాజ్యాలు తప్పనిసరి. ఇండియా, ఇండోనీషియా బర్మాలే ఆవిధంగా పిలవబడేందుకు అర్హతను సంపాదించినవి. (2) ఆసియా, యూరప్‌లలోనేకాక అమెరికా ఖండంలో కూడా అమెరికా విధానం అపజయం పొందుతున్నది. దానిలో మతిపోతున్న అమెరికా తనకు ఉన్న కొద్ది మిత్రులన్నీ చెడనాడుకుంటున్నది. (3) ఆడలేని ఆటగత్తె మద్దెలమీద పడి ఏడ్చినట్లుగా, సొంత సమస్యలను పరిష్కరించుకోలేని ప్రభుత్వాలన్నీ కమ్యూనిస్టులమీద పడి ఏడుస్తూ ఉంటవి.

జాతీయ వ్యవహారాల్లో చెప్పుకో తగ్గ విషయాలు కాశ్మీరుకు భారతరాజ్యాంగవర్తింపు, ప్రత్యేక వివాహాల బిల్లు స్టేట్స్ కౌన్సిల్ ఆమోదించటం.

* * *

పరస్పర అనుమానాలు, భయాలు ప్రబలిన ఈరోజుల్లో అంతర్జాతీయ వివాదాలు పరిష్కారం కావాలంటే, తటస్థదేశాలు ఉండి ఒప్పందాలను అమలు పరిచేందుకు హామీ ఇవ్వవలసి వుంటుందని కొరియా యుద్ధంలోనే తేలిపోయింది. ఆ తరవాత జరిగిన బెర్లిన్ సమావేశం, మే నెల మొదట్లో ముగిసిన కొలంబో సమావేశం, ప్రస్తుతం జరుగుతున్న జెనీవా సమావేశమూ కూడా ఈ అంశాన్ని బలపరిచినవి. ఈ తటస్థరాజ్యాల అవసరాన్ని రష్యా, బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన ప్రముఖ దేశాలన్నీ గుర్తించినవికాని, అమెరికా మాత్రం గుర్తించలేదు. గుర్తించ దలచటం లేదు.

ఈ ఏడాది మొదట్లో నాలుగు అగ్ర రాజ్యాల విదేశాంగ మంత్రులు జర్మనీ ఏకీకరణ విషయమై ఎంతో చర్చ జరిపారు కాని, పరిష్కారం కాకుండానే విరమించారు. జర్మనీని ఏకంచేయాలని అంతా అంగీకరించారు. అది ఎన్నికల ద్వారా జరగాలని అంగీకరించారు. ఆ ఎన్నికలు స్వేచ్ఛగా ఉండాలని కూడా ఒప్పుకున్నారు. కాని వాటిని ఎవరు జరిపించాలో మాత్రం ఒప్పుదల కుదరలేదు. కమ్యూనిస్టు జర్మన్లు, కమ్యూనిస్టు వ్యతిరేక జర్మన్లు ఒకరినొకరు మింగివేయాలని చూడకుండా సహకరించే మార్గం వారందరికీ సమ్మతం కాలేదు. ఎన్నికలు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన జరగాలని పశ్చిమరాజ్యాలు వాదించారు. కాని చైనా, మంగోలియాలకూ, తూర్పు యూరప్ దేశాలు కొన్నిటికీ ప్రాతినిధ్యంలేని ఐక్యరాజ్యసమితి నిష్పక్షపాతి కారాదని కమ్యూనిస్టులు అభిప్రాయపడ్డారు. వ్యవహారాన్ని పూర్తిగా జర్మన్లకే వదలరాదా అని కమ్యూనిస్టులు అడగ్గా, వీరికి ఒప్పందం కుదరకపోతేనో అని పశ్చిమరాజ్యాలు ప్రశ్నించారు.

ఈసమయంలో ఫ్రాన్సు విదేశాంగ మంత్రి బీడోల్ట్ ఒక సూచన చేశారు. జర్మనీ ఎన్నికల పర్యవేక్షణకూ, ఏకీకరణ సమస్యల సంప్రదింపులకూ తటస్థ ప్రతినిధి ఒకరు పెత్తనం వహించాలనీ, వారికి ఒప్పందం కుదరని అంశాలపై ఆయన తీర్పు చెప్పాలనీ బీడోల్ట్ ప్రతిపాదించారు. ఆ పరిస్థితుల్లో అంతకుమించిమరొక తరుణోపాయంలేదు. కాని మిగిలిన అగ్ర రాజ్యాలెవరూ, ఏ కారణం వల్లనో దానిని లక్ష్య పెట్టలేదు.

* * *

సింహళ ప్రధాని సూచనమీద ఏప్రిల్ చివర్లో ఇండియా, బర్మా, ఇండోనీషియా, సింహళం, పాకిస్థాన్

రా జ కీ యా లు

ప్రధానులు కొలంబోలో సమావేశమై ఆగ్నేయాసియాకు సంబంధించిన సమస్యలను చర్చించారు. మొదట్లో అంతా సవ్యంగా గడిచిన సమావేశం చివరకు పాకిస్థాన్ ప్రధాని "పశ్చిమరాజ్యాభిమానం" వల్ల భగ్నమయేట్లు కనిపించి చివరకు పెద్ద పెద్ద ముసద్దీలంతా జేరి తీర్మానాలను కొంత సర్దుబాటు చేసి రాజీకుదిర్చారు. ఆ సమావేశం మే 2 వ తేదీన ఒక ఉమ్మడి ప్రకటన చేసింది. అందులో ముఖ్యాంశాలివి :

(1) ఇండోచైనా యుద్ధంలో ప్రత్యక్ష సంబంధం గల పక్షాలన్నీ తక్షణం యుద్ధవిరమణను గురించి చర్చించాలి. తిరిగీ యుద్ధం చెలరేగకుండా చూస్తామని అన్ని అగ్ర రాజ్యాలూ హామీ ఇవ్వాలి. ఇండోచైనాకు స్వాతంత్ర్యం ఇస్తానని ఫ్రాన్స్ ప్రకటించాలి. (2) చైనాకు సమితిలో ప్రాతినిధ్యం ఇవ్వాలి. (3) వలస సామ్రాజ్యవాదం ప్రపంచ శాంతికీ, ప్రజల ప్రాథమిక హక్కులకూ భంగకరం (4) విదేశీయ కమ్యూనిస్టులుకానీ, కమ్యూనిస్టు వ్యతిరేకులు కానీ, తదితరులుకానీ తమ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకుంటే ఆసియా దేశాలు సహించవు. (5) ఒకరి వ్యవహారాల్లో మరొకరు జోక్యం కలిగించుకోరు.

ఇండోచైనాలో యుద్ధంలో సంబంధం ఉన్నవాళ్ళు తప్ప ఇతరులు జోక్యం కలిగించుకోరాదన్న సూచనకు పాకిస్థాన్ ప్రతిఘటించగా, యుద్ధవిరమణ సంప్రదింపుల్లో ప్రత్యర్థులకు సమ్మతమయిన ఇతరులను కూడా పిలవవచ్చునని చేర్చబడ్డది. ప్రస్తుతం శాంతికి, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాలలో శాంతికి ప్రధానాటంకం వలస వాదమేననీ, కమ్యూనిజం అంతర్జాతీయ స్థాయిలో ప్రమాద కారిగా లేదనీ నెహ్రూ, ఇండోనీషియా ప్రధాని శస్త్రో వామిజయో, బర్మా ప్రధానినూ అభిప్రాయ పడ్డారు. కాని పాకిస్థాన్ మాత్రం ప్రపంచ శాంతికి ముఖ్య ప్రమాదాల్లో కమ్యూనిజం ఒకటని వాదించింది. వలసవాదంతోపాటు కమ్యూనిజాన్ని కూడా నిరసించాలని కోరగా, పై తీర్మానాలు చేయబడ్డవి.

కమ్యూనిస్టు ప్రమాదం ఆంతరంగిక పరిస్థితులను పట్టే వుంటుందని బర్మా, ఇండోనీషియా, ఇండియాలు అనుభవాన్ని పట్టే గ్రహించినవి. ఈనాటికీ బర్మాలో కమ్యూనిస్టులు తిరుగుబాట్లు జరుపుతున్నా, అవి స్వదేశీయుల వల్లనే జరుగుతున్నవని బర్మా ప్రభుత్వానికి తెలుసు. విదేశీయ జోక్యం ఉన్నదీ అంటే అది కమ్యూనిస్టు వ్యతిరేకులయిన కోమింటాంగ్ వల్లనే వచ్చిందని తెలుసు. అట్లాగే ఇండోనీషియాలో కూడా మాజీ ప్రధాని షరీఫుద్దీన్ నాయకత్వాన తిరగబడి ఓడిపోయిన కమ్యూనిస్టులు కూడా స్వదేశీయులేనని ఆ ప్రభుత్వం గుర్తించింది. అక్కడ విదేశీ జోక్యం ఏదయినా ఉన్నదీ అంటే, అది ఇండోనీషియానూ "రక్షణ" ఒప్పందంలోకి ఇరికించాలని అమెరికా చేసిన ప్రయత్నాల్లోనూ, ఇండోనీషియా అంతర్భాగమయిన ఇరియన్ (పశ్చిమ న్యూగినీ)ని ఆక్రమించుకున్న డచ్చివారి వల్లనూ, వారిని సమర్థించిన ఆస్ట్రేలియా వల్లనూ మాత్రమేనని గుర్తించింది.

తెలంగాణాల్లో కమ్యూనిస్టు సమస్యకు అక్కడి జాగీర్దారీ, రజాకార్ల పాలనలేననీ, స్థానిక ప్రజలే వారి బలానికి కారణమనీ గత ఎన్నికలు నిరూపించినవి. ఇండియాలో విదేశీయ జోక్యం అన్నది కాశ్మీర్ లోను, విదేశీ మిషనరీల చర్యల్లోనూ ఉన్నదని స్పష్టపడుతున్నది. పాకిస్థాన్, సింహళాలకు చెప్పుకోదగ్గ కమ్యూనిస్టు సమస్యలే లేవు. కాని అవి కమ్యూనిజాన్ని నిందించాలని కోరటం వల్ల, వాటి తాటస్థ్య సందేహానికి గురి అయింది. అదీకాక అమెరికా దగ్గర సైనిక సహాయం తీసుకున్న పాకిస్తాన్ తటస్థంగా ఉండటం అసంభవం.

తటస్థ సిద్ధాంత ప్రతిపాదకుడయిన నెహ్రూ ఈ నెలలో పార్లమెంటులో అనేక సందర్భాల్లో మాట్లాడుతూ పై అంశాలను ఉద్ఘాటించారు. కొలంబో సభ తీర్మానాలన్నీ ఆయన సూచన ప్రకారమే జరిగినవి.

* * *

జెనీవా సమావేశంలో ఇండోచైనా సమస్యపై చర్చ కొలంబో సూచన ప్రకారమే జరుగుచున్నది. వీట్మిన్ సేనలు విజయాల మీద విజయాలు సాధిస్తూకూడా, ఎంతో ఔదార్యాన్నీ నిగ్రహాన్నీ ప్రదర్శిస్తున్నారు. దీనిని నెహ్రూ కూడా ప్రశంసించారు. ఇండోచైనా పరిష్కారానికి లామూస్, కాంబోడియాల సంబంధం లేకుండా చేసి, వాటిని 'సహచార' రాజ్యాల హోదాలో ఉంచాలని పశ్చిమ*

(తరువాయి 12. వ పేజీలో)

పశ్చిమ రాజ్యాల్లో బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్ మాత్రం ఈ ఎన్నికల పర్యవేక్షణకు తటస్థ రాజ్యాలు రావాలని ప్రతిపాదించారు. సమితి కానీ, సమ్మతమయిన ఇతరులు కానీ పర్యవేక్షణ జరపాలన్నారు.

ప్రధాని నెహ్రూ పార్లమెంటులో కొరియా, ఇండోచైనా సమస్యల పరిష్కారంపై మాట్లాడుతూ ఉత్తర కొరియన్ మార్గాన్ని సమర్థించారు. తక్షణ ఏకీకరణ కుదరకపోతే ఉభయ ప్రాంతాలనూ విడివిడిగానే ఉండనిచ్చి, ఉన్నతాధికారులలో ఉమ్మడి సంఘాన్ని ఏర్పాటు చేయాలనీ, వేడి చల్లారిన తరవాత ఇది ఏకీకరణ సాధించగలరనీ అన్నారు. ఇండోచైనాకు కూడా ఇదే పద్ధతి పనికివస్తుందన్నారు.

*　　*　　*

పై విషయాలన్నిటినీ పట్టి తేలే అంశాలు రెండు— (1) బయటివాళ్ళు తల దూర్చకుండా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యం. (2) ఆ సంప్రదింపులను సానుకూల పరచటానికీ, అమలు జరపటానికీ తటస్థ రాజ్యాలు అవసరం. (3) ప్రస్తుతం ఇండియా, బర్మా, ఇండోనీషియాలే ఆ గౌరవానికి తగిఉన్నవి.

అయితే కొరియాలో ఖైదీల పరటా తటస్థ సంఘ కార్యక్రమాన్ని అమెరికా, దక్షిణ కొరియాలు ఏ విధంగా భగ్నపరిచినవో చూసిన మీదట, ఈ ప్రతిపాదనలు అమెరికాకు ఎందువల్ల గిట్టటం లేదో తెలుస్తున్నది. కొరియాలో తటస్థ రాజ్యాల జోక్యం 'విఫలం' అయింది కనుక, దానివల్ల లాభం ఉండదని అమెరికా ప్రచారం మొదలు పెట్టిందని వార్తలు వచ్చినవి.

ఇండోచైనాలో ఎన్నికలు పెడితే వీట్మిన్‌లే గెలుస్తారనీ, అందువల్ల అవి జరక్కుండా చేసేందుకే అమెరికా ప్రయత్నిస్తున్నదనీ ఫ్రెంచి పౌరులు, బ్రిటిష్ పార్లమెంటు సభ్యులు ఆరోపిస్తున్నారు. అమెరికాతో చేయి కలిపి ఇండోచైనా పరిష్కారం కుదరకుండా చేస్తున్న ఫ్రెంచి ప్రధాని లానియల్ ప్రభుత్వాల పతనంలో నయినా కూలి పోయేట్లున్నది.

బల ప్రయోగ సిద్ధాంతాన్నే నమ్ముకున్న అమెరికా ఈ నెల 19 వ తేదీన పాకిస్థాన్‌తో సైనిక సహాయ ఒప్పందం చేసుకున్నది. ఆగ్నేయాసియాలో సైనిక ఒప్పందం చేసుకునేందుకు బ్రిటన్ తటపటాయిస్తున్నందుకు కంటగించుకుంటున్నది. బ్రిటన్ లేకుండానే ఒప్పందం ఏర్పాటు చేయగలమని ప్రెసిడెంటు ఐసన్‌హోవర్ ప్రకటించారు. ఇదివరకే ఆంజూస్ ఒప్పందంలో (ఆస్ట్రేలియా, న్యూజిలాండు యు.ఎస్.ఏ.) బ్రిటన్‌ను అమెరికాలో సిరా ఉన్నది.

*　　*　　*

ఆసియా, యూరప్‌లలోనే కాక దక్షిణ అమెరికాలో కూడ అమెరికా విధానానికి అపజయం కలిగింది. దక్షిణ అమెరికా రాజ్యాలకు కమ్యూనిస్టు బెదురు చూపి, తన దోపిడి విధానాన్ని సాగించుకోవాలని చూసిందికాని, చాలా దేశాలు తమ వ్యవహారాల్లో జోక్యము కలిగించుకోవద్దని హెచ్చరించినవి. అయితే కమ్యూనిజాన్ని అవి నిరసించినవికాని, గ్వాటెమాలా మాత్రం నిరాకరించింది.

అందుకని అమెరికా, బ్రిటన్‌లు సాగించిన గ్వాటెమాలా వ్యతిరేక ప్రచారం ఇప్పుడు ముదిరిపోయింది. కమ్యూనిస్టు దేశాలనుంచి గ్వాటెమాలాకు ఆయుధాలు వస్తున్నట్లు అమెరికా ఆరోపించింది. కమ్యూనిస్టుకాని స్వీడన్‌ను కూడ ఆయుధాలు అమ్మరాదని అడ్డగించింది. బ్రిటన్ గ్వాటెమాలాపై తన వలసరాజ్యం హోండ్యురాస్‌తో జోక్యం కలిగించుకుంటున్నట్లు ఆరోపించి ఉన్నది.

ఈ దుష్ప్రచారపు మొదటి ఫలితం గ్వాటెమాలాతో మరొక దక్షిణ అమెరికన్ రాజ్యమయిన నికరాగువా తెగతెంపులు చేసుకోనటం. మన్రో సిద్ధాంతం పేరుతో అమెరికా దురాక్రమణ చేసినా ఆశ్చర్యం ఉండక్కర్లేదు.

*　　*　　*

ఏప్రిల్ చివర ఆస్ట్రేలియా, రష్యా తెగ తెంపులు చేసుకున్నవి. ఆస్ట్రేలియాలో రష్యా రాయబారి కార్యాలయోద్యోగి పెత్రోవ్ గూఢచారిగా పనిచేస్తూ, ఆస్ట్రేలియా ఆశ్రయం కోరినట్లూ అందువల్ల తమ ఆధీనంలో ఉంచుకున్నట్లూ ఆస్ట్రేలియా ప్రకటించింది. అతణ్ణి ఆస్ట్రేలియా అధికారాలు అపహరించారని రష్యా ఆరోపించి సంబంధాలు తెంచివేసింది. పెట్రోవ్ సంఘటన రాబోయే ఎన్నికముందు లేబర్ పార్టీ వాళ్ళమీద దెబ్బతీసేందుకు సృష్టించబడ్డట్లు

రా జ కీ యా లు

భావించబడుతున్నదని 'హిందూ' పత్రిక విలేఖరి డేవిడ్ మార్టిన్ వ్రాశాడు. దాని తరువాత ఆస్ట్రేలియా ప్రభుత్వ విచారణలో కూడా రష్యా విదేశాల్లో గూఢ చారులకు డబ్బు, దస్కం ఇవ్వదనీ, కమ్యూనిస్టు అభిమానులు తమ అభిమానం కొద్దీ గూఢచారులుగా పనిచేస్తారనీ చెప్పిన అంశం కూడా ఈ అనుమానాలను బలపరుస్తున్నది. కమ్యూనిస్టు అభిమానులన్న పేరుతో అతివాద సోషలిస్టులందరినీ దెబ్బ తీసే వీలు ఉన్నది.

ఇట్లాగే పాకిస్థాన్ కూడా కమ్యూనిస్టు నెపంతో ప్రత్యర్థుల్ని అణచివేయ చూస్తున్నది. ఢకా నార మిల్లులో బెంగాలీలూ, బెంగాలీలు కానివాళ్ళూ ఇటీవల కొట్టుకోగా కొన్ని వందలమంది చనిపోయినారు. దీనికి కమ్యూనిస్టులు కారకులనీ, వారిని నిషేధించాలనీ పాక్ ప్రధాని తెలియజేశారు. తూర్పు బెంగాల్ ప్రధాని ఫజ్లుల్ హక్ దీనికి సమ్మతించలేదని తెలుస్తున్నది.

ముస్లింలీగ్‌ను ఓడించిన బెంగాలీ ముస్లింలమీద, లీగ్ అభిమానులయిన పశ్చిమ పాకిస్తాన్ ముస్లింలు ఆగ్రహావేశంలో ఉన్నారన్న సంగతి గమనిస్తే, తూర్పు బెంగాల్ కూ కమ్యూనిస్టులకూ ముడిపెట్టి, హక్ ప్రభుత్వాన్ని కూలదోయటానికి జరుగుతున్న ప్రయత్నాలే ఇవి అని చెప్ప వలసి ఉంటుంది.

* * *

ఫ్రెంచి ఇండియా భవిష్యత్తుపై ఫ్రాన్స్‌కూ, ఇండియాకూ పారిస్‌లో మే 15 నుంచీ సంప్రదింపులు జరుగుతున్నవి. వెంటనే పరిష్కారం కుదరకపోతే స్థానిక ప్రజోద్యమాలు పెడదార్లు తొక్కగలవని నెహ్రూ వివరించారు. ఇప్పటికి ఫ్రెంచి ఇండియాలో మూడింట రెండువంతులున్న ప్రజలు ఫ్రెంచి పాలననుంచి విడిపించారు.

పోర్చుగీస్, ఫ్రెంచి స్థావరాలనుసరించి ప్రధాని నెహ్రూ పార్లమెంటులో మాట్లాడుతూ, అట్లాంటిక్ ఒప్పందం వంటి విదేశ ఏర్పాట్లేవీ వీటికి వర్తించవని ఉద్ఘాటించారు.

ఇండియా, చైనాలు టిబెట్‌పై చేసుకున్న ఒప్పందాన్ని నెహ్రూ సమర్థిస్తూ, గత 7 సం॥లలోనూ ఇంతకన్నా ఉత్తమ కార్యాన్ని, ఇంతకన్నా వాస్తవిక విషయాన్ని ఇండియా మరొకటి చేయలేదన్నారు. ప్రపంచానికంతటికీ ఆదర్శప్రాయమైన ఒప్పందం అది అన్నారు.

కాశ్మీరుకు ఢిల్లీ ఒప్పందం ప్రకారం భారత రాజ్యాంగాన్ని వర్తింపజేస్తూ రాష్ట్రపతి మే నెలలో ఉత్తర్వు చేశారు. ఇది జన వాక్యం హామీనికానీ, ఇతర వాగ్దానాలనుకానీ భంగ పరచదని నెహ్రూ హామీ ఇచ్చారు.

భారత సేట్స్ కౌన్సిల్ ప్రత్యేక వివాహాల చట్ట సవరణ బిల్లును ఆమోదించింది. ఇది మతాంతర, వర్ణాంతర వివాహాలను రిజిస్ట్రేషన్‌తో గుర్తిస్తుంది. ఈ వివాహాల కనీస వయస్సును 21 సం॥లకు పెంచింది. పరస్పర సమ్మతిపై విడాకులివ్వటానికి అంగీకరించింది. పార్లమెంటు దిగువ సభ వచ్చే సమావేశంలో దీనిపై చర్చిస్తుంది. దీనితోపాటు స్త్రీల ఆస్తి వారసత్వపు హక్కు బిల్లు కూడా రావచ్చునని తెలుస్తున్నది.

* (10 వ. పేజీ తరువాయి.)

రాజ్యాలు తంటాలు పడుతున్నవి. వీట్నాంలో తమను మోస్తరే వీటిల్లో కూడా ప్రతిఘటనోద్యమాలను గుర్తించాలని వీట్మిన్‌లు వాదిస్తున్నారు. ఈ సమస్య అంతట్లోనూ బ్రిటిరాజీ మార్గాన నడుద్దామని ప్రయత్నించటం, అమెరికా ప్రాల్సులు పడగొట్టటం జరుగుతున్నది. ఆ విషయమై సన్నాహాలు కూడా జరుగు తున్నవి. ఇండోచైనా పరిష్కారానికి ఆసియా రాజ్యాల సహకారాన్ని సాధించాలని కూడా బ్రిటన్ ప్రయత్నిస్తున్నది.

జెనీవాలో కొరియా ఏకీకరణపై చర్చలుకూడా సాగుతున్నవి. ఇందులోకూడా పశ్చిమ రాజ్యాలకు ఏకాభిప్రాయం కుదరలేదు. ఉత్తర కొరియా ప్రతినిధి ప్రతిపాదన ప్రకారం ఎన్నికలు, ఏకీకరణ అన్నవి ఉత్తర,దక్షిణ కొరియాలు సమిష్టిగా నిర్వహించ వలసి వుంటుంది పశ్చిమ.

(11-వ పేజీలో చదవండి)

స్త్రీలు : సంసారం : ఉద్యోగాలు

రచన :
"ఒక గృహిణి"

సమర్పణ :
బుద్ధవరపు సత్యనారాయణ

మీరు గృహిణిగా ఉంటూ ఏదైనా ఉద్యోగం చేస్తున్నారనుకోండి. మీ సంపాదన నెలకు ఎనభై రూపాయలయినా, లేక ఎనిమిది వందల రూపాయలయినా మీ ఉద్యోగాన్ని గురించి మీ భర్త సాధారణంగా పరిపరి విధాలుగా ఆలోచిస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి మీ మీద నీచభావం జనించి ఆయన తెగతెంపులు చేసుకొందామా అన్నంత తీవ్రంగాకూడా అనుకోవచ్చు. మరో సందర్భంలో - ఇటు సంసారాన్ని చక్క దిద్దుకుంటూ అటు ఉద్యోగాన్ని కూడా సక్రమంగా చేసుకొంటున్న మీ సామర్థ్యాన్ని ఆయన తన మనస్సులో మెచ్చుకోనూ వచ్చు.

ఆయన ఆలోచనలు నిర్ణయాలు ఆయన పుట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టీ, సంస్కారాన్ని బట్టీ ఉంటాయి. మీరు ఏయే వేళల్లో పని చేసేదీ, మీరు చేసే పని స్వభావం కూడా ఆయన నిర్ణయాలకు కారణాలవుతాయి.

ఇంట్లో పసిపిల్లలు వుంటే వాళ్ళని వదలి మీరు ఉద్యోగం చేస్తూవుంటే ఆయనకు సుఖం ఉండకపోవచ్చు. పిల్లలెవరూ లేనప్పుడు మీరు ఉద్యోగం చేయడం ఆయనకు ఇష్టమూకావచ్చు. ఆయన స్నేహితుల భార్యలెవళ్లూ ఉద్యోగాలు చేయకుండా ఉండగా ఒక్క మీరు మాత్రమే ఆ పని చేస్తూ ఉండడం జరిగినా ఆయన మదనపడడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

మీరు డబ్బు సంపాదన దృష్టితో ఉద్యోగం చేస్తున్నా, లేక అందులోవుండే ఆనంద మేమిటో తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నా, మీరు ఆయనయందు కనబరచే శ్రద్ధా భక్తులమీద ఆయన దృక్పథం ఆధారపడివుంటుంది.

తెలిసో తెలియకో, మిమ్మల్ని ఉద్యోగం చేయడానికి అనుమతించే విషయంలో 'అవునా-కాదా' అన్న వ్యాకుల పాటును ఆయనలో కలిగించడానికి మీరు కారణం కావచ్చు అజాగ్రత్తగావుంటే !

ఉదాహరణకు లలిత విషయమే తీసుకోండి. ఆమె, ఆమె భర్తకూడా మధ్య తరగతి కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ళే. వాళ్ల జీవితాలు హాయిగా గడిచిపోతూ వుండేవి.

మోహన్, ఆమె భర్త, ఒక వ్యాపార సంస్థలో గౌరవ ప్రతిపత్తులు కలిగిన ఉద్యోగాన్నే చేసేవాడు. కాని ఎందుచేతో ఆయనకు ఆ ఉద్యోగంలో సుఖం కనిపించలేదు. ఏదో నరకకూపంలో ఉన్నట్టు బాధపడేవాడు. అందుకు తగినట్టుగానే ఆ ఉద్యోగంలో అభివృద్ధిగాని ఏ ఇతర సౌకర్యంగాని లేకుండా పోయింది. ఇంక ఆ ఉద్యోగంతో లాభం లేదని నిర్ణయించుకుని దీన్ని వదులుకుని మరేదో చిన్న వ్యాపారం పెట్టుకుందామని నిశ్చయించుకున్నాడు.

అంతవరకూ తనుకూడ బెట్టిన కొద్ది మొత్తంతోటి ఒక చిన్న వ్యాపారం ప్రారంభించాడు. పరిస్థితులు గుర్తించి లలిత కూడా రేషనింగ్ ఆఫీసులో ఖాళీ వుంటే అందులో చేరింది.

పరిస్థితులు గడ్డుగా వుండడం వల్ల ఇద్దరూకూడా అవిశ్రామంగా పని చేసుకొనేవారు. దాని ఫలితంగా ఇద్దరూ కూర్చొని కనీసం కాసేపు కష్టసుఖాలు చెప్పుకుందుకైనా సరిగ్గా సమయం దొరికేదికాదు. ఇద్దరికీ కూడా ఏమిటో ఏదో పోగొట్టుకున్నట్లుండేది. జీవిత మాధుర్యానికి దూరమౌతున్నట్టు బాధపడేవారు.

లలిత కూడా ఏదో పని చేసి కొద్దోగొప్పో సంపాదిస్తు వున్నా ఒక్కొక్కసారి ఇంట్లో గడవడమే కష్టమనిపించేది వాళ్ళకి. మోహన్ మాత్రం ఎంత నిరుత్సాహకరంగా ఉన్నా తన వ్యాపారాన్ని మానలేదు.

ఇల్లాగే కష్టంగా రెండేళ్ళు గడచేసరికి మోహన్‌కి వ్యాపారంలో సుస్థిరత ఏర్పడి పెద్దలాభాలు లేకపోయినా నష్టం మాత్రం కలిగించని స్థితి వచ్చింది. ఈ అభివృద్ధిని అంతగా నమ్మడానికి లేకపోయినా అతనికి బాగా ధైర్యం

వచ్చింది. అటువంటప్పుడు లలిత తన ఉద్యోగం మానేస్తేనే మంచిదికదా అనిపిస్తుంది మనకి !

కాని ముందు వెనకలు ఆలోచించుకొని లలిత ఉద్యోగం మానలేదు. చన్నీళ్ళకు వేడినీళ్ళు సాయ మన్నట్లు కుటుంబం యిబ్బందులు లేకుండా సాగిపోతూ వుండేది. దానికి అనుగుణంగా వాళ్ళ కోరికలుకూడా విస్తృత రూపం దాల్చాయి పది రూపాయలు మిగిలేసరికి !

వాళ్ళు నివసించే పట్టణానికి దగ్గరలోనే ఒక ఇల్లు కట్టుకోవాలని వాళ్ళ వాంఛ. ఇంకా.... రోజులు బాగుంటే ఇద్దరు పిల్లలు.... ఒక కుట్టు మిషను.... అందరికీ చక్కటి బట్టలు.... ఇవి కలలు. కొద్ది కాలంలోనే ఆమె కోరికలు ఫలిస్తున్నాయి.

ఆమె ఉద్యోగం మానకుండా ఉండడం వల్ల వచ్చే ఆదాయం వాళ్ళ కుటుంబానికి ఎంతగానో తోడ్పడుతూంది. తన ఆదాయంలో చాలా భాగం బ్యాంక్‌కి పంపుతోంది మన లలిత ఇప్పుడు ! ఆమె కన్న కలలు నిజం చేసు కోడానికి.

వివేకంతో ఆమె తన భర్త కష్టసుఖాలను పంచు కొంది. అతనికి అవసరమైనప్పుడు చేయూత నిచ్చింది. త్వరలో పరిస్థితులు అదుపులోనికి రాగానే పూర్తిగా ఉద్యోగం మానేసి తన భర్తతో హాయిగా ఎప్పుడూ కాలం గడపాలనుకుంటోంది లలిత !

ఈ విషయాన్ని చూచిన తరువాత మనం నేర్చుకో వలసిందేమిటి ?—లలిత చాలా తెలివైనది. ఆమె ఇటు ఏలోటూ రాకుండా భర్తను భక్తి శ్రద్ధలతో చూసుకొంది. అటు పల్లెత్తు మాట పడకుండా ఉద్యోగం చేసింది. ఈ రెండు పనులకూ లలిత యొక్క నేర్పరితనం వల్లనే సామరస్యం ఏర్పడి ఆమె జీవితంలో కలతలు కలుగలేదు. పైగా ఆమెకు ఈ పని ఒక సాహస కృత్యం చేస్తున్నట్టు గాను, ఎంతో హాయిగాను కూడా కనిపించింది. ఇందులో రహస్యమంతా ఆమె భర్తయందూ, ఉద్యోగంయందూ చూపిన సక్రమదృక్పథంలోనే వుంది.

అందుచేత, ఏదో ఇతర కారణం వుంటే తప్ప 'నా భార్య కూడా సంపాదిస్తోందే' అన్న విషయం భర్తను అంతగా కలవరపెట్టదు. తను సంపాదిస్తూన్నానే అన్న విషయాన్ని కొందరు స్త్రీలు చెడుగా ప్రదర్శించడం జరుగుతూ వుంటుంది కూడా. అటువంటప్పుడు భర్త కలత చెందక ఏమవుతాడు మరి ?

అంత ఎందుకు ? ఫ్రేని సంగతి చూడండి. మీకే తెలుస్తుంది. ఈమె కూడా ఇబ్బందిగావుంటే డబ్బు కోసమే పని చేస్తోంది. పిల్లల చదువుకు, జీతనాతాలు కట్ట డానికి ఉపయోగిస్తుందనో, డబ్బు విషయంలో ఇబ్బంది పడకండా కుటుంబం యొక్క జీవన ప్రమాణం పడి పోకుండా చూసుకొనేందుకనో మొత్తంమీద ధనార్జన కోసమే పనిలో ప్రవేసించింది. ఆమె చేస్తున్న ఉద్యోగం మీద వచ్చే ఆదాయం కుటుంబానికి ఎక్కువగా తోడ్పడు తున్న సంగతి ఎవ్వరూ కాదనలేరు. ఆమెకు మాత్రం ఈ పరిస్థితి చాలా 'క్లిష్టంగానూ, మహత్కార్యాన్ని నెరవేరుస్తున్నట్టు'గాను ఉంది. తన భర్తకు తోడ్పడు తున్నామనే సంగతే ఆమె మరచిపోయింది. జ్ఞానం వల్లనో అజ్ఞానం వల్లనో గాని ఆమె తన భర్త అపజయం పొందాడని అభిప్రాయం ఏర్పరచుకొంది.

ఓ సందర్భంలో విసుక్కుందికూడా భర్తని. 'మీ జీతాన్ని ఎక్కువ చెయ్యమని అడగండి. మీరు ఇంకా చాలా కష్టపడి పని చెయ్యాలి. ఏదోవిధంగా ఎక్కువ సంపాదించడానికి ప్రయత్నం చెయ్యాలి' అని ఆయన ముందు తరచు అనేది.

ఎప్పుడూ ఏదో శక్తికిమించి ఎంతగానో శ్రమపడి అలసి పోయినట్లు ఉండేది, ఏ ఇతర విషయాన్ని పట్టించు కొనేదికాదు. తనేదో 'ఘనకార్యం సాదిస్తూ లోకానికి మహోపకారం చేస్తున్న' దానిలా కనిపించేది. దీనినంతా భర్త ముందు ఏదో విధంగా ఎప్పుడూ వ్యక్తం చేస్తూ ఉండడం ఆమెకు అలవాటయిపోయింది. ఎప్పుడేనా ఆమె భర్త ఏదన్నా వస్తువు కొనడానికి వెనుతీసి — సందేహిస్తూంటే, 'నా' జీతంలోనించి దాన్ని కొంటాను.... అని అంటూవుండేది. అటువంటి సమయంలో భర్త ఏమనుకుంటాడో మీరే ఊహించండి !

ఫ్రేని ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోయినా మరేదో కారణంతో భర్తమీద పెత్తనం చలాయించి వుండేదేనేమో. ఆమె తీరే అంత. ఆమె గాని అటు వంటి స్వభావం గల స్త్రీలు గాని జీవితంలో సుఖపడడం కలలోని మాట !

నిజంగా ఎంత కష్టాల్లో వున్నా ఎంతగా జీవితంలో అపజయం పొందినా, 'మీరు పూర్తిగా అసమర్థులు. కుటుంబాన్నే పోషించ లేకపోతున్నారు' అనే అభిప్రాయాన్ని భార్య వ్యక్తం చేస్తే ఏ భర్త అయినా భరించగలడా మరి!

లోకంలో ఉద్యోగం చేసే స్త్రీలు అందరూ లలిత లాగానూ ఉండలేరు. ఫ్రేని లాగానూ ప్రవర్తించరు. మధ్యస్థంగా పోతూ ఉంటారనుకోండి. కొన్నాళ్ళు మీరు చేసే ఉద్యోగం మీకు ఎంతో హాయిగా ఉంటుంది. ఒక్కొక్కసారి భరించలేనంత భారంగా కూడా పరిణమించడం జరుగుతుంది.

మీరు సంపాదించే డబ్బు మీ కుటుంబ పోషణకు అత్యవసరమైతే ప్రత్యేకమైన శ్రద్ధవహించి ఓర్పుతో నెట్టుకు రావాలి ఉద్యోగాన్ని. ఏదో విలాసాలకైనా ఉపయోగిస్తుందిలే అనే భావంతో పని చెయ్యడం మరో విషయం.

మీరు ఉద్యోగం చేస్తున్నా మీ కుటుంబంలో శాంతి సౌఖ్యాలు ఉండాలంటే, మీ కుటుంబం అంతా కలకల్లాడుతూ ఉండాలంటే మీరు కొన్ని సంగతులను ముందుగా గ్రహించుకొని అందుకు అనుగుణంగా నడచుకోవలసి ఉంది. మీకు సహాయకారిగా ఉండడానికి కొన్ని సూచనలు ఇక్కడ ఇస్తాను :

మీరు, ఏదో విమోచనం కోసం పోరాడుతున్నామనే భావాన్ని వదలిపెట్టాలి. కొన్ని కుటుంబాలలో స్త్రీలు పురుషులయందు, ముఖ్యంగా కట్టుకున్నవారియందు వీర వనితలులా ప్రవర్తించడం కద్దు. ఇది క్షేమకరం కాదు. పురుషుడు స్త్రీలను అణగద్రొక్కుతున్నాడని, తమని కీలుబొమ్మలా ఉపయోగించుకుంటున్నాడని అనుకోవడం వల్ల, దాని ఫలితంగా తిరుగుబాటు స్వభావాన్ని ఏర్పరచుకోవడం వల్ల సాధించగలిగేది ఏమీ లేదు. అందుచేత మీ భర్తయందు ప్రేమను పెంపొందించుకొందుకు ఎక్కువగా ప్రయత్నించాలి.

'ఇది నా డబ్బు' అనే అభిప్రాయం వదలి మొత్తం ఇద్దరి ఆదాయంతోనూ కుటుంబ అవసరాలు సులభంగా గడచేటట్టు చూసుకోవాలి.

మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. "నేను ఉద్యోగం చెయ్యడం వల్ల నాకు ఎంతవరకు తోడ్పడింది? పిల్లల విషయంలో ఆర్థికంగా తోడ్పడగలుగుతున్నానా? నేను ఉద్యోగం చేయడం వల్ల మొత్తంమీద కుటుంబంలో స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయి?"

పిల్లల్ని మీరు అశ్రద్ధ చేశారా కుటుంబం కూలిపోతుంది. తరవాత పశ్చాత్తాపడి ప్రయోజనం వుండదు. మొదట్నించీ మీరు వద్దని పెడుతూన్న పోరే ఇంతా చేసింది, అని భర్తను అనుకున్నా ఉపయోగం ఉండదు.

ప్రతి పనీ మీరు చెయ్యడానికి అవకాశం ఉండదు. మామూలుగా ఖాళీగా ఉన్నప్పుడు చేసినట్టుగా. ఇటువంటప్పుడు మీ ఆయనా మీరూ కూర్చొని ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది. మీ ఇంటి పనుల్లో సహాయం చేయడానికి ఎవరినైనా అవసరమైతే తక్కువ ఖర్చుతో కుదుర్చుకోవడానికి వెనుదీసి రెండువిధాలా బాధపడడం మంచిదికాదు.

ఇటు ఇంటి పనులన్నీ మీరే చూసుకుంటూ, అటు ఉద్యోగం రోజంతా చెయ్యాలంటే అసాధ్యం. ఆc, అదేమిటిలే అని రెండూ మీరే చెయ్యబోతారు. అందని సముద్రంలో ఈత ప్రారంభించినట్టవుతుంది. తరువాత మీకే తెలిసివస్తుంది!

ఎవరినైనా పనిమనిషిని పెట్టుకున్నా మీరు 'మీరు'గా చేయవలసిన పనులేమిటో గుర్తు పెట్టుకోవాలి. వాటిని అశ్రద్ధచేసి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారా ఫలితాలు సక్రమంగా ఉండవు.

ఉదాహరణకు చూడండి. వంటఇల్లు భోజనాల గది శుభ్రంగా ఉండేటట్టు ప్రత్యేకం మీరు శ్రద్ధతీసుకోవలసి వస్తుంది. లేక పిల్లల బట్టలు చినిగితే సూది దారంతో మీరు సరిచెయ్య వచ్చు. అవసరమైతే కొన్ని సుఖాలు వదులుకునైనా మీరు ఈ పనులు చెయ్య వలసి వస్తుంది.

మీ భర్త ఏదైనా అసంతృప్తిగా ఉన్నారనుకోండి. వెంటనే ప్రశ్నించుకోండి. 'ఆయన నాయందు ఏర్పడ్డ ఈ అసంతృప్తి సబబైనదేనా, అని సబబే అయితే మీరు దానిని తొలగించాలి.

భోజనం చేసేటప్పుడు మీరు దగ్గర ఉంటే ఆయన ఎక్కువ సంతోషిస్తారు. వీలైనంత వరకూ ఉండేందుకే మీరు ప్రయత్నం చెయ్యాలి. ప్రతి భర్త భార్య నుంచి ఆశించేవి కొన్ని సంగతులు ప్రత్యేకంగా ఉంటాయి.

స్త్రీలు - సంసారం - ఉద్యోగాలు

వాటిలో ముఖ్యమైనది తనభార్య తనయందు నిజమైన శ్రద్ధా భక్తులు చూపాలి అన్నది. ఇటువంటి ప్రధాన విషయాల్లో అశ్రద్ధ తగదు.

మీరు ఉద్యోగం చేస్తున్నా, ఎంత పెద్దగా సంపాదిస్తున్నా ఆధిక్యతను మీరు కైవశం చేసుకుంటున్నారనే భయం ఆయనకు కలుగకుండా చూసుకోవాలి మీరు.

అన్నిటికంటె ఎక్కువగా మీరు సౌహార్ద్ర భావాన్ని వృద్ధి చేసుకోవాలి. పరిస్థితులకు అనుగుణంగా నడచుకోవడం నేర్చుకోవాలి అవసరమైతే, ఏదైనా చిన్న అసౌకర్యం కలిగినా—ఎక్కువ పట్టించుకో కూడదు. మీరు చేసే ఉద్యోగం మీ జీవితాన్ని —ఎక్కువ సుఖవంతం చెయ్యాలి. మీ ఇద్దరిమధ్యా సామరస్యం ఏర్పడినప్పుడు — మీ ప్రయత్నం విజయ వంతమయినట్టే. అతి జాగ్రత్తతో ప్రవర్తించి 'ఇతరులకు ఆదర్శంగా ఉండాలి' అనే ఆశయంతో ముందుకు పోతే జయంమీదే.

(సన్ డే స్టాండర్డునుండి)

మీకు తెలియునా?

1. ప్రపంచంలో బహుళ ప్రయోజన కరములైన నదీలోయ ప్రాజెక్టులలో అన్నింటి కంటె పొడవైన ఆనకట్ట ఏది?

(ఎ) హూవర్ ఆనకట్ట (యునైటెడు స్టేట్స్ ఆఫ్ అమెరికా)
(బి) హీరాకుడ్ ఆనకట్ట (ఇండియా)
(సి) హూణనది ఆనకట్ట (చైనా)

2. ఇండియా ప్రభుత్వ నల్లమందు ఫ్యాక్టరీ. ఈ క్రింద పేర్కొన బడినచోట వున్నది :

(ఎ) ఘజియాబాద్.
(బి) ఘాజీపూర్
(సి) గాజులపల్లి

3. 1948 నుంచీ ఇండియాలో బి. సి. జి. టీకాల మందును వాడడం మొదలు పెట్టినప్పటి నుంచీ క్షయవ్యాధి పరీక్ష పరీక్షలు జరుపబడినవారు.

(ఎ) ప్రతి 20 మందిలో 1 రికి
(బి) ప్రతి 15 మందిలో 1 రికి
(సి) ప్రతి 30 మందిలో 1 రికి

4. ప్రథమ పంచవర్ష ప్రణాళిక మొదటి రెండు సంవత్సరాలు (1951-52 ; 1952-53) లోను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పుగా ఇచ్చిన మొత్తం.

(ఎ) షుమారు 90 కోట్లు
(బి) షుమారు 184 కోట్లు
(సి) షుమారు 121 కోట్లు

5. కమ్యూనిటీ ప్రాజెక్టుల కార్యక్రమం ఇండియాలో ఈ తేదీన ప్రారంభించ బడింది.

(ఎ) ఆగస్టు 15, 1951
(బి) అక్టోబరు 2, 1952
(సి) జనవరి 26, 1953

జవాబులు.

1 — (బి) ; 2 — (బి) ; 3 (బి) ; 4 — (బి) ; — 5 (బి).

ఆవు బేరం

శ్రీ ఆయపిళ్ళ సత్యనారాయణమూర్తి.

[సమయం : మధ్యాహ్నం పన్నెండు గంటలు.
స్థలం : పంతులుగారి గృహం.
పాత్రలు : పంతులు. కమలం : పంతులు భార్య.]

పం: అయితే ఇంతకూ ఆవు ఉండాల్నంటావు ?

క : ఇంత సంసారం అంటూ వున్నతరువాత పాలగొడ్డు ఉండాల్లెండీ ! ఏ అవసరానికది చూచుకోనక పోతే ఎట్లా చెప్పండీ ?

పం: సంసారానికి ఇట్టాంటివి ఎన్నో అవుసరాలు గడుపుకుంటూ వచ్చాను. ఎప్పటికప్పుడు అదే అవుసరం ! అవుసరం కానిదంటూ ఒకప్పుడుందా?

క : ఎన్ని అవుసరాలు గడుపుకుంటూ వచ్చారబ్బా ! పాపం ! చెప్పండి చూతాం మీరు గడుపుకుంటూ వచ్చిన అవుసరాలు ?

పం: చెప్పనా ?... నాకు పెళ్ళికాకపూర్వం మా తాత ఎన్నో చీవాట్లేసేవాడు "ఒరేవ్ ! అట్లా బడుద్దాయి జేవార్సులాగ తిరగబోకురా ! చక్కని దాన్ని చూసుకుని వేగం పెళ్ళాడు - ఇల్లాలులేని ఇల్లెందుకురా" అని___

క : ఒహ్హో ! మహాఘనమయిన అవుసరం తీర్చుకున్నారే !

పం: ఆc - మరేమిటి !- ఆ తరువాత-

క : హమ్మయ్య ! ఎంత ఘనకార్యం చేసేశారు ! గట్టిగా అనబోకండి - నలుగురూ మీరు చేసిన ఘనకార్యాన్ని విని - హుc...హ్హా...హ్హా...(నవ్వుతుంది)

పం: చెప్పూ ! చెప్పూ ! విని?___

క : కానీండి గాని ఇంకా ఏ వేం ఘనకార్యాలు సంసారం గడుపుకుందికి చేసేరో చెపుదురూ విన ముచ్చటగా వున్నది.

పం: అడుగులోనే హంసపాదంటివి. ఇహనేం చెప్పేది ?

క : మరిహ అనల్లెండి- చెప్పండి___

పం: ఏముంది ? అర్ధాంగిగారు వచ్చారు ! ఆ వచ్చినావిడ వొచ్చినట్టుగ ఊరుకుందా ? ఆమెకు పిల్లలు కావలసి వచ్చారు___

క : చాలు ! చాలు ! ఊరుకోండి___

పం: అట్లా నేను ఊరుకోను. నేను చేసినవి ఘనకార్యాలు అయినా కాకపోయినా, నేను అవుసరాలను ఎట్లా గడుపుకుంటూ వస్తూవున్నానో చెప్పుకోనియ్ మరి ! ఆవిడగారికి పిల్లలు కావలసొచ్చారా ? ఒక్కటే గోల పెట్టేది !

క : ఉ-వ్వ ! దొంగ ! ఏమ్మాటలవి ?___

పం: తప్పుతుందా ? పిల్లలూ వచ్చారు. మొదటి ఇద్దరు పిల్లలూ మగ పిల్లలయిపోయారు - కమలం - అంటే నా అర్ధాంగి ఒక్కటే పలవరింతలు ! "ఈ ఇద్దరు వెధవల్లోను ఒక్కడు ఆడ పిల్ల అవకూడదా ?" అని___

క : అమ్మ దొంగా ? నేనట్లా అన్నానా ?

పం: లేదూ ?

క : ఇద్దరూ మగపిల్లలయిపోయారుగాని-అందులో ఒకరయినా ఆడపిల్ల అయితే నాచేతికింత ఆసరా అవును కదా అన్నాను గాని___

పం: అన్నావా ? వాళ్ళిద్దర్లోను ఒకడు ఆడపిల్లగా ఎందుకవాలె ?___నీకు కావలసినది ఆడ పిల్లకద ! అందుకు ప్రయత్నాలు చెయ్యకూడదా?

క : మన చేతుల్లో ఏమున్నదండీ ?

పం: ఉన్నది !! ఉన్నది కనుకనే !!

(చిన్న చిన్న నవ్వులు ఇద్దరూ నవ్వుకుంటారు)

క : బాగున్నయ్ మీ మాటలు గాని___సంతకు వేళకా

బోతున్నట్టున్నది. చూడండీ – పాలక్రింద బోలెడంత డబ్బు పోసుకోవటం, తృప్తి లేకపోవటం జరుగుతుంది—

పం: నిజమే! నాకూ తెలుసును – ఈ పట్టణాల్లో డబ్బిచ్చి పాలుకొనుక్కుంటూ వున్నాము అనేకన్నా డబ్బిచ్చి నీళ్ళు కొనుక్కుంటున్నాం అంటే బావుంటుంది. సామెత ఉండనేవున్నది. 'నల్లనివన్నీ నీళ్ళూ – తెల్లనివన్నీ పాలూ' అని – ఇక్కడ వన్నీ తెల్లని నీళ్ళు! – సరిగాని గేదె కావాలంటావా? ఆవు కావాలంటావా! పట్టణాల్లో గేదెగొడ్డును భరించడం కష్టం! అయినా పాలు సమృద్ధిగా కావలెనంటే గేదె చాలా మంచిది.

క: నల్లగా నీలికొండలల్లె ఏం గేదెలండీ? పాలిస్తయ్! ఎందుకూ? పథ్యాలకూ, పానాలకూ పనికిరావు. పైగా జబ్బులు చేస్తయ్. పిల్లలకు ఉపయోగించవు – ఇంటికి ఆవుగొడ్డే అందమండీ! పాలకు పాలూ ఇస్తుంది. చూపుకు, చూపూ బావుంటుంది. పాలు పథ్యాహారం. పిల్లలకు జబ్బులు చెయ్యవు. పైగా బలమయిన ఆహారం!

పం: నాకూ తెలుసును పాలల్లోగల తేడాలు. ఇంతకూ నీకు ఆవుగొడ్డు కావాల్నె కదూ!

క: చక్కని చిన్న ఆవుచూడండి. మేపుకు అంతకష్టం వుండదు. పగటివేళ ఆవుఎట్టాగూ మేతకు పోతుంది. ఇంటికి చేరుకొనేసరికి రెండు గడ్డిపరకలు పారవేస్తాం. పాలు మనమే పిండుకొన వచ్చును. తన్నే గొడ్డును మట్టుక్కు కొని తేబోకండి.

పం: సరిలే! తన్నే గొడ్డును మట్టుక్కు కొనను.

క: మీరిక్కడ మాటలే. అవతలకు వెళ్లబోతే ఎమీ చేత కాదు! జాగ్రత్తగా పరికించి మరీ కొనండి ఆవును. గొల్లగురువులుకు కబురు చేశారు గావును!

పం: అవును – గొల్లగురువులు అనుదినము ఎన్నో ఆవులకు పాలు పిండుతూ వుంటాడుకదూ! వాడికి వాటి ఛాయలు, అంచనాలు, ఆనికలు, పోలికలు బాగా తెల్సుస్తాయ్. అందుకనే కబురెట్టాను.

క: అదిగో! గురువులు మాటలోనే వచ్చాడు!

గు: బాబూ! పంన్నెండు దాటవచ్చిందీ బయల్లెల్లుదామా?

పం: పదవయ్యా! నీగురించే చూస్తున్నాను.

(ఒక్క ప్రక్కనుండి నిష్క్రమిస్తూ వుంటారు)

క: చూడండీ! ఆవు చక్కని తెలుపురంగు కలిగినది చూడండి. అట్లాంటిది లభ్యంకాకపోతె ఏదన్న గులాబి రంగుదిగాని – బూడిద రంగుదిగాని ఏదో ఒక్కటే రంగున్నది కొనండి. మచ్చల గొడ్డును మటుక్కు కొనితే బోకండి.

పం: సరిలే! మచ్చల గొడ్డు మటుక్కు కొనను –

(పంతులు, గురువులు వెళ్ళిపోతూ వుంటారు)

క: ఏమండీ! ... ఏమండీ!!—

పం: (కొంతదూరం నుండి) ఏం?

క: మాట! ఇట్టారాండి —

(తిరిగి రెండులిప్తలకాలం నిశ్శబ్దం)

(తిరిగి ప్రవేశించి)

పం: ఇస్! అబ్బ! ఇంకా ఏం కనీసపు కోర్కె లుండి పోయినయ్ యేం – నీ ఆవును గురించి –

క: అబ్బా! అట్లా విసుక్కుంటె ఎట్లా చెప్పండి. కొనేది ఆవుగొడ్డాయెను. పదికాలాలపాటు మనింట్లో వుండబోతుంది. మంచీ – చెడ్డా అనుకో వద్దటండీ?

పం: నే కాదన్నానా! కాని ఆ చెప్పదలచుకున్న దేదో ఒక్కతూరిగ చెప్పేరాదా? ఎండలో అంతదూరం పోయి తిరిగి వస్తిని.

క: మీరు నాలుగు సంగతులూ తెలిసే మనుషులయితే నే చెప్పేది ఎందుకండీ? నేను నాలుగూ ఇట్లా మీతో ఘోష పెట్టకపోతే అక్కడికెళ్ళి పప్పులో కాలు జారుస్తారు!

పం: సరి! నేనొట్టివాజమ్మను! కాని చెప్పూ – ఇంకా ఆవు ఎట్టా వుండాల్నేం?—

క: చూడండి! చక్కని కొమ్ములుగల ఆవును చూడండి!

పం: కొమ్ములుగల ఆవా? ఏం? –

క: కొమ్ములున్న ఆవు చూపుకు బావుంటుందండీ! ముఖ్యంగా కొమ్ములున్న ఆవు పొడవ దండీ!

ఆవు బేరం

పం: సరి! సరి!! కొమ్ములు లేని ఆవును కొనను- ఇంక వెళ్ళనా?

క : ఊఁ...వెళ్ళండి! ... సొమ్ము జాగర్త!- ఆవును బాగా చూసి కొనండి.....డబ్బు.....పదిలం...

(స్వగతం) (దారిమధ్య)

పం: హుం ... (చిన్న నవ్వు) కొమ్ములున్న గొడ్డు పొడవదు కాబోలు! నిండుకుండ తొణకదు అన్న సామెతలోగల అర్థాన్ని ఉపయోగించుకుని ఉంటుంది కమలం!.

(నాకు పెళ్ళికిముందు మీసాన్ని, నూగు నూగు మీసమయినా పూర్తిగా తీసివేసేవాడను. కమలం వొచ్చిన దగ్గర్నుండి అట్లా చెయ్య నివ్వటంలేదు.)

"మీసం మగమనిషికి అందమండీ! అట్లు ఆడదానల్లె మీరు మీసం తీసెయటం బాగోటంలేదు. మీసం ఉంచండీ" అని.

మీసం తిరిగి పెంచ వలసి వచ్చింది. ఇప్పుడు కమలం ఉద్దేశ్యం బయటపడ్డది. బోడికొమ్ములు ఆవుమల్లె మీసం లేకపోతే విరగబడి తంతానని - పొడుస్తానని ఆమెకు భయం కలిగి వుండవచ్చును.

మీసం పెంచితే సాధువుగ ఆమె చెప్పు చేతల్లో ఉండబోతాననే విశ్వాసం ఆమెకు కలిగి ఉండాలె! నిజం ఎంతమట్టుకో-గాని పెళ్ళి కాకముందు - అంటే నాకు మీసం లేని రోజుల్లో మహా అల్లరి చేసేవాడనట!

కమలం వొచ్చిన దగ్గరనుండీ అంటే నాకు మీసం పెంపొందిన దగ్గరనుండి ఒట్టి చవట వాజమ్మ నయిపోయాను. ఆమే అంటూంటుంది "మీరు ఎందుకూ పనికిరార"ని

కమలం కాలేజీలో చదవలేదుగాని, చదివేవుంటే మహా గొప్ప శారీరక తత్వవేత్తిని అయ్యేది!

(సంత సీను)

గురు: బాబూ! పంతులుగారూ! మీరిట్లా ఏమో ఆలోచిస్తోవుంటే కార్యం సాగదు. చప్పున బేరానికి ఆదుకోవాల!

పం : అట్టాగనే కానీవోయ్!

గు : చెప్పండి మీకే 'ఒదుపు'లోగల ఆవు కావాలనేం?

పం: నాకు ఆవెందుకయ్యా!

గు : సరి! సరి! బాగావుంది!!

సం: అది కాదు! నాకు ఆవెందుకు? మీ అమ్మగారికే ఆవు అవసరం వస్త! అమ్మగాయ చెప్తోంటే వినటంలేదూ ఎట్టాంటి ఆవు కావాలనో?

గు : ఆడోరి కోరికకు లెక్కేటి బాబూ! చప్పున మీరో ఆలోచనకొచ్చి ఫలానా 'యావు' అంటే 'ఛటిల్' చేద్దాం!

పం: మీ అమ్మగారి కోర్కెలు చెల్లించి తీరాలె! అవి చెల్లించకపోతే పొయ్యేదేమీ నీకు కాదు నాకు! అందుచేత నేను ఆమెకు నచ్చే ఆవు జాడలు పరిశీలించుకుంటాను. కాని నా కనీసపు కోర్కెలు నువ్వు పరికించి చూడాలె! ఆవు కనీసం పూటకు శేరు పాలయినా ఇచ్చేదయి ఉండాలి. ఖరీదంటావా? అది వంద రూపాయలకు మించకూడదు.

గు : నికరంగా శేరు పాలిచ్చే ఆవుగొడ్డు వంద రూపాయిలకు వస్తదండీ? అట్టాపోతే నే నీపాటికి పదావుల్ని పెరట్లో కట్టి ఉందును.

పం: మాట కన్నానయ్యా! ఓ పదో పరకో అటో ఇటో అవుతుందనుకో!

గు : అద్దిగదీమాట! అట్టాగనండి! ఇక రండి! ఇది చూశారా ఆవు మేరుపరువతం!- అయిదు శేర్లు ఇస్తదనటంలో సందేహం లేదు -

పం: రెండు కుంచాలిస్తే మట్టుకు- ఎవరికి కావాలయ్యా! అంత పెద్ద ఆవు కూడదు!-

గు : సరిలెండి! ఇది చూశారా చిన్న ఆవు. ఈనబోతది! అంతా పది పదిహేను దినాలు లోపు-

పం: ఆవు కొలతకు సరిపోతుంది గాని వద్దయ్యా!

గు : ఏమండి!

పం: రంగు బాగోటం లేదు-

గు : రంగెట్టాగుంటే నేమండి?

ఆవు బేరం

పం : వద్దు! వద్దు!! మచ్చళ్ళ మచ్చల గొడ్డు మట్టుక్కొనేది లేదు–

గు : పోనివ్వండి గాని...ఇదిగో ఇది చూశారా? మచ్చలు కూడ లేవు. చిన్నది! ఆవంతా ఒక్కటే రంగు. ఎట్టని ఎరుపు. శేరున్నర పాలకు అంచనా వెయ్య వచ్చును.

పం : దానికి కొమ్ములు లేవయ్యా గురువులూ!

గు : కొమ్ములు లేకపోవడమే మంచిదండి! పాల గొడ్డుకు కొమ్ములుంటే ఏమండి– లేకపోతే నేమండి?

పం : నీకు తెలియదులే! నా ఆవుకు కొమ్ములెట్లావుండవలెనంటే– పందెపు గొట్టెపోతుకు మల్లే కొమ్ములు తిరిగి తిరిగి వుండాలె!

గు : సరి! సరి!! ఇది చూడండి–

పం : ఇది బాగానే ఉన్నట్టున్నది. ఆవు పొట్టిగా చక్కగా ఉంది. కొమ్ములు కూడ వంపులు తిరిగి వున్నయ్. ఆవంతా చక్కటి తెలుపు! అనుకున్నట్టుగానే ఉంది.

గు : సరి లెండి! పదండి అడుగుదాం!...............
ఏమయ్యా! చెట్టుకిందోడా! బేరం ఏం చెప్పావు?

ఆవుగల ఆసామి : వందన్నర కడుగుతున్నారయా!

గు : ఇయ్యావునా? చెప్పావస్సె! అడిగేమాట మాకెందుకు? నీ బేరం చెప్పవయ్యా?

ఆ : మీరడగండి! వందన్నర పైమాట.

గు : ఎవరయ్యా వందన్నర కడిగింది?

ఆ : అరుగోండి ఇటే వస్తున్నారు.

పం : ఇదేమిటోయ్ గురువులూ! వీళ్ళు పోటీ బేరగాళ్ళల్లె వున్నట్టు ఉంది.

గు : ఆరేమి తగుల్తారు బాబయ్యా పోటీ! మనమే పోటీకి లంకించుకుంటే– హుఁ! పల్లెటూరి నాయళ్ళు!

పం : వందా ఏభైకన్న ఎక్కువ చేస్తుందంటావా?

గు : ఏమయ్యా చెట్టుకిందోడా? పాలమాటేంచెప్పావు? పొదుగులో చెయ్య వెయ్యొచ్చా!

ఆ : ఏసి చూడండి. అట్టాంటి ఆవు కాదు. వొట్టి మేక– మేకంటే నమ్మండి. ఇంటికాడ జరక్కపోబట్టిగాని ఇది అమ్ముకోవడమేం కర్మం! ఇయ్యావు పాలుండే– మా ఆడంగులే కదూ తీస్త!

గు : ఏమండీ బాబుగారూ ఏమంటారు?

పం : నే నేమనేది? మా అమ్మగారు ఇట్టాంటి ఆవునే కావాల్నన్నది. అడిగి చూడు పాలజాడ!

గు : ఏం మాఁవాఁ! శేరు చుక్కలిస్తదంటవా?

ఆ : బలేగా అడిగినావు అల్లుడూ! శేరు చుక్కలిచ్చే ఆవుకు వందన్నర ఇచ్చి పొయ్యావటయ్యా!

గు : ఆసిరి! ఇయ్యావు ఆపైన ఇస్తదంటావా?

ఆ : పందెం కట్టు! మాటమీద నిలబడు– శేరు పాలకు వంద రూపాయలు ఇస్తావా? అంతే పందెం! సవాల్!

గు : శేరున్నర పాలు ఇస్తదంటవా?

ఆ : అనుకోడాలు వగ్గేయి. మాట కరారు అంతే! శేరు పాలకు వంద రూపాయిలు ఖరీదు! పెట్టండి మీపందెం సవాల్– జమ్ములనాయుడూ సవాల్! జబర్దస్తీ సవాల్!

గు : ఏమండీ పంతులుగారూ ఏమంటారు?

పం : అట్టాంటి పందేలు మన కెందుకయ్యా గురువులూ! వొద్దు– పాతికో పరకో– అటో ఇటో పడనియ్యి– ఎంతకో అంతకు తెగదెంపులు చేసుకోవాలె గాని ఇప్పుడే పందేల్లో ఎట్టాపడమన్నావయ్యా!

గు : ఎబ్బె! మాటకంటున్నాడు పంతులుగారు! అంతే గాని పందాలు వేస్తామా? తమ మాట శెలవివ్వండి! చూడండి వాడు అట్టా పందాలు వేస్తూ వున్నాడంటే– ఆవు అంత ఖచ్చితమయిన గ్యారంటీగా పాలు ఇస్తాందన్నమాట!

పం : వందా యేభైకి అడిగి చూడూ!

పోటీదారులు : ఏమయ్యా! వందా యేభైకి తటపటాయిస్తున్నావు– ఇచ్చేదా లేదా?

పం : (మెల్లిగా) సరి! సరి! పోటీ బాగానే పడ్డట్టుంది గురువులూ!

గు : పంతులుగారూ ఇట్టా రాండి మాట.

(అరలిప్త కాలం నిశ్శబ్దం)

గు : (పంతులుకు చెవిలో) మీకు ఆవు కావలెనా చప్పున బేరంకొనండి.

పం : ఏంచెయ్యమన్నావ్. వందా యేభైకి అడుగుతున్నారయ్యే! వీళ్ళిక్కడ దాపురించారయ్యా మనమీదకు.

గు : ఇస్! నెమ్మది! ఆపోటీదారులిటే వస్తున్నారు.

పో : బాబూ! పంతులుగారూ నమస్కారం.

పం : నమస్కారమండీ నాయుడుగారూ.

పో : తమకు ఆవు గావాల్నండి?

పం : అవునండి నాయుడుగారూ!

పో : చూడండి మనలో మనం పోటీలు పడకూడదు. ఇలా మనం పోటీలు పడి అవు ధరను పెంచేస్తున్నాము.

పం : అదేనండి నేనూ అనేది!

పో : ఇయ్యావును నేను నూటఏభైకి చేజిక్కించుకుందామని చూస్తున్నాను. మీరు మరొక ఆవును చూసుకోండి!—

గు : చాల్లేవయ్యా? మహా గొప్ప సాయం చేయొచ్చావు? ఇంతకూ ఆవు కొనవద్దని-అయ్యావును నీకు వొగ్గేయమని చెప్పొచ్చావు? ఇట్టా చూడు! అగ్గిమీదగుగ్గిలం పడేది ఆవును వదలం - వెళ్ళండి—

పో : చరిలెండి!—

పం : ఎందుకయ్యా గురువులూ మనకీ లేనిపోని తగవులు. ఆ నాయుళ్ళెవరో పాపం - మనలాగునె ఆవును కొనటానికి వచ్చారు. వారినే తీసుకుని పోనియ్. ఇంతకూ ఆ గొడ్డు వారింట్లో పడాలని రాసుంది! వెళ్తుంది!—

గు : ఎట్టి వేదాంతం మాటాడకండి పంతులుగారూ! నాకు మట్టుకు ఆడు అన్న ముక్కలకు ప్రాణం మహా సాలొస్తోంది. ఆవును ఒగ్గుకోమంటాడేం? ఈడు గురువులని తెలదు కాబోలు. ఆడికే తెలుసు మహా గొప్ప బేరాలు—

పం : పోనియ్యవయ్యా గురువులూ!-

గు : ఆ నాయుళ్ళెవరనుకున్నావు? ఆవు బేరగాళ్ళు! వాళ్ళకిదే గాదంటండీ వృత్తి! ఇట్టా బాగా పాలిచ్చే మంచి జాతి గొడ్లను కొని మరుచటి వారంనాడు ఇంకా రెట్టింపు ధరలకు అమ్ముకుని అధిక నాభాలు దోచుకుంటారు. ఇది నల్ల మార్కెట్టు అని ఎవుడూ అనడు కద!

పం : నిజమయిన మాటన్నావయ్యా గురువులూ!

గు : చూడండి కావలిస్తే - మరుచుట్టు వారంనాడు రాండి! వీళ్ళే అయ్యావును రెండొందలకమ్ముతారు.

పం : అయితే వందా ఏభైకి అడుగూ!

గు : ఊఁ - ఊఁ... నాకు నమ్మిక లేదు. అయినా చూద్దురగాని -

ఏమయ్యా ఆఖరితూరి అడుగుతున్నాను. వందావేభై!- ఆవుగల ఆసామీ : రాదెల్లవయ్యా! వందన్నరపై మాట చెప్పా.

గు : ఏమండీ! ఏమిటి చెప్పండి - మహా జాతి అయిన గొడ్డు. పాల జాడ జర్రిపోతల్లె కనబడుతూవుంది. మీ ఇష్టం!-

పం : మరింక లేదయ్యా గురువులూ!

గు : సరిలెండి! మీరిక్కడ వుండండి. నేను మాటాడి వస్తాను.

పం : వెళ్ళి చూడు!-

గు : ఏమయ్యా ఆవునిట్లా అప్ప జెప్పా!

ఆ.ఆ: మహా కొనేవాడల్లె అడుగుతున్నావులె!-

గు : ఏరా! గురువులు కాకపోతె మరెవుడ్రా కొనేదీ ఆవును. ఇట్టా ఇవ్వు!

ఆ.ఆ: ఏందోరె గురవులూ, ఇట్టాంటి బలవంత బ్బేరం ఎన్నాళ్ళ నుండీ?

గు : ఓరి నాయుళ్ళూ! ఇందవోయి నీ డబ్బు -

ఆ.ఆ: ఎంత?

గు : నూట వేభై!

ఆ.ఆ: అద్దిగది! రెడ్డొచ్చి మొదలాడమన్నాడట - అదిగో- మీపక్కను నిలచుండో వోరిని చూశారా నూట ఏభైకి అడిగేవున్నారు. ఆరిదే ఈయావు.

గు : ఏంది? ఆరికెట్టా ఇత్తావు. నేను బేరం చేస్తావుంటె.

ఆ : ఎల్లయ్యా! నేను సంతలోకి రాక మునుపు దగ్గర

ర్నుండి ఆరు నూట ఏభైకి అడుగుతున్నారు. నీకెట్టా ఇచ్చేది.

గు : నాకియ్యావూ? ఎట్టాగియ్యవో చూస్తాను.

ఆ.ఆ: ఇదిగోండి బాబూ నాయుళ్ళుగారూ. ఆవును మీ చేత బెడుతున్నాను.

గు : ఇట్టాగియ్యవయ్యా నాయుడుగారూ ఆవు కన్నెత్రాడు.

పో : ఏందయ్యా అజబర్దస్తీ! పట్నం వోడివనా? శక్తి వుంటే పై బేరం ఆడి ఆవును ఇడిపించుకో_ ఎందుకొచ్చిన మాటలు_ నేల ఇడిసిన సాములు!

గు : మాటలు మిగలా యిచ్చుకుంటున్నారు! జాగరత! ఇట్టా ఇవ్వండి ఆవును.

పో : ఇవ్వం_ ఇందవయ్యా ఆవుగల వోడా నీయడ్వాన్సు'

గు : అట్టా ఆగండి_ ఇదవయ్యా ఆవు గల వోడా నా అడ్వాన్సు.

ఆ.ఆ: మీ ఎడ్వాన్సు ఎట్టా పుచ్చుకోనేది? ఆరికి బేరం అయిపోయింది.

గు : ఏందిట్టా మాయతనం. చూస్తానుగద ఈ యావును ఎట్టా తోలుకెడతారో!

పో : ఎల్లవయ్యా మేమూ చూశాము.

గు : మాటలు మిగలా యిచ్చుకుంటున్నారు. జాగరత!

పో : ఏమిటయ్యా నివు జేసేదీ?

గు : ఆ కన్నెత్రాడు ఇట్టా ఇవ్వండి.

పో : ఇవ్వం_

గు : ఇవ్వండి_

పో : ఇవ్వం.

గు : ఇవ్వండి.

పో : ఇవ్వం_ ఇవ్వం!

పం : ఏమయ్యోయి గురువులూ! ఎందుకేమిటి ఆదెబ్బలాటలు. వారు ఇవ్వమని అంటున్నారు_ పోనియ్. మనం మరొక గొడ్డును చూసుకుందాం_

గు : నేనా? దీన్ని ఇడిసిపెడతానా? రొక్కం యిచ్చుకునయినా ఇంటికాడ కడతాను గాని_

పో : అంత పవురుసం ఉన్న వోడివి మరో పది ఇచ్చి ఇడిపించుకోవయ్యా.

గు : దమ్మిడీ ఇచ్చేది లేదు. ఒగ్గండి ఆవును.

పం : గురువులూ! పదవయ్యా. మధ్య వారితో ఎందుకు తగవులాటలు. మనం ఆవు అవుసరం వుండివచ్చాం. వారూ ఆవు అవసరం వుండి వచ్చారు. అవుసరాలు అందరకూ ఒక్కటే! ఆవును వారినే తీసుకు వెళ్ళనియ్!

పో : ఏమండి పంతులుగారూ! తమకు ఆవు అంత అత్యవసరమా?

పం : కాగట్టండి. అయినా మీరు కొనుక్కున్నారు. తీసుకెళ్ళండి. నేను వేరె ఆవును చూసుకుంటాను.

పో : పోనివ్వండి. మీకంత అవసరం కలిగివుంటె మేమీ ఆవును తమకు వదలివేస్తాం.

పం : చాలాసంతోషం!_

పో : ఏదో ఈవరకూ మేము అవునుగురించి తిరిగాం_ కడావరకు లభ్యమయిన ఆవును తమకు పోటీ లేకుండా అదే బారానికి ఇడిచిపెడుతున్నాం. మా శ్రమకు ఫలితంగ పది రూపాయిలు మాత్రం అదనంగ ఇవ్వాలి

గు : ఊరుకోండి _ నాయుళ్ళూ! పది రూపాయిలు పుచ్చుకుంటారా పంతులుగారి వద్ద. ఐదు రూపాయిలు ఇస్తారు.

పం : గుగువులూ! అట్టాంటివి వద్దయ్యా_

గు మీకు తెలవదండీ_ఏమయ్యా నాయుడుగారూ, అయిదు రూపాయిలు!_ సంయా! చెప్పండి_

పో : సరితె! లేండి!_

పం : వద్దయ్యా గురువులు!

గు : ఉండండి! ఈ అయిదు రూపాయిలు నా జేబిలో విచ్చుకుంటాను. ఇందవయ్యా సొమ్ము. అయిదు రూపాయిలు.

పో : కడకు గురువులు మాట నెగ్గించుకున్నాడ్రా.

ఆ.ఆ: ఏమన్నా గురువులు మా గడుసోడు_

పో : నూట ఏభైకే దక్కించుకున్నాడు_

(ఇంకా వుంది)

శ్రీ త్యాగగురుస్తుతి కీర్తనలు

శ్రీమతి కె. యమ్. సౌందర్యవల్లి

కీర్తన-21

రాగం వలజి — ఆదితాళం.

ఆ. స గ ప ద ని స, అ. స ని ద ప గ స

ప॥ అతడే ధన్యుడురా, సతతము రాముని స్మరణచేసిన ॥అ॥

అ॥ యతివలె రాగదుర్విషయము మతలను
హతముగజేసి సద్గురువని నుతిగన్న ॥యతడే॥

చ॥ ధరలో తిరువాలూరను స్థలమున
ధరణీ సురవరుడై జన్మించిన
వరగానామృత రతుడై మించిన
సరస త్యాగ రాజని నుతిగాంచిన ॥యతడే॥

	0-2	1-4	1-4
ప॥	; సా గా సా ; స గ స ని ద ని	సా ; ; ;	; ; ; ;
	అ త డే ధ . . న్యు డు.	రా	
	; సా గా సా ; స గ స ని ద ని	సా ; ; ;	; ; ; ;
	అ త డే ధ . . న్యు డు,	రా	
	; స స గా గా గ స గ ప గ పా గ	సా ; స గా స	స స ని ద పా గ ప
	స త త ము రా - - - - ము	ని స్మ ర ణ	చే - - - సి న .
	ద ని సా గా సా		
	. . అ త డే॥		
అ॥ప॥	; గా పా ద నీ సా ; స సా	సా సా గా గా	గ స గ ప గా సా
	య తి వ లె రా గ దు	ర్వి ష య మ	మ . త . ల ను
	; సా గా సా సా స స ని ద ప ద	నీ సా సా ని ద	గా పా ద ని సా
	హ త ము గ చే - - - సి స	. ద్గు రు వ ని	ను తి గ . న్న
	సా గా సా॥		
	అ త డే॥		
చ॥	; ద ని సా ; స నీ దా ;	దా ; నీ దా	పా పా పా ద ద
	ధ ర లో తి రు వా	లూ ర ను	స్థ ల ము న .
	ప గ ని ద పా ; గా పా గా సా	గా ; పా ;	దా ; నీ, ద
	. . ధ ర ణీ సు ర వ రు	డై జ	న్మిం చి న

అ. ప. వలె

వరగానామృత రతుడై మించిన
సరస త్యాగరాజని నుతిగాంచిన ॥య॥

శ్రీ త్యాగగురుస్తుతి కీర్తనలు

కీర్తన—22

రాగం: మలయమారుతం. ఆదితాళం.

ఆ. సరిగపదనిసా — అ. సనిదపగరిసా

ప॥ పలువిధకీర్తన, ప్రతతి రచించిన
పరమ జ్ఞాని గనరే: మనసా ॥పలు॥

అ॥ సలలితనామ సుధారసమానుచు
ఇలభోగముల, నశ్వరమని మానుచు ॥ప॥

చ॥ రాముని గుణముల రంజిల బాడుచు
ప్రేమతో సుమముల పూజల సేయుచు
తామరసాక్షుని దయకై వేడుచు
పామరహితుడైన పావనత్యాగరాజు ॥పలు॥

	1-4	0-2	0-2
ప॥	; గా పా ద నీ సా రి గ రి సా	: సా నీ ద ప	పా గ ప గ రీ ;
	ప లు వి ధ కీ ర్త - న .	ప్ర త తి ర	చి ం చి - న .
	; గా పా గా రీ స సా స రి స	రీ ; ; గా	పా దా ని ని ద ప
	ప ర మ జ్ఞా - - ని గ న	వే ; ; మ	న - స . . .
	గ రి ॥గా పా॥		
	. . ॥ప లు॥		
అ॥ప॥	; గా పా ద నీ సా, రీ సా	సా ; రీ సా	సా ని రి స నీ ద
	స ల లి త నా మ సు	ధా ర స	మా . ను . చు .
	; ద ద నీ సా, స నీ దా పా	గా గా పా దా	ని ని ద ప గ ప గ రి
	ఇ ల భో . గ ము ల న	శ్వ ర మ ని	మా . . . ను . చు .
	న రి ॥గా పా॥		
	. . ॥ప లు॥		
చ॥	; దా ని దా దా దా స ని ని ద ద	దా దా నీ దా	పా ప ద ద ప ప గ
	రా ము ని గు ణ ము . ల - -	రం . జి ల	పా డు - చు - - -
	; గా ప దా ని ని ద ప గ ప గ రీ	; గా పా పా	దా దా నీ దా
	; ప్రే మ తో సు - మ . ము - ల -	. పూ జ ల	సే . యు చు

అ. ప. వలె

తామరసాక్షుని దయకై వేడుచు
పామరహితుడైన పావన త్యాగరాజు॥

సామాజిక శ్రేయో సంఘాలు

త్వరలో రాష్ట్రాలలో ఏర్పాటు

ఆర్థికమంత్రి జీవరాజ్ మెహతా అధ్యక్షతన జరిగిన సంఘ సేవకుల సభలో శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు ప్రసంగిస్తూ పంచవర్ష ప్రణాళిక గడువు ముగిసే నాటికి 'ఎ' తరగతి రాష్ట్రాలలో చాలా మట్టుకు త్వరలోనే రాష్ట్రీయ సమాజ శ్రేయోసంఘాలు నెలకొల్పడం జరుగు తుందని, జూన్ రెండవవారం నాటికి అన్ని 'ఎ' తరగతి రాష్ట్రాలకూ విడివిడిగా సమాజ శ్రేయో సంఘాలు ఏర్పడుతవనీ దేశవ్యాప్తంగా 40 వేల సాంఘిక సంక్షేమ కేంద్రాలు నెలకొల్ప గలమని ఆశిస్తున్నామన్నారు.

మార్చి 31 తో అంతమయే ఈ ఆర్థిక సంవత్సరంలో సంక్షేమ సంఘాలకోసం ప్రత్యేకించిన నిధినుంచి. కేంద్ర శ్రేయోసంఘం ఇప్పటికి 24 లక్షల రూపాయలు ఖర్చు చేసిందని, దీనితో 158 శిశుసంరక్షణ కేంద్రాలకు 4 లక్షల 91 వేల రూ॥ లు మంజూరు చేశామనీ. అదేవిధంగా, 239 స్త్రీ శ్రేయో సంఘాలకు 8 లక్షలు, బాల నేరస్తులను బాగుపరచే 597 సంస్థలకు 3 లక్షల 33 వేలూ సాధారణ శ్రేయో సంఘాలకు 7 లక్షల 72 వేలు మంజూరు చేస్తా మని వివరించారు.' త్వరలోనే కేంద్రసమాజ శ్రేయో సంఘంవారు 300 గ్రామ శ్రేయోభి వృద్ధి ప్రాజెక్టులు ప్రారంభిస్తారనీ, ఒక్కొక్క ప్రాజెక్టు క్రింద 20 గ్రామాల వరకూ ఉంటాయనీ, ఈ ప్రకారం 60 లక్షల జనాభాగల 60 వేల గ్రామాలలో శ్రేయోభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలనీ కేంద్రసంఘం ఆశిస్తున్నదని. ఇదివరకే గ్రామాలలో ఏర్పడి పని చేస్తున్న స్వచ్ఛంద సేవాసంఘాల ద్వారానే ఈ కార్యక్రమాలు అమలు జరుపబడుతాయని, సంఘ సేవకులూ శ్రేయోభిలాషులూ కృషిచేసి జాతీయ ప్రణాళిక ఋణాన్ని విజయవంతం చేయాలని నగదు రూపంలోనే కాకుండా నగల రూపంలోకూడా ఈ విరాళాలు ఇవ్వటానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదనీ ఆమె చెప్పారు.

విజయం

ఫిబ్రవరి 1954 లో ఆంధ్ర మహిళాసభ నుండి హిందీ పరీక్షలకు వెళ్ళి విజయము పొందిన విద్యార్థినులు.

ప్రాథమిక్

కుమారి కె. ప్రమీల	ప్రథమ శ్రేణి.
కుమారి ఎమ్. ఉష	ద్వితీయ శ్రేణి.

మధ్యమ

శ్రీమతి కమలకుమారి	ద్వితీయ శ్రేణి.

సరోజినీదేవి

ఫిబ్రవరి 13, 1879, వనితా లోకం జ్ఞాపకం ఉంచుకోవలసిన దినాలలో ఒకటి. ఆనాడే, హైదరాబాదులో అఘోరనాథ చటోపాధ్యాయకి, వరదాసుందరీదేవికి— సరోజిని జన్మించింది. సరోజిని కుటుంబం సంస్కృత విద్వాంసులకి పేరు కాంచినది. "తర తరాల నావంశీయులు ఐహిక విషయాలలో కంటే అడవులలో కొండలలో జ్ఞాన సముపార్జనలో తాత్త్వక విమర్శలో ఎక్కువ ఆశక్తిని చూపిన మహాపురుషులు," అని తన వంశీయులను గురించి సరోజిని వ్రాసింది. అఘోరనాథ్ చటోపాధ్యాయకూడా వీరికి అన్నివిధాల అనుంగు సుతుడు. అందుకే అతడు మరణించినపుడు "దయార్ద్ర హృదయుడు, ధైర్యస్థుడు అయిన ఋషి" అని సరోజిని వ్రాసింది. యూరప్‌లో వైద్యశాస్త్రం అభ్యసించిన అఘోరనాథ్ నైజామ్ కాలేజీ స్థాపకులలో ఒకడు. జీవితంలో అతనికి ఎక్కువ ఆనందాన్ని యిచ్చినవి— విద్యాభ్యాసం శాస్త్రీయపరిశోధనా. సరోజిని తల్లి వరదాసుందరి కూడా విద్యావంతురాలు. చిన్నతనంలో బెంగాలీలో చక్కని పాటలు వ్రాసిన కవయిత్రి. చదువుయందు ఆశక్తి, ఉపయోగకరమైన పనులయందు లక్ష్యాన్ని కల్పించుకోవడమూ తండ్రి నుంచీ, దయార్ద్ర హృదయమూ, కవితా హృదయమూ తల్లినుండీ, సేకరించింది సరోజిని.

ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇంగ్లండుకి వెళ్ళేముందే సరోజిని, సుప్రసిద్ధవైద్యుడైన డాక్టరు ముత్యాల గోవింద రాజులునాయుడుని ప్రేమించి, వివాహమాడ కోరింది. కాని అప్పట్లో అది వీలుపడలేదు. సరోజినిది సంప్రదాయ సిద్ధమైన కుటుంబం. సనాతనాచారాలకి పుట్టినిల్లు. అలాంటిది బ్రాహ్మణేతరుడైన నాయుడుని వివాహం చేసుకోవడం కష్టమే. అందుకే సరోజిని ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇంగ్లండు వెళ్ళిపోయింది. అక్కడ **King's College** లోనూ, కేంబ్రిడ్జిలోని **Girton College** లోనూ చదువుకొంది. 1818 లో ఇంగ్లండు నుండి తిరిగి వచ్చి సంఘపు కట్టుబాట్లనీ, పెద్దల చాదస్తాలనీ కాదని డాక్టరు నాయుడుని వివాహం చేసుకొంది. వీరిది చక్కని సంసారం. నైజామ్ ఛీఫ్ మెడికల్ అఫీసరుగా ప్రఖ్యాతి గాంచిన డాక్టరు నాయుడు వేదాంతిలాగ కనిపించే ఒక జ్ఞాన నిధి. వీరికి కల్గిన సంతానం- నల్గురూ. నాల్గు ఆణి ముత్యాలు— జయిసూర్య, పద్మజ, రణధీర, లీలామణి—ఆ గృహంలో అందరికీ సరోజిని ఆరాధ్యదైవం.

హైదరాబాదులో సరోజిని గృహం ఒక అంతర్జాతీయ వసతి గృహం లాంటిది. పేరుగాంచిన జ్ఞానులూ, వినోదార్థం దేశంలో సంచరించే వ్యక్తులూ అందరూ ఆమె ఆతిథ్యాన్ని అందుకొని, ఈమె ద్వారా యీ దేశాన్ని పూర్తిగా అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించినవారే.

కొన్ని సంవత్సరాల తరువాత సరోజిని హైదరాబాదు వదిలింది. దీనితోపాటే ఆమె కవయిత్రిగావుండే రోజులు కూడా ముగిసాయనే చెప్పవచ్చు. రాజకీయాలలో తలమున్కలుగా పనిచేయడానికి హైదరాబాదు వదిలిన సరోజిని, అప్పుడప్పుడు మాత్రమే కవిత్వం వ్రాసేది.

విఖ్యాత రచయిత లందరూ సరోజిని కవిత్వాన్ని కొనియాడేరు. "పక్షుల కిలకిలా రావాల లాగే నా హృదయంలో స్పందించే గీతికల జీవిత ప్రమాణం కూడా బుద్బుద ప్రాయం. నాకు నిండైన కోరికలూ, కవితాదృష్టి వున్నాయి, కాని స్వరం లేదు. నేను నిజంగా కవిని గాను" అని తన కవిత్వాన్ని గూర్చి సరోజిని చెప్పుకొంది. కాని ఒకటి మటుకు నిజం. ఆమె గీతాలు హృదయరంజకంగా వుండి స్వేచ్ఛా జీవులైన పక్షుల పాటలలాగే వుంటాయి. **The Golden Threshold, The Bird of Time; The Broken Wind** అనే మూడు పద్య సంపుటాల లోనూ— చక్కని సంగీతంతో కూడుకొన్న పదజాలం,

శ్రీమతి కె. రామలక్ష్మి

మానవాతీత సౌందర్యాన్ని మాటలలో పొదిగిన చాతుర్యం మన కళ్ళకి కడుతుంది.

ఈ కవితాలోకంలో ఊహలతో కాలక్షేపం చేయడం సరోజిని అభిమతంకాదు. దేశరాజకీయాలలోనూ సాంఘిక సంరక్షణలలోనూ పాలు పంచుకోవాలనే కోరిక ఆమెలో దిన దినం అభివృద్ధి కాంచింది.

హిందూ ముస్లిముల నైక్య పరచి, దేశదేశాల ఆదే ఐక్యతని పెంపొందించాలని సరోజిని కోరింది. ఆమె



స్త్రీ జనానికి ధ్రువతార

సరోజినీదేవి

పుట్టి పెరిగిన వాతావరణం యిందుకు ఎంతైనా తోడ్పడింది. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, మహమ్మదీయుల మధ్య మహమ్మదీయ నగరంలో పెరిగి పెద్దదైన తరువాత సరోజిని ఆ పట్టణ జీవితంలోనే ఒక ప్రముఖ భాగమైపోయింది. రాజకీయాలు చర్చిస్తూ ఒకనాడు ఆమె గోఖలే వద్ద "ఇక ఐదు సంవత్సరాలలో హిందూ ముస్లిం మైత్రి నే చేకూరుస్తాను" అన్నదట. అప్పటి నుండి సర్వదా దాని కోసమే పాటు పడింది. 1913 లో లక్నోలో జరిగిన ముస్లింలీగు సభలోనూ, 1916 లో అక్కడే జరిగిన హిందూ ముస్లిం సభలోనూ ఆమె చేసిన ఉపన్యాసాలు మహమ్మదీయులపై అధిక ప్రభావం చూపాయి. 1921 లో మతకలహాలతో ఉన్మత్తులై వున్న బొంబాయి గుంపుల మధ్య నిర్భయంగా సంచరించి వారిని సుముఖులను చేయ ప్రయత్నించింది. 1922 లో కారాగృహం ప్రవేశిస్తూ మహాత్ముడు "భారత ఐక్యతను నీ చేతులలో పెట్టివెడుతున్నాను" అన్నాడు. ఆయన మాటలు శిరసావహించి రాత్రింబవళ్ళు హిందూ ముస్లిం ఐక్యత కోసం సరోజిని ప్రయత్నాలు సాగించింది.

"ఎచట స్త్రీలు పూజింప బడుదురో అచట దేవతలు క్రీడింతురు. ఎచట పూజింపబడరో అచట అన్ని క్రియలు ఫలశూన్యములగును" అన్న మనువువాక్యం, "విశ్వాసము సౌజన్యము రెండవ కంటివాడెరుగని బాధ ననుభవించుట, వారియందు (స్త్రీలయందు) మూర్తీభవించెను" అన్న గాంధీ సూక్తి, రెండూ యధార్థాలే. దేశంలో స్త్రీలు సంతుష్టులు కాకుంటే పురుషుల అన్నిప్రయత్నాలూ ఫలశూన్యాలే అవుతాయి. వేదకాలం నాడు భారత స్త్రీలు అనుభవించిన స్వాతంత్ర్యం నాగరికతాభివృద్ధితోపాటు దిగనాసిల్లి పోయింది. కొంతకాలం క్రితం దాకా స్త్రీ పురుషునికి బానిస అన్నట్లుగా తయారయింది. ఆమె అంటే సంఘానికీ అందులోని ప్రముఖులకీ కూడా న్యూనత భావమే. సంఘంలో ఆమె కష్టసుఖాలను ఆలోచించి తీర్చేవారే లేరు. రాజకీయాలలో ఆమెకు భాగం యిచ్చేవారూ లేరు. ఎన్నాళ్ళు స్తబ్ధుల్లాగ యిటువంటి అవస్తని భరిస్తారు? సరోజిని వంటి వనితలు ముందుకి వచ్చి స్త్రీల స్థితిగతులను సరిదిద్దడానికి నడుము కట్టారు.

సరోజిని తన వివాహాన్నే సనాతన సంప్రదాయానికి వ్యతిరేకంగా చేసుకొని స్త్రీలూ వ్యక్తులేననీ, వారికీ వ్యక్తిత్వం, స్వేచ్ఛా వుండాలనీ చాటింది. అతి బాల్య వివాహాలూ పరదా పద్ధతీ వుండకూడదని అధిక ప్రచారం చేసింది. నవనాగరికత వనితా లోకంలోనే కాక, సనాతన సంప్రదాయానుగుణంగా వుండే స్త్రీలతో కూడా స్నేహం కలిపి అందరినీ ఒకే అంతస్తులో నుంచి నడిపే యత్నాలు చేసింది.

ఈ ఉద్యమంలో ప్రప్రథమంగా సరోజిని, ఫిజీ మహిళల తరపున వైస్రాయి వద్దకు రాయబారిగా వెళ్ళింది. 1919 లో మాండెగు ఇండియా వచ్చినప్పుడు ఓటు హక్కులకు వెళ్ళిన స్త్రీల రాయబారానికి నాయకురాలుగా సరోజిని నిల్చింది. స్త్రీల ఓటు హక్కు విషయాన్ని చర్చించేందుకు యేర్పరుపబడిన కమిటీ ముందు సరోజిని యిచ్చిన వాఙ్మూలం అతి శక్తివంతమైనది. ఇదే సందర్భంలో యీమె అనేక పర్యాయాలు ఇంగ్లాండు దర్శించింది. ఇంగ్లాండులో బహిరంగ సభలో మాట్లాడుతూ ఆంగ్ల ప్రభుత్వాధికారుల అధికార మదాంధతని తీవ్రంగా విమర్శించిన ధీమంతురాలు. 1920 లో జెనీవాలో జరిగిన అంతర్జాతీయ మహాసభకు భారత నారీప్రతినిధిగా వెళ్ళి, అంతర్జాతీయ కీర్తిని మన మహిళలకి సమకూర్చింది. 1930 లో బొంబాయిలో జరిగిన మహిళాసభ చతుర్థ సమావేశానికి అధ్యక్షత వహించి అందరి మన్ననలను అందుకొన్నది. 1931 లో చెరసాలనుండి విడిపించి, ప్రభుత్వం ఇంగ్లాండులో జరుగు రౌండు టేబుల్ కాన్ఫరెన్సునకు భారత మహిళా ప్రతినిధిగా సరోజినిని నియమించారు.

సరోజినికి కాంగ్రెసు సంస్థతోటి సంబంధం కూడా పాతది. 1905 లోనే ఆమె కాంగ్రెసు సభలో ఉపన్యసించింది ఈ సంస్థలో ఎన్ని మార్పులు వచ్చినా, ఎన్ని లోపాలు కన్పించినా సరోజిని మట్టుకు దానిని వీడలేదు. కాంగ్రెసు తరపున ప్రతినిధిగా పని చేయడమే కాక, 1925 లో కాన్పూరు కాంగ్రెసునకు అధ్యక్షురాలుగా ఎన్నుకోబడింది. ఇంతటి అఖండ గౌరవం యింకే భారత స్త్రీకీ సమకూరలేదు. 1937 లో దేశసంచారం చేసి కాంగ్రెసు విజయం కోసం పాటు పడింది. కాంగ్రెసులో అంతర్జాతీయ శాఖకు అధ్యక్షురాలిగా వుండి అంతర్జాతీయ ఐక్యత కోసం పాటు పడింది.

గాంధీజీ పరిచిన వ్యక్తులలో సరోజిని ప్రముఖురాలు. బాబూజీ ఆదర్శాలను మనసారా నమ్మి వాటిని ఆచరణ రూపంలో పెట్టిన స్త్రీ రత్నం. ఆయన ప్రారంభించిన

(తరువాయి 31-వ పేజీలో)

చిన్న మొత్తములలో నిల్వ సేకరణ-

ఆంధ్ర మహిళా సభలో కార్యాలయము.

చిన్న మొత్తముల నిల్వలు ప్రోత్సాహించి, ప్రభుత్వమువారి పంచవర్ష ప్రణాళికకు తోడ్పడు స్త్రీల ఉద్యమములో ఆంధ్రమహిళాసభ సభ్యురాండ్రు ఎక్కువగా తోడ్పడవలెనని నిశ్చయింపబడినది. ఇందు కొరకై, ఆంధ్రమహిళా సభ ఆవరణలో ఒక ప్రత్యేకమైన కార్యాలయము ఏర్పరుపబడును. ఇందు దైనిక కార్యక్రమాన్ని నిర్ణయించి, స్త్రీ సామాన్యములో యీ ఉద్యమాన్ని గూర్చి ప్రచారం చేయుటకు, నిల్వచేయదలచినవారికి తగు సలహానిచ్చుటకు, సభ తరఫున కొందఱు యువతులు నియమింపబడుదురు. ఈ ఉద్యమంలో ఒక ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించి, ధనము వసూలు చేయుటకు భారత ప్రభుత్వమువారు, ఆంధ్ర మహిళాసభకు అధికారమిచ్చియున్నారు. సభకు వచ్చిగాని, పోస్టు ద్వారాగాని అన్ని వివరములు తెలిసికొనవచ్చును.

ఇంకొక విషయము— మీరు కొనదలచిన సేవింగ్సు సర్టిఫికెట్లు సభ ద్వారా కొన్నయెడల సభకు 1¼% కమీషను వచ్చును. ఈ కమీషను సభయొక్క కార్యకలాపాలకై వినియోగించుకోవచ్చును. అందువల్ల మీరు నిల్వ చేయదలచిన మొత్తమునకు సభద్వారా సర్టిఫికెట్లు కొన్నచో, సభకు కూడా సహాయము చేసినవారగుదురు.

ఉత్సాహ వంతులైన సోదరీమణులు, యింత వరకూ సభద్వారా నిల్వ సర్టిఫికెట్లు తీసుకున్న మొత్తము రమారమి రూ. 24000/- ఇందు మూలముగా సభకు వచ్చిన కమీషను రూ. 300/- ఇంకా పెక్కుమంది సోదరీమణులు యీవిధముగా సభద్వారా సర్టిఫికెట్లుకొని సహాయ పడవలెనని కోరుచున్నాను.

అ. చన్నఘంటమ్మ,
కార్యదర్శిని.

మానవ మాత్రులను మంత్ర ముగ్ధులను చేసిన

"ముక్కెర"

పూర్వకాలపు నగలలో అందమైనదీ, నాజూకైనదీ యీ ముక్కెర తప్ప యింకో నగేలేదు. ఎటువంటి శరీర ఛాయకేనా సరే వన్నె తెచ్చేది యీ ముక్కెర. చూపరులని యింతగా ముగ్ధులని చేసే ఆభరణం యింకోటిలేదు.

ఏదేశంలో కాని, ఏకాలంలో కాని. పురుషులే స్త్రీల కంటే డాంబికులు అనిపిస్తుంది. కారణం : ఇంకో పేరులోనైతేనేం, యింకో ఆకృతిలో నైతేనేం. ఏదో విధంగా స్త్రీ ధరించిన అన్ని ఆభరణాలూ యీ పురుషులూ ధరించడమే. స్త్రీ అలంకరణలుగా గాజులూ, కంకణాలూ, పట్టీలూ. జుంకాలూ, ధరిస్తే వాటినే మార్చి పురుషులు ధరించారు. వాటికి ప్రత్యేకమైన విలువా ప్రతిష్ఠా యేర్పరచారు. రాజాధి రాజునీ, కవి చక్రవర్తినీ యుద్ధ వీరుడినీ గుర్తింప చేసేవిగా వీటిని వాడేరు. స్త్రీ ధరిస్తే జుంకాలయినవే పురుషులు ధరిస్తే "మకరకుండలాలు" అయాయి. తర్కశాస్త్రవేత్తలు, వేద వేదాంగ పారంగతులు, మంత్ర తంత్ర వేత్తలూ, తమ మకర కుండలాల ప్రమాణాన్ని పట్టి తమ ప్రతిభ వెల్లడి చేసేలా చూసేవారు. కొన్ని సమయాల్లో మకర కుండలాల బరువే వారి పాండితా గరిమకు నిదర్శనంగా పరిగణింప బడేది.

అందరు స్త్రీలూ ధరించే గాజులే పురుష సింహులు ధరిస్తే 'కంకణాలు' అయాయి. యుద్ధవీరులు ధరిస్తే 'వీర కంకణాలు' అయాయి. నాట్యకత్తె చిహ్నమైన పట్టాలు కృష్ణరాయల ఆస్థాన కవికి చిహ్నాలయాయి. కవి సింహుల కది 'గండ పెండేర' మన్నమాట. ఇదంతా చూస్తే ఒకటి తోస్తుంది. తనకి సరిపడేటట్టు అలంకరణల పోకడలని పురుషుడు వుపయోగించు కొందుకు వెనుకంజ వెయ్యలేదని !

పూర్తిగా స్త్రీల స్వంతం అయిన యీ ఆభరణం నవీనపు అలంకరణల పోకడలలో లేకుండా పోడం విషాదకరమే. అందమైన ముక్కుకి యింకా వన్నె తెచ్చే యీ ముక్కెర లేక పోవడం మూలాన్ని; ఆశ్చర్యార్థకానికి(!) కింద చుక్క లేకుంటే ఎంత చిన్నపోతుందో ముగ్ధ ముక్కు కూడా అలాగే చిన్న పోతూంది.

ఈ ముగ్ధాభరణమైన ముక్కెర గురించి సంస్కృత కవుల వూహలు యిన్నీ అన్నీ కావు. "ప్రియురాలి ముఖం చంద్ర బింబం అయితే. చంద్రుని సాన్నిధ్యంలో వుండే రోహిణి యే యీ ముక్కెర అయింది" అంటాడు ఒక కవి. "స్వర్గద్వారాల్లాంటి కళ్ళా? అమృతోపమానమైన ప్రియురాలి అధరమా? ఏదికావాలో తేల్చుకో లేని నా ప్రేమ రెండింటికీ సన్నిహితం అయిన ముక్కెర రూపు దాల్చింది" అంటాడు యింకోకవి. విచిత్ర సమస్యని సృష్టిస్తూ సమాధాన మిస్తాడు యింకో కవి - నల్ల కలువల్లాంటి కళ్ళూ రక్తారుణ అధరాలూ కలిగిన సుందరి దొంగల చే జిక్కినప్పుడు అన్ని ఆభరణాలూ దోచుకొన్న చోరులు ముక్కెర మాత్రం ఎందుకు వదిలారు? అంటే, కళ్ళ కాటుక కాంతులని పై భాగంలోనూ పెదవుల రక్తవర్ణాన్ని క్రింది భాగంలోనూ నింపుకొన్న యీ ఆభరణం దొంగల కంటికి సాధారణమైన గురివింద గింజలాగ కనిపించిందట! సర్వ సాధారణమైన గురివింద గింజకి అదృష్టం పట్టి బంగారం తూచేందుకు ఉపయుక్తమైనట్లే, సుందరాంగికి ముక్కెర అయిందేమో అన్నట్లు ఉత్ప్రేక్షించాడు కవి.

ముక్త అంటే ఆణిముత్యం (సాధారణంగా యీ ముక్కెరకి స్వచ్ఛమైన పెద్ద ముత్యాన్ని వాడుతారు) 'ముక్తా' అంటే ముక్తిని పొందే ఆత్మలని సంస్కృతంలో యింకో అర్థం కూడా వుంది. ఈ ద్వంద్వార్థాలని పురస్కరించుకొని కవి తన ప్రతిభ చూపుతూ యిలా అంటాడు. "స్త్రీల అధరామృతమే నిజమైన స్వర్గలోకపు అమృతం. అదే స్వేచ్ఛా జీవులైన ఆత్మలు తమ లక్ష్యంగా పెట్టుకొంటూరు" అంటే, స్త్రీ అధరామృతమే, ప్రియునికి ముక్తి దాయికం అని భావం.

"యుగ యుగాలుగా సముద్రపు అగాధాలలో తపస్సు చేసి, తరిమిడి పట్టేవాని చేతిలో అష్ట కష్టాలూ పడిన ఆణిముత్యం తన తపః ఫలితంగా, ముగ్ధురాలి ముక్కెరగా రూపొందింద"ని యింకో కవి అంటాడు.

భారంగా సాగే కాలానికీ నిశ్శబ్దంగా అనుభవించే తీరని కోరికల వ్యధకీ యీ ముక్కెర చక్కని నిదర్శనం. కోర్కెల సఫలత కోసం అత్యదశలో ఎదురు జూచే భావి లాంటిది యీ ముత్యం. అందుకే కవులకి విశ్రాంతి లేకుండా చేసిందన్నా, మన చిత్రకారుల దృష్టిని ఆకర్షిస్తోందన్నా ఆశ్చర్యం లేదు. ఇది స్త్రీ త్వానికే శాశ్వత నిదర్శన. ("హిందూ" నుండి అనుకరణ)

ఉపసంహారం

భోజుని రాజధానిలో ప్రతిదినము ఉదయాన దేవాలయంలో పాట పాడుతుండే అమ్మాయి ఎక్కడో దొరికిన పిల్ల.

దేవాలయాచార్యుడు ఆ పిల్ల దొరికిన వివరం ఈ విధంగా చెప్పేవాడు-"ఒకనాడు తెల్లవారుఝామున ఎవరో పాడుతున్నట్టు వినబడ్డది. కొంత సేపైన పిమ్మట మామూలు ప్రకారం సజ్జపట్టుకొని పూలు కోద్దామని చెట్టు దగ్గిరికి వెళ్లేసరికి ఈ అమ్మాయి ఆ చెట్టుకింద దొరికింది"

అప్పటినుంచీ ఆచార్యుడు తన తంబూరాను ఒళ్ళో పెట్టుకొని బహు శ్రద్ధగా పట్టుకొన్నట్టుగా అమ్మాయిని ఒళ్ళో కూర్చోపెట్టుకొని అతి ముద్దుగా పెంచి పెద్దదానిని చేశాడు. ఆ అమ్మాయి నోటి వెంట మాటలు రాక పూర్వమే కంఠంలో నుండి సంగీతం రావడం ప్రారంభించింది.

ఆచార్యుని కంఠం ఇప్పుడు క్షీణం అయిపోయింది. కళ్ళు కనపడవు. ఆ బాలిక అతన్ని ఇప్పుడు పసి బిడ్డణ్ణి పెంచినట్టుగా పెంచుతున్నది.

ఆ అమ్మాయి పాట వినడానికి దేశ దేశాలనుండి యువకులెందరో వస్తున్నారు. ఇది చూచి ఆచార్యుని గుండెలో అప్పుడప్పుడు వణుకు పుట్టి, "పువ్వు బలం తగ్గిపోయిన కాడను అంటిపెట్టుకొని ఆట్టే రోజులు ఉండ" దని అంటూ ఉండేవాడు.

"నిన్ను విడిచిపెట్టి ఒక్క నిమిషం బ్రతికి ఉండలేను నేను" అని ఆ బాలిక జవాబు చెప్పేది.

"నేడు నా కంఠంలోంచి బయటికి వచ్చేసిన పాట నీలో రూపం ధరించింది ; నీవు నన్ను విడిచి వెళ్ళిపోయి నావంటే యావజ్జీవము నేను చేస్తున్న సాధనం అంతా పోగొట్టుకొన్న వాడనౌతా" నని ఆచార్యుడన్నాడు.

౨

వసంత పౌర్ణమినాడు ఆచార్యుని ప్రధాన శిష్యుడు కుమార సేనుడు గురువుగారి దగ్గిరికి వచ్చి పాదాల పైని ఆమ్రమంజరి ఉంచి ప్రణామం చేసి "నాకు మాధవికి పరస్పరానురాగం కలిగింది. మీరు సమ్మతించిన యెడల మే మిద్దరమూ కలిసి మీ పాదసేవ చేస్తాము" అని అన్నాడు.

ఆచార్యుని కళ్ళ వెంబడి నీళ్ళు కారడం మొదలు పెట్టాయి. "నా తంబూరా తెచ్చి నా చేతికిచ్చి, మీరిద్దరు రాజు, రాణి అయి నా ఎదుటకు వచ్చి కూర్చోండి" అని అన్నాడు.

తంబూరా పట్టుకొని శహనా రాగంమీద బహు ఇంపైన జోలపాట ప్రారంభించి, "నా జీవితంలో ఇదే ఆఖరి పాట" అన్నాడు.

ఒక్క చరణం పాడాడు, పాట మరి నడవలేదు. చినుకులు పడి పడి నీళ్ళతో నిండి అల్లలాడి అల్లలాడి రాలి పడిన జాజి పువ్వు మాదిరి కనబడ్డాడు. చివరకు తంబూరాను కుమార్‌సేన్ చేతిలో పెట్టి, "ఇదిగో తీసుకో నాయనా నా యంత్రాన్ని" అని అన్నాడు.

తరువాత మాధవి చెయ్యిని తీసి, అతని చేతిలో పెట్టి "ఇదిగో నాయనా, నా ప్రాణాన్ని అందుకో అని అన్నాడు.

"మీరిద్దరు కలిసి నా పాట పూర్తి చెయ్యండి, నేను వింటాను" అని తరువాత అన్నాడు. మాధవి, కుమారుడు కలిసి పాట పూర్తి చేశారు— అది ఆకాశము నిండు చంద్రుడు కలిసి పాడిన పాట అని అనిపించింది.

౩

ఆ సమయంలో రాజదూత ఒకడు వచ్చి ద్వారం దగ్గిర నిలుచున్నాడు. పాట నిలిచిపోయింది.

ఆచార్యుడు వణుకుతూ వణుకుతూ ఆసనంమీదనుండి లేచి, "రాజావారి ఆజ్ఞ ఏమిటి ?" అని అడిగాడు.

"మీ అమ్మాయి అదృష్టం బాగుంది. ఆమెను తీసుక రమ్మని మహారాజా వారి ఆజ్ఞ అయింది" అని దూత అన్నాడు.

"మహారాజా వారి ఉద్దేశమేమి?" టని ఆచార్యుడడిగాడు.

మూలం : రవీంద్ర   అనువాదం : కె. వైకుంఠరావు

ఉ ప స ం హా ర ం

"రేపు ఉదయాన రాజావారి కొమార్తె కాంభోజదేశానికి వెళ్ళిపోతుంది. అత్తవారి ఇంటికి. మీ అమ్మాయి, మాధవి చెలికత్తెగా ఆమెతో వెళ్ళవలెనట" అని దూత చెప్పాడు.

౪

తెల్లవారింది. రాచ కన్య పతి గృహానికి బయలు దేరింది. రాణి మాధవిని పిలిచి "మా అమ్మాయి విదేంశలో ఉండబోతున్నది. ఆమె సదా ఆనందంగా ఉండే భారం నీదే" అని అన్నది.

మాధవి కళ్ళనుండి నీళ్ళు కారలేదు. అనావృష్టి సమయంలో ఆకాశం నుండి పడుతున్న సూర్య కిరణాలు పడ్డవి.

మయూరపంఖి అనే రాచకన్య పల్లకి ముందు వెళ్ళు తున్నది. దాని వెంబడే వస్తున్నది మాధవి పల్లకి— లతలు కుట్టిన ముఖమలు బురఖా కప్పి ఉన్నదీ. రెండువైపులా సిపాయిలు పారా ఇస్తున్నారు.

గాలికి విరిగి పడిన రావికొమ్మలాగు దారి ప్రక్కను పడి ఉన్నాడు. ఆచార్యుడు, ఆ ప్రక్కనే నిశ్చలంగా నిలుచొని ఉన్నాడు కుమార్‌సేన్.

పలాశశాఖలపైని కూర్చొని పక్షి పాడుతున్నది. మామిడిపువ్వు వాసనతో నిండి ఉన్న గాలి విహ్వాల మైనట్లు ఉన్నది. వసంత సంధ్యను రాజకుమారి మనస్సు చంచలమై బాధపడుతుంటూ ఉంటుందేమో అనుకొని పురజనుల హృదయాలు తత్తరపడుతున్నవి.

స రో జి నీ దే వి

(27-వ పేజీ తరువాయి)

సత్యాగ్రహ సమరంలో త్రికరణ శుద్ధిగా పనిచేసిన వీర వనిత. స్వాతంత్ర్య సమరంలో అధికంగా పాల్గొని యితోధి కంగా దేశసేవ చేసింది. ఉప్పు సత్యాగ్రహంలోనే కాక ఆగస్టు విప్లవంలో కూడా కారాగార వాసాన్ని చవి చూసింది. 1943 లో అనారోగ్యం కారణంగా ఆమెను విడుదల చేశారు.

స్వాతంత్ర్య సమరంలోనే కాక పదవీ నిర్వహణలో కూడా స్త్రీలు పురుషుల కేమాత్రం తీసిపోరని సరోజిని నిరూపించింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత, డాక్టరు బి.సి. రాయ్ విదేశాలలో నుండగా ఆయనస్థానే సంయుక్త రాష్ట్రాలకు గవర్నరుగా సరోజినిని నియమించారు. అధికారం అంటే అయిష్టం అయినా యీ పదవిని అనేక కారణాలవల్ల స్వీకరించక తప్పలేదు. గవర్నరుగా పని చేస్తూనే సరోజిని మహిళల ఉన్నతికి శరణార్థులకు వసతి సౌకర్యాలు కల్పించడానికి పాటుపడింది.

జీవిత సర్వస్వాన్ని దేశసేవకై ధారపోసి, అలసట అనేదే యెరుగని సరోజిని ఆ శరీరం 1945 జనవరిలో అస్వస్థత చెందింది. 1945 మార్చి 2 వ తేదీన సునా యాసంగా, శాశ్వతంగా ఆమె యీ లోకాన్నే విడిచింది.

గతకాలపు వీరవనితలనీ, రాబోయే మేధావంతులయిన నారీమణులనీ కలిపే శక్తి సరోజిని. భారత వర్షంలో సావిత్రీ, అనసూయా, దమయంతీ, పద్మినీ, మీరాబాయీ మొదలైన వారి సుగుణాల కథలు అభూత కల్పనలు కావని సరోజిని జీవితం నిరూపిస్తుంది. ఈమె మనో నిశ్చయం, ధైర్యం, త్యాగం వ్యక్తిత్వం పురాణ స్త్రీల అద్భుతగాథలని యేమాత్రం తీసిపోదు. కాలంలో మార్పు వుంది కనక ఆ తేడా కన్పిస్తుంది. సరోజిని జీవితం భావి భారత వనితాలోకానికి ధృవతార. ధైర్య స్థైర్యాలూ విశ్వాసమూ, సరోజినిని చూసి అనేకులు నేర్చుకొంటారు. ఇదే ఆమె సాధించిన ఘన విజయం. ఇదే ఆమె జీవితం వేసిన రాజబాట. సరోజిని తన కళ్ళతో తనే మహిళల మహోజ్వల భవిష్యత్తు చూడలేకపోవచ్చు. దానివల్ల నష్టం ఏమిటి? ఈనాటి మహిళల కనుల మెరిసే జ్ఞానం వారి మనస్సులలో నిలచిన ధైర్యం, వారి వ్యక్తిత్వానికి యేర్పడిన హోదా— అన్నిటిలోనూ కూడా సరోజిని పాలు పంచుకోదా? ఆమెదే కదా యీ చలవంతా? అందుకే అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కూడా స్త్రీజనానికి సరోజిని ధృవతార అంటే అతిశయోక్తి కాదు.

దారిద్ర్య నిర్మూలనకు సంతాన నిరోధం మాత్రం మార్గమా ?

* శ్రీమతి లక్ష్మీపున్నయ్య *

పశ్చిమ గోదావరిజిల్లా మహిళాసభ "అధిక జనాభా వల్ల దారిద్ర్యంతో అలమటిస్తున్న భారత దేశాన్ని ఉద్ధరించ గలగాలంటే నూతనంగా కని పెట్టబడిన సంతాన నిరోధ మార్గాలను సాధ్యమైనంత త్వరలో ప్రజలలో విరివిగా ప్రచారం చేయడం అవసర"మని తీర్మానించింది.

దేశ విస్తీర్ణం, అందులోని సహజ సంపద పరిమితమయి సంతానోత్పత్తి పెచ్చు పెరిగిపోతున్న సందర్భమున దేశంలోని దారిద్ర్యాన్ని నిర్మూలించుటకు సంతాన నిరోధము ప్రధానావసరముగా నెంచవచ్చును. కాని మన దేశంయొక్క విస్తీర్ణం, అందులోని సహజ సంపదలు, జీవనోపాధికిగల అవకాశాలు ప్రజలకు ఎంతవరకు వినియోగపడుతున్నవి ? దానిని నూటికి నూరుపాళ్ళు తమ జీవిత పురోభివృద్ధికి ప్రజలు వినియోగించుకో కలిగిననాడు యీనాటి దారిద్ర్య దురవస్థలకు గల అవకాశములు ఏమిటి? అనే విషయాలను ప్రజలు, ముఖ్యంగా మహిళా సంఘాలు గుర్తించాలి. ఈ విషయాలను తర్కించుకొని మన దేశంలో సంతాన నిరోధావశ్యకతను గురించి ఆలోచించినా, తీర్మానాలు చేసినా, సంతాన నిరోధ సూత్రాల నమలు పరచినా బాగుంటుంది.

సంతానోత్పత్తిని పరిమితం చెయ్యడం అవసరమే కావచ్చు. దినదినానికి బలహీన మగుచున్న ప్రజాబాహుళ్యాన్ని, క్షీణిస్తున్న ప్రజల ఆరోగ్యస్థాయిని, ఆర్థికదుస్థితిని దృష్టిలో నుంచుకొని వీనినిచక్కదిద్దు కోడానికి ఏకైక మార్గము సంతాన నిరోధము మార్గమనే వాదం బలహీన మయిందేమో! అదీను - కృత్రిమ మార్గాలు, మందుల ద్వారా సంతాన నిరోధాన్ని అమలు పరచాలని చేసే వాదన అవాంఛనీయము.

ప్రజల ఆరోగ్యస్థాయిని పెంపొంద జేయడానికి కావలసిన కనీసావసరాలు - ఆడ పిల్లల పెండ్లి వయస్సు పెంచడం, యువకులకు కుటుంబ పోషణ కవసరమయిన ఉద్యోగ సంపాదనను వివాహ యోగ్యతగా నిర్ణయించడం, సామర్థ్యము, అవకాశములను బట్టి కుటుంబ ఆదాయం పెరిగి దైనికావసరములు గడచి పోవుట కనువైన వ్యవస్థ నిర్మాణానికి కుటుంబములోని ప్రతియొక్కరు కృషి చేయడం అత్యవసరము. దీనితోపాటు దేశంలోని సహజ సంపదని, పరిశ్రమలు, వ్యవసాయోత్పత్తి ప్రజా శ్రేయస్సుకుగా వినియోగ పడటం పట్ల ప్రభుత్వము ఆసక్తితో తోడ్పడాలి. ఇవి సమకూరిన నాడు ప్రజలకు దారిద్ర్య దురవస్థలు తొలిగి ఆరోగ్య సౌభాగ్యములు సమకూరగలవు.

పెండ్లి వయస్సు స్త్రీలకు, పురుషులకు పెంచే సందర్భమున వారికి వివాహానికి ముందు క్రమశిక్షణతో కూడిన జీవిత పురోభివృద్ధికి అనువైన విద్యాసౌకర్యాలు అమరాలి; ఉద్రేక పరచే వాతావరణానికి - వాఙ్మయానికి, దృశ్యాలకు వారిని దూరంచేయ్యాలి. దానివలన యుక్త వయస్కులై వైవాహిక జీవయాత్ర కుపక్రమించినచో సంతానము పుష్టికరంగా నుంటుంది. తల్లిదండ్రులు. సంతానము ఆరోగ్య వంతులుగా నుంటారు. జీవితావసరాలు గడచిపోతూ ఆరోగ్య సౌభాగ్యాలతో వర్ధిల్లే కుటుంబ జీవితం దేశపురోభి వృద్ధికే కాక ప్రపంచ పురోభి వృద్ధికి సయితం అత్యవసరం. దీనిని సాధించడమే ప్రతి సంఘసేవకునకు, సేవకురాలికి పరమావధి.

విశాలమైన భారతదేశంలో, దాని అభివృద్ధికి విశేషమైన మానవ కృషి, శక్తి అవసరమై యుండి కూడ సంతాన నిరోధానికి విశేష ప్రచారంపై కార్యక్రమ నిర్వహణకంటె సత్ఫలితాలను సమకూరుస్తుందని నారీలోకం సయితం ఎలాగ భావిస్తుందో అర్థం కావడంలేదు.



వింత జంట

శ్రీ యం. సోమ్.

ఉషఃకాలం - భానుడు తన అరుణారుణ కిరణాలను వెదజల్లుతూ, నీలి మబ్బులోంచి తొంగి చూస్తూ "మరల రేపు వస్తాను సెలవు" అంటూ అస్తమిస్తున్నాడు. చిత్ర కారుని బొమ్మలకు అవసరమైన రంగులన్నీ ఆ ఆకాశంలో మిళితమై కనిపిస్తున్నాయి. కవి వర్ణనకు పుట్టిల్లయిన పకృతి ప్రశాంతాన్నందిస్తూంది. ఆ సాయంత్రపు సూర్య కిరణాల్లో మెరసిపోతూన్న సముద్రపుటొడ్డున పిల్ల వాయువులకు అల్లల్లాడే ముంగురులను చక్కబెట్టుకుంటూ అందం, ఆనందం అంతా తమదే అనుకుంటూ మురిసి పోయే యువతులు, స్వేచ్ఛ అంటే యింకెక్కడుందంటూ చేయి చేయి కలిపి తిరిగే యువకులు, కుక్కలతో ఆడుకునే పిల్లలు, పిల్లలతో ఆడుకునే తల్లులు, తల్లులతో బాధపడే కూతుళ్లు, కూతుళ్ళతో విసుగుచెందే తండ్రులు, 'ఆమె నన్ను చూడలేదే!' అని అలమటించే అమాయకులూ, అల్లరిచేసి ఆనందించే అంగనలు, మమత మాల మనసు మెరపుల మురిసిపోతూ తొంచి చూచే పూబోండ్లు, వీరి చర్యలను చూస్తూ ఆనందించేవారు కొందరు - విసుగు చెందే వారు మరికొందరు, ఒకవైపు 'వేరుగళ్' కుర్రవాని కేకలు, మరొక వైపు ఐస్‌క్రీమ్ అమ్మేవాని అరుపులు, కాకుల కోలాహలం, కుక్కల అరుపులు వీటన్నిటికీ స్మృతి పోస్తూన్నట్లు సముద్రపు ఘోష. ఇసుకలో కూరుకు పోతూన్న కాళ్ళను ఈడ్చుకుంటూ ఆ రమణీయాన్ని గురించి పొగడుతూ నా ప్రక్కనే నడుస్తూ వస్తూన్న స్నేహితునివైపు తిరిగాను. అంతవరకూ నా వెంట వస్తూ అంత అకస్మాత్తుగా ఎక్కడ ఆగిపోయాడా అని వెనక్కి తిరిగి చూశాను. మన వాడు కొన్ని గజాల దూరంలో ఎవరితోనో మాట్లాడుతూ నవ్వుతూ నన్ను రమ్మని పిలిచాడు. తరువాత వారికి నన్ను, నన్ను వారికి పరిచయంచేసి వారితో యింకా ఏమో మాట్లాడుతూనే వున్నాడు. మన వాడితో మాట్లాడుతూన్న యువకుని మాటల్లోని ఆప్యాయత, ఆ చూపుల్లోని శాంతం నన్ను మరీ ఆకర్షించాయి. అతని ప్రక్కనే కూర్చొని పొంగి పొరలే ఆనందంతో తన చిన్న బిడ్డను ఆడిస్తూ మాతృ హృదయాన్ని వెల్లడిస్తూంది అంగ సౌష్టవంతో కూడుకున్న షుమారు పదునెనిమిది సంవత్సరాల అందాల భరిణి. బంగారు ఛాయలాంటి ఆమె శరీర ఛ్చాయ, నల్లని దీర్ఘమైన రెండు జడలు, మెరసిపోయే నేత్రాలు, చిలుక పలుకల్లాంటి ఆ మాటల్లోని పొదుపు అంతా ఆమె ఎవరో చిత్రకారుని చిత్తరువో, కవుల ఊహా స్వరూపమో అన్నట్లుంది. వారిరువురి మధ్య చిన్న చిన్న అడుగులతో అల్లి బిల్లి తిరిగే చిన్న పాప - చూడటాని కెంతో ముచ్చటగా ఉంది.

ఆలా చూస్తూన్న నన్ను మన వాడు నా చెయ్యి పట్టుకొని "చెప్తాన్నడు" అంటూ బయలుదేరాడు. మరేం చెయ్యను. "సరే" నని నడక సాగించాను. అలా నడు స్తూనే మనవాడు ఆ జంటను గురించి చాలా వింత వింత విషయాలు చెప్పటం ప్రారంభించాడు. అలా చెప్పుకుంటూ మెల్లగా రూము చేరాము. ఏ నిమిషాన్ని చూసినా ఆ ఆదర్శమైన జంటే గుర్తుకు వస్తూంది. ఒక్కొక్కరి మనస్తత్వాన్ని గురించి-అందులో స్త్రీలను గురించి ఎన్నో రకాలుగా ఆలోచించాను. కాని స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోవటం అంత సులభమైనది కాదేమో! ఒకప్పుడు ఆనందాన్ని చేకూర్చిన స్త్రీయే మరొకప్పుడు అశాంతి నిస్తుంది. అమృతాన్ని వెదజల్లే అబలే విషాన్ని కురిపించే కర్కసిగా మారుతుంది. ఒక క్షణంలో తన ప్రేమ హృదయాలయ సింహద్వారాన్ని తెరచి పూజారి నాహ్వా నిస్తుంది. మరుక్షణంలోనే కవాటాలను బంధించి పిశాచాల

కాలయమైన శ్మశానంగా మారుస్తుంది. తన సంతోషానికై మరికొందర్ని బాధలకు గురి చేస్తుంది. మరొకరి ఆనందం కొరకు తాను కష్టాల నెదుర్కొంటుంది, వెన్నపూసలాంటి మనసు కఠినశిలగా మారుతుంది. చలనంలేని హృదయాన్ని వూరికే చలింప జేస్తుంది. ఏమిటీ మార్పు! ఇలా ఏమో ఆలోచిస్తున్నానే కాని అసలా జంట కథ ఎక్కడ ప్రారంభించి వ్రాసి మన వాడి కోర్కె తీర్చాలో బోధ పడింది కాదు. పోనీ శుభమస్తూ అని పెండ్లితో ప్రారంభిద్దా మనిపించింది. సరే అనుకున్నాను.

ఈ పెండ్లిండ్ల విషయాలు చూశారూ మహ వింతగా ఉంటాయి. అది మానవ సృష్టిలోని కీలకమే అనుకోండి, మరేమైనా అనుకోండి. కాకపోతే ఎక్కడో పెరిగిన అబ్బాయికి, మరెక్కడో పుట్టిన అమ్మాయికి పెండ్లి. పెండ్లంటే చిన్న దగ్గర నుండి పెద్ద వరకు సంతోషమే. ముఖ్యంగా చావటానికి సిద్ధంగా ఉన్న వృద్ధులకు మరీను. ఈ వృద్ధుల తాలూకు పెండ్లీడు పిల్లలు ఎవరైనా ఉంటే వీళ్ళ పోరు పడటం మాత్రం చాలా కష్టం. ఆ పిల్లల పెండ్లయితే చూసి మరీ ప్రాణాలు వదుల్దామని. వీళ్ళ పెండ్లికి వాళ్ళ చావుకు ఏమిటో సంబంధం!

రమణ కుటుంబంలో అలా పెండ్లికని పోరు పెట్టే వాళ్ళు చాలామంది ఉన్నా రమణ మాత్రం వారి మాటలు చెవినిపెట్టకుండా కాలేజీ చదువు సాగిస్తున్నాడు పట్టణంలో. కుమారుని పట్టుదలకు విసిగి విరక్తి చెందిన నాన్నగార్కి అకస్మాత్తుగా ఒక జాబు వచ్చింది. దాన్ని చదివేటప్పటికి తనకే కాకుండా ఆ యింట్లో వున్న అందరికీ గుండె ఆగి పోయినంతయింది ఆనందంతో. తలవని తలంపుగా తన ముద్దు బిడ్డలో అంత మార్పు ఎందు కొచ్చిందో తెలియని వెర్రి తండ్రి ఆ ఉత్తరాన్ని మరల మరల చదువుకున్నాడు. తన ఏకైక పుత్రుని పెండ్లి విషయంలో తాను ఏసంబంధం తెచ్చినా ఒప్పుకుంటానని వ్రాయటం వల్ల పొంగి అప్పుడే పెండ్లయినంత ఆర్భాటం చేశారు. రోజూ నాలుగు సంబంధాలు చూస్తున్నారు. రమణంటే అన్నివిధాలా మంచివాడు. అందులో కాస్తో కూస్తో స్థితిమంతుడు. మరేం కావాలి! చివరకు ఏదో ఒక దూరపు సంబంధాన్ని నిర్ణయించటం, వెంటనే రమణని పెండ్లి చూపులకని కబురుచేయటం. అతను రాగానే అందరూ కలిసి వారి సాంప్రదాయ ప్రకారంగా వధువును చూడటానికని వరుడు వధువు ఇంటికి కాకుండా వారికి వీరికి బంధువులైన మరొక రింటికి వెళ్ళారు. ఇటునుండి వీళ్లు చేరుకునే టప్పటికి రాత్రి చాలా ప్రొద్దు పోవడం వల్ల ఆ రాత్రి కేదో లోకాభిరామాయణం మాట్లాడుకొని పుణ్యకాలం కాస్తా గడిపారు. ఆ యిల్లు వధువు పిన తండ్రిగారి యిల్లు. ఆ యిల్లు, దాని వెనుక దొడ్డి, దానిలో బావి, ఆ ప్రక్కనే వున్న పూల మొక్కలు, ఆ యింటి స్థితి సాధారణమైందని తెలుపుతూంది.

ఆ మరునాటి ఉదయాన్నే స్నానం ముగించుకొని ఒళ్లు తుడుచుకుంటూ ఆ బావి దగ్గరే ఏదో ఆలోచిస్తూ నుంచున్నాడు రమణ. అతనిలో ఉత్సాహం ఏమూలా కనిపించటంలేదు. మనసు లేని మరలాగ ప్రక్కన వారు చెప్పిన దల్లా చేస్తున్నాడు. ఎలాగైనా సరే, ఏమైనా సరే తల్లిదండ్రుల కోర్కె తీర్చటానికనే ఆ పెండ్లి కొప్పుకున్నాడు — అంతే. ఆ కోర్కెతోనే పిల్లను విధాయికంగా చూడాలన్నట్లు వచ్చాడు. తన అమూల్యమైన ఆశయాలన్నీ ఏనాడో అడుగంటి పోయాయి. అతనిలోని ప్రేమజ్యోతి ఆరి సన్నని పొగ మాత్రం వస్తూంది. అతని హృదయం ప్రస్తుతం అద్దెకొంపలాంటిది - అంతే. వెలకట్నాలిచ్చి తన హృదయాన్నాక్రమించు కోవటానికి ముక్కు, మొగము తెలియని యువతి వస్తోంది, ఆ వచ్చే ఆవిడ తన జీవితపు తోటలో విష బీజాల్ని నాటుతుందో! ప్రేమ మొక్కల్ని పెంచుతుందో! ఎలా తెలుస్తుంది?

ఏమైనా సరే ఆ పెండ్లికి ఒప్పుకున్నాడు తాననుకున్నది తనకు కానప్పుడు మరొకటేదైతేనేం? అందుకే ఆకాబోయే భార్య ఎవరో? ఏమిటోగూడా తెలుసుకోవటానికి ప్రయత్నించలేదు. ఏదో ఆలోచనతో అలాగే సూన్యంగా అచ్చటి పూలమొక్కల్ని చూస్తూ కూర్చున్న అతని కండ్లు వున్నట్లుండి ఒక్కసారిగా మెరిశాయి. ఆ పూలచెట్లమధ్య మెరపుతీవిలాంటి యువతి చిన్న పిల్లని వెంటబెట్టుకొని చెట్ల పాదులను బాగుచేస్తూంది. ఆ యువతి ఇతన్ని చూడ కుండగనే తన పని తాను చేసుకుంటోంది. ఆ యువతి ముఖం మాత్రం అతనికి కనిపించటంలేదు గాని - ఆమె నడకని - ఆ వాలుజడని చూడగానే ఇతని గుండె దడ ఆరంభమయింది. ఆవిడే పెండ్లికూతురేమో అనుకున్నాడు. మరలా పెండ్లికూతురైతే అలా చెట్ల పాదుల్ని బాగుచేస్తూ వుంటుందా - హాయిగా ముస్తాబై ఏ గదిలోనో కూర్చో వాలిగాని. అయినా ఏమో - అనే అనుమానం. ఆమె ముఖాన్ని చూడగానే తీరిపోయింది. ఏదో గుర్తుకు

వచ్చింది — తన్ను చూడగానే రాతిబొమ్మలాగ నిల్చి పోయిన ఆమెను మరల చూడలేకపోయాడు. పెదవులు వణుకుతున్నాయి. అవమానంతో తలవంచుకొనిపోయింది అపరాధమన్నట్లు శరీరం కంపించింది. భయంతో కళ్ళు మూసుకొనిపోతున్నాయి. సిగ్గుతో కాళ్ళు పరుగెత్తుతున్నాయి. ఎందుకో? అలా గబగబా తనకని నిర్ణయించబడిన రూములోకి వెళ్ళాడు. నాన్నగారి ద్వారా పెండ్లి కూతురు ఆవిడేనని తెలుసుకొని విలపించటం మొదలు పెట్టాడు. ఆరోజు తన ఆశలన్నీ అడుగంటినరోజు - తన ప్రశాంత జీవితంలో పెనుతుపాను రేగిన రోజు గుర్తుకు వచ్చింది. ఏదో చెప్పలేని బాధ తన హృదయాన్ని దహించివేస్తోంది. "ఆమెతో పెండ్లి వద్దంటే వద్దని" నాన్నగారితో చెప్పాడు. ఇంకేముంది? అంతవరకూ ఆనందంలో మునిగి తేలుతున్న నాన్నగారికి చాలా అన్యాయం జరిగింది. రమణకు పిచ్చేమైనా పట్టిందేమో! అనే అనుమానం ఆవరించింది. కాకపోతే అంతవరకూ వచ్చిన తరువాత అలా అంటాడా? పోనీ పిల్లేమైనా నచ్చలేదనుకోవటానికి అలాగేం లేదు. మరయితే అంత అకస్మాత్తుగా ఏమిటా మార్పు? పైపెచ్చు తానేదో అపరాధం చేసినట్లు భయపడుతున్నాడు. అంతా అయోమయంగా వుంది. ఈ విషయమంతా ఒక్క క్షణంలో ఆ యిల్లే కాకుండా ఆ వీధి అంతా ప్రాకిపోయింది. నలుగురూ నాలుగు విధాలా అనుకోవటం ప్రారంభించారు.

ఈ విషయాలన్నీ వింటున్న రాధ తన పెండ్లి పచ్చడి మెతుకులుగా మారినా, పాయసాన్నం తింటున్నట్లే ఆనందిస్తూంది. తన కన్నివిధాలా తగిన వరుడు తన్ను పెండ్లాడటానికి నిరాకరిస్తుంటే ఆవగింజంతైనా విచారించదు సరిగదా ముందెన్నడూలేని సంతోషంతో వికసిస్తూ, పరిమళాన్ని వెదజల్లుతూంది. ఏమిటీ వింత ప్రవర్తన? అతనికి బాధ — ఈమెకు సంతోషం—

ఆమెకు తెలుసు- అతనెవరో? ఎందుకలా బాధపడుతూ పెండ్లి వద్దంటున్నాడో? వారి వింత ప్రవర్తనలకి అందరూ తికమక అవుతున్నారనీ తెలుసు — ఎవరెలా పోతేనేం?- ఏదెలా జరిగితేనేం? తన సంతోషానికి అతనే కారణం - అతని విచారానికి తనే కారణం- ఆ హృదయ పరిచయం.... ! బావిదగ్గర చూసినప్పుడే అతని వింత ప్రవర్తన గ్రహించుకుంది. అతనెంతగా ఖిన్నుడై వుంటాడో గ్రహించుకుంది. అప్పుడే మాట్లాడదామనుకున్నా అవకాశం లేకపోయింది- అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది—

ఏ సుందరమూర్తిని దర్శించి- తన తప్పును క్షమించమని ప్రాధేయ పడటానికి పడరాని పాట్లు పడిందో- ఏ శాంతమూర్తికి తోడుగా నిలచి కళామతల్లికి వన్నెలు దిద్దుదామనుకుందో- ఆ కళా పిపాశినే- దైవం, తన భర్తగా చేకూరుస్తున్నాడంటే ఆనందం గాక మరేముంటుంది? ఆ ఆనందంతోనే రమణ వద్దకు నడుస్తూంది—— కాని- ఆనాటి సాయంత్రం - ఆ నవ్వులు - అవమానంతో క్రుంగిపోతున్న యువకుడుకి అన్నీ గుర్తుకు వచ్చాయి. శరీరమంతా ఒక్క సారిగా వణికింది. తన చేతిని ఒక్క సారి చూచుకుంది. అదే చెయ్యి ఆరోజు- అబ్బా! ఆ చేతిని రెండు ముక్కలుగా నరికి ఆ రక్తాన్ని అతని కాళ్ళ ముందు ధారపోసి క్షమాపణ కోరుకుందామనుకుంది. అలా ఆలోచిస్తూనే అతని రూములోకి ప్రవేశించింది. అంత వరకు ఏదో ఆలోచిస్తూ మరో లోకంలో వున్న రమణ ఈమె రాకతో యధాలోకంలోకి వచ్చాడు. ఆలోచిస్తున్న అతని కాళ్ళవద్ద అలాగే కూర్చొని జాలిగా అతని ముఖంలోకి చూసింది, తప్పు క్షమించమన్నట్లు. అతనిలో అంతవరకూ అలుముకొస్తున్న ఆవేదన ఆనందంగా మారింది. పడిపోయిన ప్రేమసౌధాల్ని మరల గట్టిగా కట్టుకోవటానికి చేయి చేయి కలుపుకున్నారు. ఒకరి కన్నీరు మరొకరు తుడుచుకున్నారు. అలా ఒక్క క్షణకాలంలో స్వర్గాన్ని నిర్మించుకున్నారు.

ఇదంతా చూస్తున్న అచ్చటి బంధుకోటికి నిజంగా పిచ్చపట్టినంతై "కలయో వైష్ణవ మాయయో" అన్నట్లు ఆపిచ్చలోనే పెండ్లి చేశారు. వాళ్ళ పెండ్లయితే మహా వైభవంగా జరిగింది గాని- వీళ్ళకి పిచ్చమాత్రం యింకా వదలక చెవులు కొరుక్కుంటున్నారు. నిజమే, రమణా-రాధల విషయం వీళ్ళకేం తెలుసు? తెలిసిన స్నేహితులు కొందరు మాత్రం చాలా సంతోషించారు.

అలా సంతోషంతోనే కొన్నాళ్ళు గడిపారు. ఇప్పుడు రమణ వుద్యోగంచేస్తూ హాయిగా పట్టణంలో కాపురం చేస్తూ వీలున్నప్పుడల్లా తన లలిత కళలకు వన్నెలు దిద్దుతూ కాలం గడుపుతున్నాడు, ఆ దంపతుల ప్రేమ ఫలితంగా పుట్టిన ముద్దుబిడ్డ పుట్టిన రోజు పండుగకు తమ స్నేహితుల నందర్నీ పిలిచారు. వచ్చిన అందరూ

పొగడటం - దీవించటం అంతా జరిగిపోయింది. రాధ స్నేహితురాండ్రు ఆమె ముద్దు బిడ్డని ఎత్తుకొని ఆడిస్తున్నారు, కాని బిడ్డ మాత్రం తల్లి కొరకని ఏడుస్తూ, వారి చేతుల్లో నిలువకుండా ప్రళయ తాండవం చేస్తున్నాడు. దానితో పాపం రాధ తాను తన స్నేహితురాండ్ర కిచ్చిన ఆనందం, తన చంటిపాప యీయటంలేదే! అన్న కోపంతో స్నేహితురాలి చేతిలోని బిడ్డను తీసుకుంటూ "చెంప పగులకొడితే సరి" అన్నది తల్లి ప్రేమతో. ఆమాట వినగానే వారికి కొంత దూరంలో స్నేహితులతో కూర్చొని కాఫీ తీసుకుంటున్న రమణచేయి తన చెంప మీదకు పోయింది ఏదో గుర్తుకువచ్చి. అది గమనిస్తున్న అచ్చటి వారికి ఈ సంఘటన చిత్రంగా తోచింది. ఏమిటి ఈమె మాటలకి- అతని చేతలకి సంబంధం? అదే ప్రశ్న అందర్నీ ఎదుర్కొంది. ఉండబట్టలేని తెలిసీ తెలియని ఒకావిడ ఆ సంబంధాని గురించి రాధని ఏకాంతంగా? పిలిచి అడిగింది. తాను గూడా ఎవరికో కాబోయే భార్య గనుక, ఆమర్మమేదో తెలుసుకుంటే, అవసరమైతే వుపయోగించుకుందామనే ఆశతో— రాధకి చెప్పటం తప్పనిసరై దీర్ఘంగా నిశ్వాశించి చెప్పడం మొదలుపెట్టింది.

"అవి నేను మద్రాసులో చదువుకునే రోజులు. ప్రతీ రోజూ సాయంత్రం మా నాన్నగారు, అమ్మగారు, నేనూ బీచికి వెళ్ళే వాళ్ళం. ఎన్ని పనులున్నా బీచికి పోవటం తప్పనిసరయింది. మేము బీచికి వెళ్ళినప్పుడల్లా మాకు సమీపంలో ఎవ్వరో కూర్చొని వుండేవారు ఏకాంతంగా. ఆ వ్యక్తి ప్రతిరోజూ అదే స్థలంలో కూర్చోవటం జరుగుతూండేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి—కాని మా నివాస స్థలంలో మాత్రం ఏమీ మార్పుండేది కాదు. ఆ వ్యక్తి మా కొరకు అక్కడ కూర్చుంటున్నాడో, ఆ వ్యక్తి కొరకు మేమక్కడ కూర్చుంటున్నామో బోధ పడేదికాదు. ఆ వ్యక్తిని చూస్తున్నకొద్దీ నాకు వింత వింత ఆలోచనలు వస్తూండేవి. ఆ ఏకాగ్రత, ఆ ఆలోచన, ఆ వాలకం చూస్తూంటే అతనెవరో పకృతినారాధించే చిత్రకారుడో, లేక కవియో అయివుంటాడనుకునేదాన్ని. ఎండలో ఆ బీచిలో కనుపించేవారు. కాని నా దృష్టిమాత్రం వారందర్నీ తప్పుకొనే ఆ వ్యక్తి మీదకే పోయేది. అమ్మ, నాన్న ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూంటే, నేనూ మాట్లాడుతూ, రోజూ వున్న అలవాటు ప్రకారంగా వీలు జూచుకొని అతని వైపు చూశాను- ఇంకేముంది! దొంగ ఎంతసేపటినుండి నన్ను అలా తొంగి చూస్తున్నాడోకాని, నేను చూచేటప్పటికి దృష్టి మార్చాడు పెద్ద మనిషిలాగ. ఏం? నేను మాత్రం తక్కువ తిన్నానా? నేను చూస్తూంది గూడా అతన్ని కాదన్నట్లు దృష్టి మార్చాను సీరియస్‌గా.

"అలా చూపు మార్పులతో కాలచక్రం మరి కొంచెం తిరిగింది. నాకెప్పుడూ అతన్ని చూడాలనిపిస్తుండేది. అతని చర్యల్ని బట్టి చూస్తే అతనికి నన్ను చూడాలని వున్నట్లు అర్థమయ్యేది. ఆ కోర్కె నాలో ఎందుకు తలెత్తిందో నా కర్థమయ్యేదికాదు. ఎంతోమంది యువకుల హృదయాల్ని ఆరాటపెట్టిన నా హృదయం అతన్ని గురించి ఎందు కారాట పడాలి? ఏమో! నా పట్ల అతనూ అలాగే బాధపడుతున్నట్లు గ్రహిస్తుండేదాన్ని- ఎప్పటి కప్పుడు అతనెవరో, ఏంచేస్తుంటారో? ఎక్కడున్నారో? తెలుసుకోవాలనే కోర్కె కలగటం- అవకాశంలేక ఆరాట పడటం జరుగుతూండేది అతను నన్ను ఎంతో ఆప్యాయంగా చూస్తూండగా చాలా సార్లు చూశాను. ఏ రోజైనా అతను బీచికి రావటం ఆలస్యమైందంటే మానాన్న, అమ్మ చెప్పే మాటలేవీ బుర్రకెక్కేవి కావు. ఏదో ఆశతో ప్రతి రక్తనాళం అతని కొరకు తహ తహ లాడేది. నా పరధ్యాహ్నానికి నాన్న, అమ్మ అప్పుడప్పుడు కారణం అడగడం నేను ఏదో సమాధానం చెప్పడం అలవాటయి పోయింది. నా వింత ప్రవర్తన కొందరు స్నేహితురాళ్లు కనిపెడుతున్నా- పాపం ఎందుకో అందరూ మౌనంగానే వుండేవారు. అతని నిర్మలమైన చల్లని చూపులు- ఆ చిరునవ్వులే, అలా అందర్నీ మార్చివుంటాయనుకున్నాను. రోజు రోజుకు- అతన్ని గురించి ఆలోచించుకునేదాన్ని. ఆ ఆలోచనలోని ఊహలు తారాపథాన్ని అందుకునేవి- ఆ వూహల్లోనే ఒకటి నాబుర్రలో మెరసింది. వెంటనే అతనికొక వుత్తరం వ్రాద్దామని- దాన్ని రహస్యంగా అతనికి ఇవ్వాలనే కోర్కె కొద్దీ వుత్తరం వ్రాయటం ప్రారంభించేనేగాని, ఎలా వ్రాయాలో, ఏమని వ్రాయాలో తోచిందికాదు. అలాంటి వుత్తరం వ్రాయటం అదే మొదటి సారి అవటం వల్ల కాబోలు- పట్టుదలతో చెయ్యి వ్రాద్దామన్నా, మనస్సు వెనక్కి లాగుతోంది సిగ్గుతో- ఎలాగైతేనేం చివరకి వ్రాయటం ప్రారంభించాను.

"శ్రీ............

- మీరెవరు? ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? మీరు రోజూ నన్ను చూడటం.... అసలు మీకు వివాహం....

ఇంతలోనే, సిగ్గు నా హృదయంలో ఎక్కువ భాగం ఆక్రమించుకోవటం వల్ల నడక ఆగిపోయింది పాపం- సిగ్గుని ప్రతిఘటించి కలం నా పేరును మాత్రం వ్రాయగలిగింది. ఆ ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా అతని ముందు పడవైచి, ఏమీ తెలియనట్లుగా మా అమ్మ, నాన్నగారి ప్రక్కన వచ్చి కూర్చున్నానేగాని నామనస్సు మాత్రం ఏమేమో ఆలోచిస్తోంది. అలా వుత్తరం వ్రాయటం వల్ల చులకనై పోతానేమో ననే అనుమానం, వెంటనే అతనెప్పుడూ అలా చూడడనే ధైర్యం- అమ్మా, నాన్నకు తెలుస్తుందేమోననే భయం- అయినా నచ్చజెప్పవచ్చుననే విశ్వాసం. ఇలాఆలోచన పరంపరల్లో నుండి తేలుకొంటున్నానో లేదో, యింతలోనే నా రెండు కండ్లు అతని వైపు తొంగి చూచాయి. ఎంతో ఆప్యాయంగా అతను వుత్తరాన్ని ఇసుకలోనుండి తీసుకున్నాడు. వుత్తరాన్ని చదివి ఏం గ్రహించాడో గాని, తిన్నగా నవ్వుకున్నాడు. మా నాన్నగారి మాటలు నాదృష్టిని మరల్చాయి. తరువాత ఇంటికి వెళ్లేటప్పుడు వెనుకగా నడుస్తున్న నాముందుకి ఇసుకతోసహా కాగితం ముక్క పడింది. వెంటనే దాన్ని మరొకరి కంట పడకుండా నా పరుసులో భద్రపరచాను. రూములో కూర్చొని సావకాశంగా చదువుకుందామనే ఆత్రుత నాకు మా యింటిని చాలా దూరం చేసింది. ప్రతి నిముషమూ లెక్కపెట్టుకుంటూ ఇల్లు చేరాను- రూములో ఎంతో ఆత్రుతతో ఆ కాగితాన్ని విప్పి చూచాను- అంతా అయోమయం - అది నేనిచ్చిన కాగితమే- అన్నీ ఆ అక్షరాలే- నేను వ్రాసిన దస్తూరే - ఇదేమిటి నా ఉత్తరాన్ని మరలా నాకే యివ్వట మేమిటి? అనుకున్నంతా అయింది. ఈ మగవాళ్ళంతా ఇంతే. మనంగా కోరితే తాడిచెట్టెక్కి కూర్చుంటారు. అయితే బీచిలో రోజూ నేను చూచేది మేడి పండన్న మాట? కాకపోతే ఇంతగా కోరి వ్రాస్తే...... ముందుగా హృదయావేదనని వెలిబుచ్చినంత మాత్రాన యింత చులకనయ్యేనా? పైపెచ్చు ఆ చిరునవ్వులెందుకు? అనవసరంగా ఎదటివార్ని మోసం చేయటానికి కాకపోతే- ఇలా ఏమేమో ఆలోచిస్తున్నాను. ఆ క్షణంలో అనుభవించిన బాధ, ద్వేషం, కోపం, నా జీవితంలో ఎప్పుడూ పొందలేదు. ఇదంతా ఒక లిప్తకాలం. ఆరోజే నా జీవితగ్రంధంలోని సువర్ణాక్షర పూరితమైన పుట- ఆ వుత్తరమే నాకు మొదటిది- చివరిది గూడా నేమో అనుకున్నాను. ద్వేషపూరిత హృదయంతో ఆ వుత్తరాన్ని మరలా చదివాను ఈసారి ఏదో మార్పు నా కన్నీటి తెరల్లోనుండి కనిపించి ఆశ మరల తలెత్తింది. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. వుత్తరాన్ని మరీ మరీ చదివాను- వుత్తరం క్రింద నా పేరుప్రక్కన- ర-మ-ణ అనే మూడుఅక్షరాలు క్రొత్తగా వున్నాయి. ఎన్నిసార్లు చదివినా యింకా చదవాలనిపించేది 'రాధ, రమణ' చాలా బాగుంది. రమణ కూడా, నేనడిగిన ప్రశ్నల్నే నన్నూ అడుగుతున్నట్లు రూమంతా ప్రతిధ్వనించింది. అతనికి ఎప్పుడు, ఎలా సమాధానం ఇవ్వటమా అనే ఆలోచన ఆ ఆనందాన్ని అణచిపెట్టింది. ఆ రాత్రంతా ఆలోచనతోనే గడిపాను. ఆరోజు సాయంత్రం కొరకు ఎదురుచూస్తున్న నా వింత ప్రవర్తనకు, అమ్మ, నాన్న ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. బీచికని ముస్తాబై, ముందుగానే వెళ్ళి కార్లో కూర్చున్నాను. తరువాత నాన్న, అమ్మగార్లతో కారు బయలుదేరింది. కారు వేగంగా వెళుతూంది. అంత కంటే వేగంగా నా మనస్సు బీచిలోని రమణ వద్దకు పరుగెడుతున్నది. అతనితో ఎప్పుడు మాట్లాడడామా? అసలు మాట్లాడటమెలాగా? ప్రక్కనున్న తలిదండ్రులు: ఏంచేయాలి? ఈ ఆలోచనల్లో తలవంచుకొని పోయింది. ఈ ఆలోచనలే కారు చక్రాలు గాలికంటే వేగంగా అల్లిబిల్లి తిరుగుతున్నాయి అలా కారు చక్రాలు ఎంత దూరం దొర్లాయో గాని, నా ఆలోచనలకీ, కారు వేగానికీ ఒకే బ్రేక్‌లాగా డ్రైవరు కారు నాపాడు. దానితో నావూహా ప్రపంచంలో నుండి వూడి పడ్డాను. ఇంకేముంది: బీచీలేదు: రమణ లేడు ఒక సినిమా థియేటరు- అప్పుడర్థమయింది, మేము సినిమా చూడటానికి వెళుతున్నామని. ఎన్నడూ లేనిది ఆరోజున సినిమాకి వద్దనటం- చాలా ప్రశ్నలకి జవాబియ్యవలసి వస్తుందని, తప్పనిసరిగా హాల్లోకి ప్రవేశించాను. పాపం- రమణ బీచిలో నాకొరకని ఎదురు చూస్తూంటాడనే బాధతో సినిమా ఏం చూశానో అర్ధం కాలేదు. ఆరోజు ఎలా గడిచిందో కన్నీటితోతడిసి పోయిన నా దిండుకే తెలుసు. ఆమర్నాడు సాయంత్రం నాన్నగారికేదో పనుండి బీచి ప్రయాణం ఆపుకున్నారు. అది విన్న నాకు, ఏడుపు, కోపం, ఈర్ష్య యింకా ఏమేమో ముప్పిరికొన్నాయి—ఏమిటీ తికమకలు? ప్రేమా ప్రేమికుల మధ్య యిలాంటి అవాంతరాలెందుకు వస్తాయి? ఇలా మేం బాధపడుతూంటే చూసి సంతోషించటమేనా యీ భగవంతుడనే వాడికి ప్రీతి! కాకపోతే ఎన్నడూ లేని పరిస్థితుల్ని యిప్పుడే ఎందుకు కల్పించాలి- రమణని నిన్న కల్సుకోక పోయినందుకే ఎంతో బాధపడి వుంటాడు-

మళ్ళీ యీరోజు గూడా—! వచ్చే ఏడ్పునంతా దిగమింగి ఎలాగో ధైర్యంచేసి అమ్మను పురిగొల్పాను యిరువురమూ, బీచికి వెళదామని. ఆమె రావటానికి ఒప్పుకోలేదు. నా పోరుకి విసిగిపోయింది కాబోలు. నన్ను ఒక్కదాన్నే వెళ్ళి త్వరగా రమ్మన్నది. ఇక అప్పటి నా ఆనందాన్ని చెప్పాలంటే మా అమ్మని ఎన్నిసార్లు ముద్దుపెట్టుకున్నానో లెక్క చూస్తేగాని తేలదు. అంతవరకు నిందించబడుతున్న భగవంతునికి నారెండు చేతులే కాకుండా, యింకా అవకాశం వుంటే ఎక్కడయినా మరి పది చేతులు అప్పుతెచ్చుకుని ఒక్కసారిగా నమస్కారం చేద్దామనుకొని, లాభం లేక నా రెండు చేతులతోనే యిరవైసార్లు నమస్కారం చేశాను.

"కారు దిగిన తరువాత నా కాళ్ళు ఆ ఇసుకలో అంత త్వరగా ఎలానడిచాయో గాని, అతి సల్పకాలంలోనే మా నియమిత స్థానాన్ని చేరాను. చిరునవ్వుతో వికశిస్తున్న రమణ ముఖమే తానంతవరకు మీరాక కొరకని ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. నేను కూర్చున్నానో లేదో ! నాకు తెలియకుండానే చిరునవ్వొకటి నా పెదవులపైన చిందులు త్రొక్కింది. దానికి వంతగా రమణ రెండుకండ్లు మెరశాయి. ఆనందంతో నా వంటరితనం, అతని ప్రేమ కొలను గట్లను పగులగొట్టింది కాబోలు - ఎన్నో రోజుల నుండి ఆకొలనులో అంచలంచలుగా చేరిన, అనురాగం, ఆనందం - ఆ గట్లనుదాటి ప్రవహించాయి - ఆ ప్రవాహంలోనే అతను తేలిపోయి, నాకు రెండు అడుగుల దూరంగా కొట్టుకొచ్చాడు. నన్ను సమీపించటంతోనే, ఏవో రెండు మాటలు అతని పెదవుల్ని పగుల గొట్టుకొని వచ్చాయి. 'ఏమిటి' అర్థం కాలేదన్నట్లు అతనివైపు మరొసారి చూశాను - అతను నా ప్రక్క కూర్చుంటూనే 'మీరు ఒక్కరే వచ్చారు ....? నిన్నమీరు' - అనే మాటలు తడబడుతూ వినిపించాయి అస్పష్టస్వరంతో - దానికి సమాధానం ఏమో చెప్పాలనుకున్నాను కాని ఒక్కమాటైనా పెగలి రాలేదు బైటకు-అలానే ఒక క్షణకాలం మాయిరువురి మధ్య నిశబ్దం పాదుకొన్నది. యింతలోనే, అతని రెండు కండ్లు నా చేతిమీద పడ్డాయి. అది గమనించిన నేను - ఎలాగో 'ఈ వుంగరం - బాగుందా?' అన్నాను - అంతవరకూ నా మాటకొరకని వేచివున్న అతను - పట్టలేని ఆనందంతో — 'అవుంగరంకన్నా ఆచేయి - ఆ వ్రేలు ఎంతో బాగుంది' అంటూ అతనిచేయి నాచేతి మీదకు వచ్చింది - అ స్పర్శతో నాలో ఏదో అనిర్వచనీయమైన మార్పు వచ్చింది. నాచేతి నాలుగు వ్రేళ్ళని ఏంతో ఆప్యాయంగా పట్టుకొని, తన పెదవులవైపు .... వెంటనే ప్రక్కనవున్న కొన్నికాకులు పక్కున నవ్వాయి - మానవ స్వరంతో - దానితో ఏదో తెలియని ఆవేశం - క్రోధం - ఒక్కసారిగా ఆవరించినై - ఏదో పైశాచికశక్తి నాలో ప్రవేశించింది. నేనెక్కడున్నానో ! ఏంచేస్తున్నానో, ఏం జరిగిందో గూడా తెలియలేదు. కాని 'చళ్' - అనే శబ్దం మాత్రం నాచెవుల్లో మారుమ్రోగింది. రమణచేయి - అవమానంతో చెంప పట్టుకుంది. అతని చెంపతో పాటు, నా చేయిగూడ ఎర్రబడింది. ఇరువురం ఆలాగే కొంత వరకు స్థంబించి పోయాం. యింక అక్కడుండలేక ఇంటికివచ్చాను- అదే ఆఖరిఘడియ. ఆ మరునాటి నుండి బీచికి వెళ్ళటం మానుకున్నాను. ప్రతిరోజు సాయత్రం ఆ ఘడియ వచ్చినప్పుడల్లా ఆ బీచికోలాహలం - ఆ నవ్వులు - అవమానంతో కృంగిపోతున్న అతని ముఖం గుర్తుకు వస్తూండేవి - ఏదో అర్థంకాని బాధ ఆవురించి అలమటింపజేసేది. అతనెంతో ప్రేమతో - ఆప్యాయంగా చేతి వ్రేళ్ళను పట్టుకొని - అంతమాత్రాన - ఏమో తెలియకుండా అతని హృదయాన్ని గాయపర్చాను - అంతవరకు అతనికి నా సర్వస్వాన్ని అర్పించ తలచుకుంటున్న నాలో ఆ పైశాచిక శక్తి ఎందుకు ప్రవేశించింది-? పాపం అతనెంతగా బాధపడ్డాడో ! అతన్ని కల్సుకొని తప్పుక్షమించమని ప్రాధేయ పడదామని, రెండుసార్లు బీచికివెళ్ళి అంతా కలయజూచాను. కాని - నిరాశ. ముఖ్యస్నేహితులద్వారా, అతను, బీచినే కాకుండా, ఆ వూరునే విడచి వెళ్ళాడని తెలుసుకొన్న తరువాత నాకు లోకమంతా చీకటైపోయింది. ఆనాటినుండి ఎలా కాలం గడుపుతున్నానో వాడిపోయిన నా తీవెలకే తెలుసు. నా దీనావస్థను బుజ్జగిస్తూ అడిగే తల్లిదండ్రుల ప్రశ్నలకు ఏదో సమాధానం చెప్తూండేదాన్ని. ప్రతిరోజూ నా పాటలువిని ఆనందించే తల్లిదండ్రులు యిప్పుడా ఆనందాన్ని పొందలేక పోతున్నారు. నా స్పర్శలేక బూజు పట్టిపోతున్న వీణని చూస్తున్నప్పుడల్లా నాన్న, అమ్మ కంటి నిండా నీరు నింపుకొనేవారు - ఆ సమయంలోనే నా పెండ్లి - సంబంధం వచ్చింది - దానికి నాన్న, అమ్మగార్లు చాలా సంతోషించారు. నిజానికి నాకు పెండ్లి ఆశ పూర్తిగా పోయింది- కాని నాన్న, అమ్మగార్లను యీ రూపానైనా సంతోషింప చేసినదాన్ని అవుతానేమోననే ఆశతో పెండ్లికి ఒప్పుకున్నాను. పరిచయంలేని మరొక వ్యక్తికి అర్పించబోతున్న నా శరీరాన్ని గురించి —



అమృతాంజనము

గాని,

"యధాయధా.................కాళీధవళత్వ శంకయా."

అమృతాంజనమా! నీ కీర్తి ముల్లోకములను దెల్పుజేయు పూనికతో పెరుఁగు చున్నప్పుడెల్లను నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే నా హృదయము మిక్కిలి పరితాపమొందుచున్నది సుమా !!!

చిస్తూ మా చిన్న నాన్న గారింట్లో పూల చెట్ల పాదుల్ని బాగుచేస్తున్న నాకు నా మధురమూర్తి - "అలా అంటూనే చేతిలో వున్న పాపవైపు చూస్తూ- యింకా ఏమో చెప్ప బోతున్న ఆమెకు చిన్నపాప ఏడ్పు అడ్డొచ్చింది. అంత లోనే రమణ పిల్ల వాణ్ణి తీసుకుంటూ "చెంప పగిలి పోతుందిరోయ్" అన్నాడు, రాధ ముఖంలోకిచూస్తు. రాధ సిగ్గుతో "చాల్లెండీ!" అంటూ పిల్లవాణ్ణి అందించి స్నేహితురాండ్రతో గదిలోకి వెళ్ళింది.

ఆ జంటను గురించి అనుకున్నప్పుడల్లా నవ్వుకుంటుం టాం - అలాంటి జంటజీవితం క్షణమైనా.......

రూపకం

గొడుగు - గొళ్ళెం

శ్రీ కవికొండల వెంకటరావు.

[రామచంద్రరావు వీధివైపు తన యింటి గుమ్మం గొళ్ళెంలో గొడుగుకామ దూర్చి అలా నిలబడి పోయాడు. ఆవీధే వెడుతూ వీరజనకులు అన్న ఆయన రామచంద్రరావును పలుకరిస్తాడు. అప్పుడిలా సంభాషణ వారిమధ్య నడుస్తుంది]

వీర : ఏమండీ! రామచంద్రరావుగారూ! అలా నిలబడి పోయారే! గొళ్ళెంలోగొడుగెట్టుకు పలవకూడదూ!

రామ : ఎవర్ని పిలిచేది!

వీర : ఏం! ఇంట్లో ఎవరూలేరు?

రామ : ఇంట్లో చాలామందే వున్నారు. మీరెప్పుడూ చూడలేదా ఏమిటి మాయిల్లు?

వీర : ఎప్పుడూ లోపలకు రాలేదండీ! ఎంత సేపూ వీధిలో మిమ్మల్ని పలకరించడమేగా!

రామ : అయితే ఒక్కమాటు మాయిల్లు పావనంచేసివెళ్ళండీ.

వీర : ఏమిటి? నేను అరుగెక్కినా మీరింకా గొళ్ళెము లోనే గొడుగెట్టుకు నిలుచున్నారు ?

రామ : ఈ గొళ్ళెం ముందుకులాగి, వెనక్కినెట్టి అందులో ఇలా ఏదో బిగింపుగా వుంచితేనే గాని లోపల సళ్ళిచ్చి గెడరాదు. (లోపల శబ్దంగలుగును)

వీర : గెడరాక పోవడంకన్న తలుపు బరుకుతూన్న శబ్దం వినవస్తూవుంది.

రామ : అలా బరికి బరికి పైకిఎగిరి, గెడ గభాల్ను తన్ని! ద్వారం యొక్క రెండు రెక్కలూ విడదీసి పారేస్తుంది.

వీర : అంటే కుక్కా?

రామ : అదే! "పెట్రోల్ డాగ్!"

వీర : ఆంధ్ర రాష్ట్రం వచ్చాకైనా తెనుగు అఘోరిస్తురూ! అయితే ఒక ఆచోకి కుక్కను పెంచుతున్నారన్నమాట?

రామ : తెనుగంటూ పెద్ద దెబ్బతీశామని తమరనుకుంటూ వున్నారు! ఆడవాళ్ళకికూడా "పెట్రోల్ డాగ్" అంటే అర్థమై పోతూన్నప్పుడు అమాటాడితే తప్పేంఉంది?_ ఇంతకూ నే చూపించ బోయేది పెద్దన మనుచరిత్రకాదు, శ్రీనాధుని నైషధంకాదు. ఏదో సర్వసాధారణపు జాగిలాన్ని చూపించేను_

వీర : మీరింకా గొళ్ళెంలో గొడుగెట్టుకునే నిలబడి వున్నారు! ఇకనాకు చూపించేదేమిటి కుక్కను?

రామ : అహా! ఆశబ్దం చూశారా? ఎంత శ్రావ్యంగా వుందో! ఆ ఎగిరే ఆయాసం విన్నారా? ఎంత సునాయాసంగా వుందో! మీకు కుక్కంటే ఇష్టమేనా అసలు? ముందాసంగతి చెప్పండి!

వీర : ఇదేదో మీదంతా వేళా కోళంగా వుంది. "పెట్రోల్ డాగ్" అంటే ఇష్టంలేని వాళ్ళెవరుంటారు?

రామ : అట్లైతే తియ్యవే తలుపు!

వీర : ఏమిటి? కుక్కకాదూ అవల తలుపు బరుకుతూ వున్నది? మీ ఆవిడేనా?

రామ : ఆవిడకు, బరకడానికి అంతంతగోళ్ళుంటాయయ్యా? ఉన్నా అంత చప్పుడు చేస్తుందయ్యా! మిమ్మల్ని లోపలకు రానిస్తే మా ఆవిడకు "ఇన్సల్టు" అయ్యేటట్టుంది.

(లోపలనుంచి చిలుక : "తలుపు తియ్యి! తలుపు తియ్యి! తలుపు తియ్యి!")

వీర : ఆగొంతు మీ ఆవిడదా?

రామ : మా ఆవిడది అయితే అంతతియ్యగా. అంత తేటగా ముమ్మారు "తలుపు తియ్యి, తలుపు తియ్యి, తలుపు తియ్యి" అంటుందటయ్యా! అది, నే పెంచుతూ వున్న రామచిలుక. ఆ చిలుక ఆజ్ఞయిస్తేనే గాని యీ కుక్క తలుపు తీయదు.

వీర : ఇందాకా ఏమన్నా, మీరు గొళ్ళెంలో గొడుగు పెడితేనే చాలన్నారు. ఇప్పుడు వేరే ఆజ్ఞకూడా కావాలా?

రామ : ఆజ్ఞలేనిదే మా యిల్లు శివుడైనా చొరడానికి. వీల్లేదు. (లోపల శబ్దం)

వీర : కాని యింట్లో కీచులాట ఏదో జరుగుతూ వున్నట్టుంది.

రామ : అది వానరుని కీచులాట! నరునిది కాదు.

వీర : అయితే మీరో వానరాన్ని కూడా పెంచుతున్నారన్నమాట!

రామ : మరి ఈ వానరంవెళ్ళి, "తలుపు తీసేస్తూ వుంది కుక్క చిలుకచేత ప్రేరేపింపబడి" అని మా ఆవిడ చెవిలో మొఱబెట్టవలె!

వీర : అప్పుడావిడ వచ్చి తలుపు తీస్తేకద్దు!

రామ : అక్కర్లేదోయి! కోతి అల్లావెళ్ళగా చూచి, కుక్క ఇల్లా గెడ సడల్చే?! విను శబ్దం! ఇనుప గెడ ఇనుపగెడ ధనాధన్!

వీర : అనడమేగా? రాలేదు తలుపు!

రామ : మఱచిపోయాను ఈవల గొళ్ళెంలో పెట్టిన గొడుగు కామనే తోసి వేయడం!

వీర : తీసేటప్పుడు తెలుసుకు మఱీ తియ్యి మీ కుక్కో మా అక్కో?

రామ : మా కుక్కవితే మాటాడ నేరదు. మీ అక్కవితే తలుపు తోయదు.

వీర : అవితే నీమానాన్ని నీవు ఆలాగే నిలబడి వుండు. నే వెడతా!

రామ : వెళ్ళిపోకు వెళ్ళిపోకు! వీరచనకులూ! వచ్చేసిం, గెడ! తీసేసేను గొడుగు! (చప్పుడు) (ఇరువురూ ఇంటిలో ప్రవేశించారు)

వీర : బలే! కుక్కను పెంచేవోయి! నీవు.

రామ : కుక్క కంటే ఎక్కువది రామచిలుక.

వీర : అన్నిటి కంటే ఎక్కువదనుకుంటాను నీవు పెంచే కోతి?

రామ : ఆఁ! చూడు! అప్పుడే నా చేతిలో గొడుగట్టు కెళ్ళి, వంటింటి యీవల గొళ్ళెంలోకి చొప్పించి మిడుతూ మిడుతూ ఏలా చూస్తూవుందో!

వీర : వంటింట్లో ఏముంది?

రామ : ఉన్నదంతా వంటింట్లోనే!

వీర : మీ ఆవిడ అక్కడేనా వుండడం!

రామ : ఆఁ! అమేషా!

వీర : మఱి, నీకు, వీధి తలుపు తెరచినంత పనీ జరిగాలి అన్నమాటే ఆ వంటింటి తలుపు వద్ద.

రామ : వంటింట్లో కుక్కలుంటాయనా నీ తాత్పర్యము?

వీర : కాకుంటే, ఇదంతా ఇంత "జూ"లా వుండివుండదు.

రామ : మనకు కుక్క కాబట్టి తలుపు తీసింది చిలుకమాట విని. లోపలవ్యక్తి ఎవరి మాటా వినదు!

వీర : పిలిచినా పలుకదు?

రామ : మా ఆవిడకు పలకాలని వున్నా ఈ కోతి పలకనివ్వదు.

వీర : అటువంటప్పుడు పెరటి వెంపు వెళ్ళి పిలిచి చూదాం!

రామ : అదే! నేను ఆలోచించేది!

(ఇరువురు పెరటి వైపుకు వెళ్ళుతారు)

వీర : అవితే ఇక్కడ తలుపు గొళ్ళెంకు ఈవల తాటాకు గొడుగు కామ దూర్చివుందే?

రామ : మా ఆవిడ పెరటిదార్ని, నదీస్నానానకు వెళ్ళు చోటు.

వీర : ఈ తాటాకు గొడుగు ఆమె తిరిగి వచ్చేలో ఎవరైనా ఎత్తుకు పోతే?

రామ : వీధిలో కుక్క కు లోబడి, పెరట్లో ఆ దొంగల్ని కరుస్తుంది.

(రామచంద్రరావు భార్య మంచినీళ్ళ బిందె బొళుకు బొళుకు మనిపించు కుంటూ వస్తుంది)

(మాటలో మాటగా)

రా_భార్య : వీధిలో కుక్క వచ్చి పెరట్లో దొంగల మీద బొంయ్‌మనదు.— వంటింట్లోనే వున్నాయి ఒక త్రాచుపాము, ఒక ముంగిస! అదిగో వినండి! మువ్వల చప్పుడు — మఱిబుట్ట మూత తీశామా కన్ను బున్ను! అందుకే ఈ తాటాకు గొడుగు కామా ఆడ్డేటి వెళ్ళడం!

రామ : నేనెప్పుడూ అంత లోతుగా ఆలోచించ లేదు సుమండీ! వీరజనకులు గారూ.

వీర : కాని యికమీద నైనా "డీప్"గా ఆలోచించి గాని ఏపనీ చేయకండి!

రామ : ఏం? కుక్కను పెంచడం తప్పంటారా?

రా_భా: ఏం? పామును? పెంచడం తప్పంటారా?

రామ : ఏం? చిలకను పెంచడం తప్పంటారా?

రా_భా: ఏం? ముంగిసను పెంచడం తప్పంటారా?

వీర : ఇఖ ఎవరికీ కానీకుండా ఈ కోతి ముండవుంది!

రా_భా: కోతిముండకు జవాబుగా నేనున్నాగా.

వీర : చూశారూ! ఇంత చేటు జంతుప్రేమ మీయిరువురకు వుంటే సంసారం నెగ్గడమనేది కష్టమే.

రా_భా: కష్టమేమీలేదు. దేని సంసారం అదే చూచుకుంటుంది. మా నుయ్యి చూశారా? నూతిలో ఒక తాంబేలు వుంది. అది దానంతటదే బయలు దేరింది. మేం పడేసింది కాదు. నుయ్యి తవ్వించి నప్పుడాది కూర్మంలా బయలు పడింది. నూతి పక్క మా కొబ్బరి చెట్టు చూశారా? ఎంత ఏపుగా వుందో! దానిమువ్వలో వాలుతుంది. వాలాయం ఒక భరద్వాజ పిట్ట! మిమ్మల్నెప్పుడూ వీధిలో చూడ్డమేగాని మాయింట్లో చూచిందిలేదు. నేడు మా గృహం కలుషహరమైంది. కూర్చోండి కాస్సేపు! మా వారితో కలిసి కాఫీ పుచ్చుకుని మఱీ వెడుదురుగాని. (అని బిందె దించుకు. కాఫీ యిచ్చును)

వీర : కాఫీ మీరు చేసింది బహుబాగా వుంది. మాబోటి మనుష్యుల కేనా మీ జంతువులకు కూడాపోశేరా?

రామ : అదే మరవరాదు! అవీ మనలాంటివే!

రా_భా: ఇందులో కొన్ని మన కంటే పూర్వానివి కూడాను. అయినా వాటిక్కూడాకాఫీ అలవాటు అయిపోయింది. కోతి, చిలుక, కుక్క ఇవి నిరాఘాటంగా తాగేస్తాయి ఏలాంటికాఫీ అయినా సరే. — కోతి మా అత్తింటి పూర్వోత్రపు తరతరాల నుంచి వస్తోవున్న సంతతి సంతానం. మఱి చిలుక మా పుట్టింటివారు నేనీ యింటికి వచ్చే ముందు అరణం ఇచ్చింది. కుక్క ఏమన్నా ముంద ఓడు. బెంగుళూరు వెళ్ళినప్పుడు అక్కడ ఏవరిదో "బిచ్చి" ఆరు పిల్లలు పెడితే అందులో ఒక పిల్లను అయిదువందలు పెట్టి కొన్నాము. కొని వచ్చే దారిలో మరో రెండు వందలు ఖర్చుపెట్టి తరిఫీ దిప్పించాం! ఇప్పుడు చూశారా ఎలావుందో శింగంలాగు. మఱి త్రాచు పాము సంగతి చెప్తా వింటారా?

రామ : అది చెప్పేదేమిటి పోనిస్తూ!

వీర : చెప్పనివ్వండి! ఈ కాఫీ తాగేశాదాక!

(ఉఫ్ చల్లార్చును)

రామ : కాఫీ వాసన కొట్టి, బుట్టత్తేను పాము. అందుకూ అంటూ వున్నది!

రా_భా : కాఫీ కోసమని కాదులెండి! బుట్టెత్తి చూడ్డం అది! కొత్త గొంతుకేదో వినిపిస్తూందని.

రామ : అది మా ఆవిడకు వరద తీసిపోయిన నెలాపదిహేను రోజులు ఆ అటకమీద చింతపండు చుట్టు బెట్టుకు దొరికిందట!

రా_భా: దొరకడమేమిటి? దానిమానాన్న అది ఎలకల్ని తిని పడివుంది. నేను తాడేమో అని చెయ్యి

వేస్తే నిగడా జర్రుమంది. కొండచిలవని విడదీస్తే బుస్సుమంది, పడగ పాదం అన్నీ వుండి, పెద్ద నల్లత్రాచు! వెంటనే చేత్తో పడగ అదిమి గరళం అంతా ఓడేటట్టు చేసి, కిందకు గిరాటేశాను. కింద ముంగిస వుంది. ముంగిసకు జడిసి, పాము పక్క నున్న బిందె కిందకు దూరింది. బిందెనుండి క్రమ క్రమంగా తాటాకు బుట్టలోకెక్కించాను. అందు లోంచి వెదురుపేళ్ళ బుట్టలోకెక్కించాను. తుద కిప్పుడది పాములపెట్టెలో వాసం చేస్తూవుంది మీ దయవల్ల!

వీర : అయితే పాము కంటె ముందుదే ముంగిస ?

రా_భా : ఆఁ ! అది వరదకు ముందే ప్రవేశించింది మా యింట్లో రోడ్డుమీది గారడివాని మాయల్ని తట్టుకోలేక. నేను తక్షణం దానికో మువ్వకట్టి మాదేనన్నాను. అది వరదకెక్కడున్నా మళ్ళీ మమ్మల్నే చేరుకుంది. ఈ తరువాత!

వీర : వీటికన్నింటికి మొత్తంమీద కాఫీ అలవాటు చేశారు?

రా_భా : ఒక్క తాబేలుకు తప్ప! దానికీ పోయ జూచాను కాని కాఫీ అన్నది నీటిమీద పడీ పడ్డంలో చల్లారిపోయి దానికలవాటు కాలే!

రామ : భరద్వాజపిట్ట మాటకూడా చెప్పేసెయ్యి!

రా_భా : దాన్ని గురించి చెప్పేదేముంది? _ దాని విందు ముందు మన కాఫీ ఖండశర్కర ఏంత సేపు? అక్కడమా పుట్టలో పాలోసినట్టు చెట్టు మొదట రెండు చుక్కలు పోసి చూచాను. కాని అవి ఎక్కలే! దానికి సొక్కలే! _ మీరో యిల్లు కట్టారా ఈ వూళ్ళో ?

వీర : కట్టాను గాని, దాని సింహద్వారానికి లోపల గెడ లేదు. వెలుపల గొళ్ళెంలేదు.

రామ : మఱి జాగ్రత్త?

వీర : అంటే తలుపు వేసి వుండడమనా మీ ప్రశ్న?

రామ : మరే !

వీర : లోపలి నుండీ పంది కొక్కులు తలుపుకు దన్‌గా వుంటే ఇవల నుండీ ఊరపంది దాని పిల్లలూ గెంటుతూ వుంటాయి. ఆ సింహద్వారం యొక్క శాశ్వతయపుఁదుల అగా Balance of power ఎల్ల కాలం నిలిచేలా!

రా_భా : వేటే గొడుగు గొళ్ళెం అక్కఱ లేకుండా?


రామ : వారివి పారిపోయే జంతువులు కావే!

రా_భా : నేనే పారిపోతాను.

వీర : అయితే మీ గొడుగు ఎప్పుడూ గొళ్ళెంలోనే వుంటుందా?

రా_భా : అలాగే వూహిస్తాను నేను!

రామ : అది ఆమె అపోహ! ★



18 వ శతాబ్దపు భారతీయ వస్త్రం నామూనా, న్యూయార్కులోని కూపర్ యూనియన్ మ్యూజియమ్‌లో నుంచబడినది. అనేక రంగులు దారాలతో, చక్కటి సున్నితమైన నూలు వస్త్రముపై, రమణీయముగా కుట్టిన కుట్టు.



బుద్ధిశాలి

• శ్రీ చేబ్రోలు సూర్యారావు •

పూర్వం ఒక గ్రామంలో ఓ బాపడుండేవాడు. అతని పేరు నారాయణ. నారాణయ చాలా తెలివైనవాడూ మంచి బుద్ధిశాలి. రామాయణ భారతాది గ్రంథాల్లో ఏ పద్య మడిగినా యిట్టే చెప్పేస్తాడు. అతని కున్న తెలివి తేటలు ఆ వూళ్ళో వాళ్ళెవరికీ లేవనడం అతిశయోక్తి గాదేమో! అతనికి ఏలోటూ లేకుండా జీవితం గడిచేందుకు వీలుగా ముప్పై ఎకరాల మాగాణి వుంది. దానికి తోడు మూడావులు మూడు గేదెలు ఒక గృహం కూడా వుంది.

అతనికి రామయ్య, రంగయ్య, లక్ష్మయ్య, అనే ముగ్గురు కొడుకులుండేవారు. భార్య మాత్రం లేదు.

కాల క్రమంలో నారాయణ వయోవృద్ధు డయ్యాడు. తన కున్న ఆస్తిని ముగ్గురు కుమారులకీ సమ భాగాలుగా పంచడమా లేక ఆస్తి అంతా పెద్ద కుమారునకే యిచ్చి తక్కిన వాళ్ళందర్నీ పెద్దవాడి అధికారంలో వుంచడమా అనే యోచన వచ్చిందతనికి.

ఒకనాడు ముగ్గురు కొడుకుల్నీ దగ్గరకు పిల్చి "నాయనలారా! నేను ముసలి వాణ్ణయ్యాను, నాకున్న ఆస్తంతా మీదే! కాని ఒక్క విషయం, మీ ముగ్గుర్నీ ఓ చిన్న పరీక్ష చేస్తాను. ఆ పరీక్షలో ఎవరు నెగ్గుతే వారికి ఆస్తి అంతా యిస్తాను, యిక మిగిలిన యిద్దరు వాడి అండను పడి వుండండి" అన్నాడు.

అదివిని అతని కొడుకులు అంగీకరించారు. అప్పుడు నారాయణ వార్ని ముగ్గుర్నీ ఓ గదిలోకి తీసుకెళ్ళి "అబ్బాయిలూ! ఓ అరగంటలో యీ గదిని మీ యిష్ట మొచ్చిన దానితో అసలు ఖాళీలేకుండా నింపాలి. అలా నింపినవారే పరీక్ష గెల్చినట్టు" అన్నాడు.

ఆ మాటలు విన్న పెద్ద కొడుకు తను గదిని నింపే ఆశతో, గది తలుపులన్నీ మూయించి గది కప్పులో చిన్న రంధ్రం చేయించి దాని ద్వారా గదిలో చోళ్ళు పోయసాగాడు. రెండు గంటలైనా నింపలేక పోయాడు. అంచేత పెద్దవాడు పరీక్షలో వోడినట్టు రుజువైంది.

రెండవ కుమారుడేంచేశాడో తెలుసా తను నింపలేనని ఒప్పు కున్నాడు.

ఇక మూడవవాడు తను గదిని నింపుతానని తండ్రిని లోనికి తీసుకు వెళ్ళి గది తలుపులు మూసి గదిలో ఓ కొవ్వొత్తిని వెలిగించి "నాయనా! నీ పరీక్ష ప్రకారం నేను గదిని వెలుగుతో నింపా." అన్నాడు.

ఆ మాటలు విని నారాయణ కొడుకు తెలివికి మెచ్చుకొని షరతు ప్రకారం ఆస్తి అంతా చిన్న కొడుక్కిచ్చేశాడు.

కాని మూడోకొడుకు లక్ష్మయ్య చాలా మంచివాడవడంచే ఆస్తి తన యిద్దరు అన్నలకీ న్యాయంగా పంచి యిచ్చాడు. చూశారా అన్నదమ్ములంటే అంత కలిసీ మెలిసీ బుద్ధిగా వుండాలి.

★

దైవ భక్తి

* శ్రీ నందివాడ కామేశ్వరరావు *

పూర్వం శ్యామలాపురం అను గ్రామంలో వెంకయ్య శెట్టి అనే కోమటి వుండేవాడు. అతను చాలా దైవభక్తి కలవాడు. అతడి భార్య జారిణి. అందుచేత కట్టుకున్న పెళ్ళాన్ని విడిచిపెట్టలేక ఆమె మనస్సు మార్చి సత్ప్రవర్తన కలిగి వుండేటట్లుగా చేయమని ప్రతీరోజూ భగవంతుని ప్రార్థిస్తూ వుండేవాడు. ఇలాగ వుండగా ఒకనాడు వ్యాపారరీత్యా అతను పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది. యింటిదగ్గర తన భార్యను జాగరూకతతో కాపాడుచుండుమని దేవుని మనసారా ప్రార్థించి, భార్యతో కూడా జాగ్రత్తగా వుండమని చెప్పి అతను గ్రామాంతరం వెళ్ళిపోయేడు. ఇదే సమయం కదా అని ఆ వైశ్యకాంత ఆ నాటి రాత్రి తన విటుని రమ్మని యిష్టాలాపములు ఆడుకుంటూవుంది. తన భక్తులను కష్టములనుండి తొలగించుటయే భగవంతుని ధర్మము కనుక, తన కత్యంత ప్రియ భక్తుడైన వెంకయ్య శెట్టి భార్య నీచగుణములు సహించలేక ఈశ్వరుడు మాయ భర్తవేషముతో కొన్ని బండ్ల ధాన్యమును తోలుకొని వెంకయ్య శెట్టి యింటికి వచ్చేడు. పొరుగూరు వెళ్ళిన తన భర్త వెంటనే తిరిగి వచ్చుటచే ఆశ్చర్యముతో భయపడుతూ ఆ జారిణి తన విటుని ధాన్యపు. గాదెలో దాగోమని చెప్పి తాను వెళ్ళి వీధి తలుపు తెరచింది. మాయ వేషధారి అయిన ఈశ్వరుడు తన వెంట నున్న ధాన్యపు బస్తాలను గాదెలో పొయ్యమని నౌకర్లకు చెప్పేడు. వాళ్ళు ఒక్కొక్క బస్తా గాదెలో వెలుపుతూ వుంటే అందులో దాగున్న దొంగకి ఒక్కొక్క ప్రాణమే పోతూంది. ఆఖరికి ఆ బాధ భరించలేక యింకా అందులో కూర్చుంటే తన ప్రాణాలు దక్కవని గాదెనుండి పైకి ఒక్క వురుకు వురికేడు. ఇట్లు పలాయనం చిత్తగిస్తూ వున్న ఆ మోసకారిని మాయ భర్త పట్టుకొని బాగా వీపు సమను చేసి యిక ముందు యిటువంటి పనులు చేస్తే ప్రాణాలు దక్కవని చెప్పి పంపించేడు. తన భర్తని భార్యను చూచి ! ఓ సిమాయలాడి ! యింతకాలము నేను చెప్తే విన్నావుకాదు. మహా పతివ్రతవలె నటిస్తూ నన్నే దూషిస్తూ వుండేదానివి. ఈ రోజు నువ్వు నీ విటుడు పట్టుపడ్డారు చూచేవా ! నిజము నిలకడమీదకాని తెలియదు. భగవంతుని నమ్మిన వానికి మోసము యెన్నటికీ వుండదు. తను పెళ్ళియాడిన భర్త గ్రుడ్డివాడైనా, సొట్టవాడైనా సరే పాతివ్రత్యం గల స్త్రీ అతన్నే భగవంతునిగా పూజిస్తుంది. పతినే దైవముగా భావించే స్త్రీ పతివ్రత అనిపించుకుంటుంది. కాబట్టి యిక ముందైనా నువ్వు నీ భర్తతో కలిసి సుఖములు అనుభవిస్తూ ఈశ్వర భక్తి కలిగి వుంటే పరమందు నీకు మోక్షము కలుగ గలదు అని చెప్పి మాయ వేషధారి అయిన ఈశ్వరుడు మాయమైపోయినాడు.

ఇట్లు మాయమైన తన భర్తను గురించి ఆశ్చర్యముతో చూస్తూ అయ్యో ! యింతవరకూ తనకు వుపదేశము చేసింది తన భర్త గాదని, ఈశ్వరుడే తనకావిధముగా బుద్ధి చెప్పేడని గ్రహించి, ప్రత్యక్షమైన భగవంతుని ప్రార్థించుకోలేని పాపాత్మురాలను 'వగలాడిని నేను వగువ నేల వగచిన వచ్చునే ఈశ్వరుడు' అని చింతిస్తూ ఆ రోజునుంచి దైవభక్తి, పతిభక్తి కలిగి మెలుగుతూ వుంది.

అంతా మన మంచి కొరకే!

* శ్రీ మోహన్ *

పూర్వమొకప్పుడు వంగ దేశమున మేదినీ నగరంలో గుణశీలుడను నొక ధనికుడుండెను. అతనొక పిల్లజమీందారుడై సుందరుడను తనయుని బడసి సుఖముగా విరాజిల్లుచుండెను. సుబుద్ధి యను మంచి లోకజ్ఞానము గల మంత్రి సహాయమున గుణశీలుడు తన పనులను చక్కగా నెరవేర్చుకొనుచుండెను. కష్ట సుఖములయందు మంత్రి "అంతా మన మంచికొరకే" అని గుణశీలునకు చెప్పుచుండెడివాడు. తండ్రికి ఇష్టముగానున్నను, సుందరునకు మాత్రము యీ పలుకులు చాలా కష్టముగా నుండెను.

ఇట్లుండగా కొంతకాలమునకు గుణశీలుడు కాలగతి పొందెను. సుందరుడు స్వయముగా తన వ్యవహారములను చక్కబెట్టుకొనుచుండెను. సుందరుడు ఒకనాడు కత్తిసాము అభ్యాసము చేయుచుండగా ప్రమాద వశమున వేలు తెగిపోయినది. మంత్రి "ఇది మన మంచికొరకే"

అనెను. సుందరుడు కోపము తెచ్చుకొని మంత్రిని కారా గారమున నుంచెను.

కొన్ని దినముల పిమ్మట సుందరుడు వేటకై సమీపమున నున్న అరణ్యమునకు వెళ్ళెను. వేటయందు అలసి ఒక చెట్టు నీడను పరుండగా సింహమొకటి కడు నాకలితో యాతనిని సమీపించెను. చచ్చిన పిల్లివలె పరుండిన సుందరుని పరీక్షించి వాసన చూచి చివరకు వేలుపోయిన చేయిని గాంచి అసహ్యించుకొని వెళ్లిపోయెను. చచ్చిన వాని వలె నటించిన సుందరుడు జరిగిన దంతయు కనిపెట్టు చుండెను. సింహము తనను వదలి వెళ్ళిపోగానే చటాలునలేచి తన వ్రేలుపోయిన చేతిని చూచుకొని యెంతయో సంతసించెను. వేలు తెగినపుడు "అంతయు మన మంచి కొరకే" యను మంత్రి వాక్కు జ్ఞప్తికి వచ్చెను. మంత్రి వాక్కులను తెలుసుకొని, పురమునకేగి తక్షణము మంత్రిని విడుదల చేసి జరిగిన వృత్తాంతమంతయు వారికి తెల్పి క్షమాపణ వేడుకొవెను.

అమ్మ

* శ్రీ సోమంచి సుబ్బారావు *

అదిగదిగో మా యమ్మ
మహామంచి అమ్మ
అమ్మ నన్నెపుడూను
ప్రొద్దున్నే లేపు
వేడి బొబ్బను పెట్టి
వెచ్చగా వోయు,
మెత్తనీ చేతితో వళ్ళంతారుద్దు
మా యమ్మ నా కెంతో
వేడియన్నము పెట్టి,
మంచి బట్టలు కట్టి,
తల దువ్వి పంపించు
బడికి నన్నెపుడు ;

బడి నుంచి రాగానె
పాపాయితో నన్ను
ఆడుకొమ్మని చెప్పి
తాయలం బెట్టు
అమ్మ నెపుడూ కూడ
దూషించరాదు.

నాకెపుడైననూ
రోగమొచ్చినయడల
రాత్రిపగలనకుండాను
నా కడనె కనిపెట్టుకొనియుండు
మంచిమందుల నెన్నొ
నాన్నచే దెప్పించు
నా నోట పట్టించు
తన చేతితోనె.
మరుచటిరోజునకె
అది యేమి రోగమో
హడలి పరుగెత్తా.

అమ్మ తిట్టిన తిట్లు-
లోని పొగడతలూ-
మంచి దీవెనలూ
అమ్మ పెట్టిన ముద్దు
తీయనీ ముద్దు
పండగకు ఎంతోను
పరమాన్నమొండి
నాన్నకంటే ముందు
నాకేను బెట్టు
అమ్మ కెపుడూ హాని
తలపెట్టరాదు.

జిలిబిలి జాబిలి

* శ్రీ బులుసు జీ. ప్రకాష్ *

చందమామ అడుగోటి !
అందంగా వున్నాడు—
రాత్రివేళ నీతోటి
మైత్రిగాను వుంటాడు.

చందమామ అడుగోటి !
చందంగా వస్తాడు—
రాత్రుల్లో నీతోటి
మిత్రుల్లో కలుస్తాడు.

చందమామ అడుగోటి !
అందంగా వున్నాడు—
శార్వరిలో నీతోటి
సర్వం విహరిస్తాడు.

చందమామ అడుగోటి !
అందర కవ్విస్తాడు—
జిలుగుల కిరణాలతోటి
వెలుగులు ప్రసరిస్తాడు.

చందమామ అడుగోటి !
చందంగా చూస్తాడు—
చల్లని వెన్నెళ్ళతోటి
ఉల్లసిల్ల జేస్తాడు.

చందమామ అడుగోనే !
అందర కవ్వబిస్తాడు—
కౌముది ప్రసరిస్తూనే
నీమది కరిగిస్తాడు.

చందమామ అడుగోటి !
అందరునూ చూడండి—
చుక్కల విధు వడుగోటి
చక్కగ నున్నాడండి.

చందమామ అడుగోటి !
అందరున్ను చూశారు ?—
జిలిబిలి జాబిలిగారు
తెలితెలిగా నుంటారు :

....పంతం....

* శ్రీ డి. నాగేశ్వర్ *

నవనవలాడే లేబుగ్గలతో
కలకలలాడే చిలిపి చూపులతో
అందరి మనసుల కదలించే

దుండే దొకపాప ;
చిన్నారి చిట్టిపాప ;

పొరిగింటి పాపకోసం
వారింటికి వెళ్ళింది
వారింట్లో చూచింది
ఒక గులాబి పుష్పాన్ని....

మనకొక గులాబీ
కావాలంటూ
పంతం పట్టింది
అన్నం తిన్నంది ...

పాప అమ్మ గ్రహించింది
అంటు మొక్క సంగ్రహించింది....

మాసం రోజులు గడిచేసరికే
మెత్తని రేకుల పెత్తనాలతో
వికసించిందొక పువ్వు
పాప నవ్విందొక నవ్వు....

సీత అగ్ని ప్రవేశము

• శ్రీ ఏకుమళ్ల కామేశ్వరరావు •

(సీత అగ్ని ప్రవేశము అను పేరున ఒకపాట ముద్రితమై ఉంది. అది దీనికంటె పెద్దపాట. ఏదో అక్కడక్కడ సమాన చరణా లుండవచ్చు కాని ఇది స్వతంత్రంగా బయలు దేరినదే! ఇది విజయనగర ప్రాంతాలలో నున్నపాట కాబట్టి ఆ కవి ఆవైపు వాడే అని చెప్పవచ్చు. పాటలో అతని పేరు లేదు 'సురతాణి, బొబ్బిలికాయలు' అను మాటలను బట్టి ఇది పద్దెనిమిదో శతాబ్దపు రచన కావచ్చు ఈ పాట అముద్రితం. ఇది మాత్రాగణాలతో రచించ బడ్డపాట.

సీత చెర విడిపింప సేతు బంధించి
లంకసాధించియు, రావణుని జంపి,
రాజ్యము విభీషణుడికి పట్టము గట్టె,
సకలమైన దేవతల చెరలు విడిపించి,
"జానకితెమ్మ"నె సర్వేశ్వరులు.
"ఇప్పటి రూపాన తెస్తుమా దేవ !
తొలియున్న రూపాన తోడితెస్తుమ?
ఇప్పటి రూపమ్ము చెప్పెదము దేవ !
కారినవి కన్నీరు, కట్టినజడలు,
మాసినవి వస్త్రాలు, మలినంపు జడలు.
హృదయాన మొలిచింది వెదురు పొద ఒకటి,
ఆసతి పరపురుషుడెదుటికేరాదు."
అందుకు శ్రీరాము అత్యంత అడలి
శృంగారం చేసుక సీతదెమ్మ"నెను.

ఒప్పైన నేత్రాన ఒల్లియ గట్టి,
విరజాజి తైలాన శిరసొప్పనంటి,
మల్లియతైలాన మరినలుగు బెట్టి,
సుగంధి గంధాన అటకళ్ళు గాచి,
ముత్యాల ముంతయు, నేత్రానపట్టు,
గాజున రాణించు కనకంపుగద్దె,
సింహాసనం వలెనున్న రత్నాలగద్దె.
పణతికి పోయరే పనసల నీడ.
ముత్యాల గొడుగును ముదితబట్టగను
మురహరుల సీతతా మజ్జన మాడె.
పగడాల గొడుగులు పడతిబట్టగను
భరతుల వదినె తామజ్జన మాడె

మజ్జన పీటమీద మగువ గూర్చుంటి
కోడిన కొట్టు పసుపు సుఖమొప్పనాడె.
వెండియ వేయికాగుల వేణ్ణీళ్ళు తోడి
పమిడియ పదికాగుల చన్నీళ్ళు తోడి
చన్నీళ్ళు వేణ్ణీళ్ళు సమముగా తొలిపి
జలకమ్ము లాడెను జానకీదేవి.
పట్టుచీరెలొప్ప కట్ట బెడుదురు
పట్టు దివ్యాంబరముల దేవితాగట్టె.
దేవికి దేవుడు తా బంపినాడు
"ఆభరణమ్ములు అతివ కివ్వండి."
బండార మేలేటి పతిని బిలిపించి
తాళములచేత నే పెట్టె దీయించి
"హారములు తారములు బన్న † స్వరములు
ఏ తొడవు లిష్టమో ఎంచుకో దేవి !"
ముంజేతుల, మునివ్రేళ్ళ ముద్రికలు బెట్టె
మగువ తనపాదాల మట్టెలు బెట్టె
పిళ్ళెల్లు, సొంపైన బొబ్బిలి కాయజోళ్ళు
ఆపైన చిటినిబొద్దులు అవితాను బెట్టె
సురతాణి ముత్యాల పతకంపు దండ
వజ్రాల రత్నాల పమిడి యాకులు.
"దేవి కాభరణాలు ఏల ఇచ్చితిరి !
దేవరన మ్మించి వచ్చునో రాదో ?
అరిభోగి ఆవరణాన విడిపించరాదు."
"అట్లని శ్రీరామ అనంగరాదు !
అట్టిది కాదయ్యా మాదేవి సీత !
విడిపించవచ్చు"ని విభీషణుడు పలికె.

† బన్న = ప్రన్న, సొగసైన.

సీత అగ్ని ప్రవేశం

దివ్యరథ మొప్పుగా శ్రీదేవి ఎక్క
కనకాశ్వముల గొట్ట కదలెనచ్చోటు.
అల్లంత తన దేవి రాగానె చూసి
తమ్ముడి దిక్కె జూచె తా రాఘవుండు
పరమసతి ఆ దివ్యపాదముల బడెను.
పాదముల పైనున్న పరమసతిదీసి
కడు ఉగ్రముగ బల్కె కర్ణశూలాలు
"క్షేమమా, కుశలమా ఇందీవరాక్షి!
ఇరవై చేతులవాడు ఎందుగలడనెను?
పదితలల రావణుడు ఎందుగలడనెను?
ఇంతకాలములంక నెందుంటి వనెను?
లంకేశుడు కాడే, రావణుడు కాడే,
అతనిని కళ్ళారజూచి వచ్చితివా!
నీతిలేని వాణ్ణి పాతక పువాణ్ణి
అపరనాకమనియెడి ఆలంకలోను
అందు శుభ రాజ్యమ్ము చేసెడి వాణ్ణి!"

(అందుకు తాసీత అనియె నిట్టులను)
"ఆనందరాజ్యము అయోధ్యయగును;
దిగవిడిచి నిను గూడి వచ్చిన నాడు
పాపకర్ముడు తనను పట్టుకొనిపోయె.
అశోక వృక్షము క్రిందనే ఉంచె.
ఆ సీత ఇది మొదలు పది నెలలదాక
అన్నములు, నిద్రలు అవి తలపలేవు.
అన్న పానాదులు అంటనుమి దేవ!
అటనుండి వాడిరూపు చూడనెన్నటికి!
అంగుష్ట మొక్కటి ఎరుగుదును కాని
మరియేమి అన్యాయం తనవల్లలేదు"
మోకాళ్ళమీదనె శిరస్సును అని
నేలచూస్తూ దేవి అడలంగ దొడగె!
మిన్నులు అడలగా మేదిని అడలె!
మేదిమి పైనున్న వృక్షాలు అడలె!
వృక్షాల పైనున్న పక్షులు అడలె!
అంతరిక్ష సూర్యులు అడల దొడగిరి!
మనసులో విచారిస్తు దివ్య జ్ఞానమున
"పోకు, పోకుమా రామ! పోకు శ్రీరామ!
పోయిన మీ తల్లి కౌసల్య ఆన!
భక్తవత్సలులైన భరతులఆన!
మిముగూడిన తమ్ముల సౌమిత్రులాన!
మీయనుగు దమ్ముల శత్రుఘ్నులాన!"
"ఇందరి ఆనలకు నిలపక రథము
ఊరికి పొమ్మ"నె ఉగ్రము తోను.
పరమ పతివ్రత సీతపై ఆనలు పెడితె
పారక నిల్చెనె పమిడి పుష్పకము.
సంబరము చేయుచుతా సీతాదేవి
తావచ్చి పరమాత్మ ముందర నిలిచె
ముందర నిలచిన ముద్దియను జూచి
తూరుపు మొగమాయెను సూర్య పంకజాలు
తూరుపు మొగమైన తాసీతాదేవి
తా వెళ్ళి పరమాత్మ ముందర నిలిచె
ముందర నిలిచిన ముద్దియను జూచి
పడమటి మొగమాయెను బాలభాస్కరులు.
పడమటి మొగమైన తాసీతాదేవి
తా వెళ్ళి పరమాత్మ ముందర నిలిచె.
ముందర నిలిచిన ముద్దియను జూచి
ఉత్తరపు మొగమాయెను ఉగ్రముతోను.
ఉత్తరపు మొగమైన తాసీతాదేవి
తా వెళ్ళి పరమాత్మని చేయిబట్టె.

"ఈ ఒట్టుకోరు, సత్యం కోరు ఉత్తమపురుష!
చిచ్చయిన కావించు శ్రీరామచంద్ర!"
"ఒట్టయిన నినుఒల్ల ఉవిదరో వినవె!
సత్యమైన నినుఒల్ల జనకసుత వినవె!
ఈ మూడులోకాల వారలు జూడ
లక్ష్మణునకు సత్యము చేయవే పోయి!"
"ఇదియేమి సత్యమో ఉత్తమ పురుష!
మరుదులకు సత్యము చేసువారు కలరా?
విల్లువిరిచి కల్యాణమందిన నాడు
మా తండ్రి జనకుడు ఆడినమాట
మరిస్తివా మహారాజ మనసందు లేదా?
'జానకి సుమ్మయిన త్రైలోక్యనాథ!
బాలకి సుమ్మయిన పనులు నేర్వదు.

సీత అగ్ని ప్రవేశం

సర్వాంగసుందరి జానకీదేవి
ఒప్పులగంధి మీ కప్పగిస్తిమి. '
వైదేహి సీతా మీ తోడునీడలది
పరమసతి ప్రవాదము ఎరుగుదుము కాని
తెల్లము కావలెను దేవతలారా !
సేనలోఉన్న వానరముల బిలిచి
హనుమంతు బిలిచి ఇట్లని బలికె.
"పది యోజనముల వెడల్పు, నిలువు
పాతిక హస్తముల నిలువునీతోడి
హింతాళ వృక్షములు, చింత వృక్షములు
చందనపు మానులే దాపులుగాదెచ్చి
అగ్నిగుండానికి అమర్చుడక్కడ !
రఘువంశ నందనుల, రాఘవులసీత !
అగ్నిగుండానికే వేంచేయనమ్మ !
అయ్యోడ వచ్చెనె హంసయు వలెను
విరచికట్టి నట్టి మడుగుచెంగావి
కాలికి యందియలను ఎగచనదోసె,
సందిటి దండలె ఎగచన దోసె,
తావచ్చె లక్షణ ఉన్నచోటుకును
లక్షణ ! నినుబల్కు నరబుద్ధినైతి
నీతిగలవాడవై వదిలక వస్తివి.
కొలకుల కన్నీరు కమ్మె సౌమిత్రికి
"ఆహాహా ! శ్రీరామ అయోధ్య రామ !
పరాక్రమముగలరామ ! బలరామచంద్ర !
నాదొక విన్నపము ఆలకించండి !
అంగుష్టము నేను ఎరుగుదును కాని
మరియేమి అన్యాయం నావల్లలేదు.
అగ్నిహోత్రుడ ! తనకు ఆనతి ఇమ్మ.
రాముడే పతిగాను తాసతిగాను
కూడుండ వలెననియు పూంతాగ్నిజొచ్చె.
భగభగమండెను త్రేతాగ్ని వలెను.

"జయిస్తి శ్రీరామ ! జయిస్తిచూడు !
అగ్నిజొచ్చినేను జయిస్తి చూడు
చేకొనక పోరాదు శ్రీరాఘవేశ !"
"చూస్తివా రాఘవా ! చోద్యంపు పనులు
మంటలో మనసీత మాటలాడింది !"
"ఊరకుండు లక్ష్మణ ! ఉగ్రసేనుత !
ఆడవారికిగలవు అగ్ని మంత్రాలు !
అలికేరు, పూసేరు, ముగ్గు పెట్టేరు.
చిత్రములు వ్రాసేరు, చిగురు జల్లేరు ?
కాగేటి ఎసళ్ళు చేతగలిపేరు !
ఉడికేటి అన్నములు పట్టిచూసేరు !
వేడి కడవనంట వెరతురు మగవారు"

"శ్రీరాములు ఈ సీతను చేకొనక పోతే
ధరణిమీద రాజనాలు పండవికననిరి.
శ్రీరాములు ఈ సీతను చేకొనకపోతే
ఈఏడు వర్షాలు కురియవికననిరి."
అంతట వచ్చెనే దశరథ మహారాజు
అరుదెంచి అంతరిక్షమ్మున నిలిచె !
తమ తండ్రియని గ్రహించి సర్వేశ్వరులు
సాష్టాంగ నమస్కారములు జేసె.
తన మామయని గ్రహించి తాసీతాదేవి
సాష్టాంగపడి నమస్కారములు జేసె
"అలివేణి నీవు బాగనిసితివి
మనములో అవమాన. ముంచబోకమ్మ !
పసిడి రథముమీద ఈసీతనుంచి
తొడలపై నుంచుకో శ్రీదేవివలెను."
"అల్లదిగో ! అకళంక !" అనుచుచూపిస్తు
ఆసీత దోడుకు అయోధ్య వెళ్ళె.
సీత అగ్ని ప్రవేశమ్మ పాడిన, విన్న
బాయును పాపములు, పొందు పుణ్యములు.

(ముద్రితం కాని పాతస్త్రీల పాటలున్నవారు ఈ కింది చిరునామాకు పంపిన యెడల వాటిని పత్రికలలో ముద్రించుటకు ప్రయత్నం చేస్తాను - టేకుమళ్ళ కామేశ్వరరావు, 52, వాద్యారు సుబ్బరాయ మొదలి వీధి. సైదాపేట, మదరాసు 15)

తెలుగు ఉత్తమ రచనలకు బహుమతులు

మదరాసు (ప్రస్తుతం ఆంధ్ర). ప్రభుత్వము వారిచే తెలుగు భాషా సమితి ద్వారా, ఈ క్రింది విషయములపై తెలుగులో ఉత్తమ గ్రంథములకు 1954_55వ సంవత్సరానికి బహుమతులు ఇవ్వబడునని తెలుగు భాషా సమితి తెలియ జేయుచున్నది.

నాటక కళ:— నాటక రచన భారత దేశములోను, ఇతర దేశములందును ఎట్లు పుట్టి పెరిగినది? తెలుగు భాషలో ఎట్లు, ఎప్పుడు పుట్టి పరిఢ్లిల్లుచున్నది? దశవిధ రూపకములు ఎట్లు ఏర్పడినవి? ఇప్పుడు తెలుగు నాటకముల రచన ఎట్లున్నది?

(ప్రదర్శనములు: ప్రదర్శనములకు సంబంధించిన సమాజ ములు, నాటకశాలలు, పరికరములు మొదలైనవి ఏ విధముగ పరిణమిస్తూ ఉన్నవి? నటీ నటుల సంస్కృతి, నటనా కౌశ లము మొదలైన విషయములకు సంబంధించిన విశేషములు).

ఆంధ్ర వచన రచనా పరిణామము:— కావ్యమందలి వచన రచన, కేవల వచన రచన లయిన గ్రంథము లందలి రచన నన్నయనాటి నుండి నేటి వరకున్ను ఎట్లు పరిణమిస్తూ వచ్చినది?.

కుటీర పరిశ్రమలు, వాటి కళ, ప్రయోజనములు:— కుటీరములందు — అందు ప్రధానముగ తెలుగు దేశమందు_ జరుగుతున్న పరిశ్రమల వివరణములు. శాస్త్ర లక్షణములు, చరిత్ర, అందుగల కళా కౌశలము, వివిధ పరిశ్రమల వల్లను కలిగే ప్రయోజనములు, లాభ నష్టములు మొదలైనవి.

2,400 చరణములకు తక్కువ కాని ఆంధ్ర కావ్యము:— కథా ప్రాధాన్యము గలదియైనా లేనిదైనా కావచ్చును. రసభరితమైనది, సభ్యమైనది, తెలుగు తనపు సొంపులు గలది కావలెను. స్వతంత్ర రచనయై యుండవలెనే కాని అను వాదము కాకూడదు.

భూగర్భ శాస్త్రము:_ కేవల శాస్త్ర దృష్టితో రచితము కావలెను. అందు భారత దేశమునకున్ను, అందులోను తెలుగు దేశమునకున్ను సాధ్యమైనంతవరకు సంబంధించిన విషయ వివరణము కూడా ఉండవలెను.

ధర్మ శాస్త్రము—జూరిస్ ప్రూడెన్స్. భారత దేశాది ప్రాచ్య దేశములందున్ను, రోమక దేశాది పాశ్చాత్య దేశ ములందున్ను ధర్మ శాస్త్రము— జ్యూరిస్‌ప్రూడెన్స్— ఎట్లుదయించి పరిణమిస్తూ వచ్చిందో నిరూపించవలెను.

బహుమతుల పోటీలో పాల్గొనువారు క్రింది అంశములను గుర్తించవలెను.

౧. పోటీకి పంపబడు పుస్తకములు $\frac{1}{16}$ డబుల్ క్రౌన్ సైజులో 250 పుటలకు తక్కువ ఉండరాదు.— అచ్చులో.

౨. సం 1947 రమునకు పూర్వము ప్రకటింపబడిన గ్రంథ ములు ఈ పోటీకి పనికిరావు.

౩. అచ్చు పుస్తకాలయితే ఆరు కాపీలు; వ్రాత ప్రతులయితే రెండేసి కాపీలు పంపించవలసిఉంటుంది.

౪. గ్రంథాలు 1955 జనవరి ఒకటవ తేదికి తెలుగు భాషా సమితి కార్యదర్శి, 27 యూనివర్సిటీ భవనములు, మదరాసు 5, కు అందజేయాలి.

౫. ప్రతి ఒక్క విషయములోని ఉత్తమ గ్రంథమునకును రు. 500లు బహూకరింపబడును.

౬. శాస్త్రీయ విషయములకు సంబంధించిన గ్రంథాలలో శైలి సరళముగను, సామాన్య ప్రజానీకానికి సుబోధకముగను, తెలుగు నుడికారమున కనుగుణముగను ఉండవలెను. సాంకేతిక పదముల వాడుక విషయములో— ఈ వరకే వాడుకలోనికి వచ్చిన తెలుగు పర్యాయ పదములను గాని, అంతర్జాతీయ పారిభాషిక పదములను గాని వాడవచ్చును. తెలుగు పదములను వాడినచో మొదటి సారి ఇంగ్లీషు మూలమును ప్రక్కన చూపవలెను. అట్టి పదముల పట్టికను, ఆంగ్ల మూలములతో సహా అనుబంధములో చేర్చవలెను.

౭. లిఖిత ప్రతులు విస్పష్టముగ బోధపడు దస్తూరిలో సులభముగ చదువుటకు వీలగునట్లు వ్రాయవలెను. కొట్టి వేతలు గాని, హంసపాదులు ఉండరాదు. పుస్తకమును బైండు చేయించి పంపించవలయును.

౮. పోటీకి పంపు అచ్చు పుస్తకములు తిరిగి రచయితలకు పంపబడవనిన్నీ, లిఖిత ప్రతులలో నొకటి మాత్రము బహుమతులు నిర్ణయింపబడిన తరువాత తిరిగి పంపివేయ బడగలవనిన్నీ పోటీలో పాల్గొను రచయితలు గమనింపవలెను.

తెలుగు భాషా సమితి,

27 యూనివర్సిటీ భవనములు, మద్రాసు_5.

అల్లికలు — ఐలెట్ జంపర్

కావలసిన పరికరాలు : 6 ఔన్సులు 3 ప్లై క్రేపు వూలు. నెం. 11 సూదులు 2.

కొలతలు : ఛాతీ 32 అంగుళములు వెడల్పు. పొడవు 19½ అంగుళములు.

(ఎనిమిది కుట్లు ఒక అంగుళానికి సరిసమానం)

జంపర్ వెనుక భాగం

నెం. 11 సూది మీద 112 కుట్లు వేయాలి. తరువాత 2 ని. 2 ప. చొప్పున 3½ అం॥ అయేవరకూ అల్లాలి. దీనినే అంచులేక రిబ్బు అంటారు. తరువాత స్టా. స్టిచ్‌గా మార్చి ప్రతి 8 వ. వరుస రెండుచివర్ల ఒక్కొక్క వైపు ఒక్కొక్క కుట్టు హెచ్చు చేయుచు సూదిమీద 136 కుట్లగువరకు అల్లవలెను. ఇదేమాదిరిగా వెనుక భాగం 11½ అం॥ పొడుగు అగువరకూ అల్లాలి. తరువాత ప్రతి 8, వ. వరుస ఒక్కొక్క చివర ఒక్కొక్క కుట్టు చొప్పున 14 కుట్లు హెచ్చు అగువరకూ అల్లవలెను. అప్పుడు సూదిపై 184 కుట్లుండును. ఆవిధంగా వెనుక భాగం 18½ అం॥ అగువరకు అల్లవలెను. భుజం ఆకారం ఏర్పరచుటకు, తరువాతి 16 వరుసల మొట్టమొదటలో 8 కుట్లు చొప్పున ఒదులుగా కాస్టాఫ్ చేయవలెను. అప్పుడు సూదిమీద 56 కుట్లుండును. వాటిని గట్టిగా కాస్టాఫ్ చేయగా మెడ వెనుక భాగం ఏర్పడును.

ముందు భాగం

వెనక భాగం అల్లినట్లే సూదిపై 126 కుట్లు అగువరకు ముందు భాగం అల్లాలి. తరువాత,

1. వ. వరుస. (తిరుగువైపు) ని 1. పర్ల్ చివర కుట్టువరకు అల్లి తరువాత 1. ని. అల్లవలెను.

2. వ. వరుస. ని. 62. ని.టు.టుగెదర్. మే. 1. ని. 62.

3. వ. వరుస. మొదటి వరుసవలె.

4. వ. వరుస. ని. పూర్తిగా.

5. వ. వరుస. మూడవ వరుసవలె.

6. వ. వరుస. ని. 53. (ని. టు. టుగెదర్, మే 1. ని. 4) ఆవిధంగా మూడు సార్లు అల్లి తరువాత ని. టు. టుగెదర్. మే 1. ని. 53. అల్లవలెను.

7. వ. వరుస. మూడవ వరుసవలె.

8. వ. వరుస. మొదటి కుట్టులో 1 ని. హెచ్చు చేసి చివర కుట్టువరకు, ని. అల్లి తరువాత చివర కుట్టులో, 1. ని. హెచ్చు అల్లవలెను.

9. వ. వరుస. 3. వ. వరుసవలె.

10. వ. వరుస. ని. 45 (ని.టు.టుగెదర్, మే 1. ని. 4) 6 సార్లు ఆవిధంగా అల్లి తరువాత ని.టు.టుగెదర్, మే 1. ని. 45. అల్లవలెను.

11, 12, 13. వ. వరుసలు, వరుసగా, 3, 4, 5, వ. వరుసలవలె.

14. వ. వరుస. ని. 36 (ని.టు.టుగెదర్, మే 1, ని. 4) 9 సార్లు అల్లి తరువాత ని.టు.టుగెదర్, మే 1, ని. 36. అల్లవలెను.

15. వ. వరుస. మూడవ వరుసవలె.

16. వ. వరుస. 8. వ. వరుసవలె.

17. వ. వరుస. 3, వ. వరుసవలె.

18. వ. వరుస. ని. 28, (ని.టు.టుగెదర్, మే 1, ని. 4) 12 సార్లు అల్లి తరువాత ని.టు.టుగెదర్, మే 1, ని. 28. అల్లవలెను.

19, 20, 21, వ. వరుసలు, వరుసగా 3, 4, 5, వ. వరుసలవలె.

22. ని. 19 (ని. టు. టుగెదర్, మే 1. ని. 4) 15 సార్లు అల్లి తరువాత ని.టు.టుగెదర్, మే. 1, ని. 19. అల్లవలెను.

23. వ. వరుస. 3. వ. వరుసవలె.

24. వ. వరుస. 8. వ. వరుసవలె.

25. వ. వరుస. 3. వ. వరుసవలె.

పైవిధంగా 3 నమూనాలు వచ్చేవరకు అల్లి ప్రతి నమూనా 8. వ. వరుస ఒక్కొక్క చివర ఒక్కొక్క కుట్టు హెచ్చు వేయుచు సూదిపై 136 కుట్లు వచ్చువరకు అల్లవలెను. ఆవిధంగా నమూనాలతో ముందు భాగం 11½ అం॥ అగువరకు అల్లాలి. తరువాత నమూనా (చెడ కుండా వుండడానికి) పూర్తి అగుటకు నమూనా ఒక్కొక్క చివర 14 కుట్లు హెచ్చు చేసి, తరువాత పై చెప్పిన విధంగా ప్రతి 8. వ. వరుస ఒక్కొక్క కుట్టు హెచ్చు చేస్తూ 12½ అం॥ అగువరకూ అల్లాలి. తరువాత మెడ ఓపినింగుకు కుట్లన్నీ రెండు భాగాలుగా భాగించుకోవాలి.

తరువాత మొదటి భాగం కుట్లతో నమూనా మొదలు పెట్టి అల్లి, మెడ చివర, అదే వరుసలో చంక ఆకార మేర్పడుటకు ఒక్కొక్క కుట్టు రెండు చివర్లా ఎక్కువ చేస్తూ 10 కుట్లు ఎక్కువ అగువరకు అల్లి తరువాత 14 కుట్లు హెచ్చు అల్లాలి. ఈవిధంగా వెనుక భాగం అల్లిన కొలతకు సమంగా ముందు భాగం కూడా అల్లాలి.

మెడ నిక్కపొడుచుకుని వుండుటకు, భుజముల ఆకారం ఏర్పడుటకు 8 కుట్లు తేలికగా 8 సార్లు చంక చివర భాగం నుంచి కాస్టాఫ్ చేయవలెను. తరువాత తక్కిన కుట్లు కాస్టాఫ్ చేసి వూలు రెండవ భాగమునకు అతికి, మొదటి భాగమువలె అల్లవలెను.

<u>మెడ బైండిగ్ లేక మెడకు అతుకు భాగం :—</u>
8 స్టి. కాస్టాఫ్ చేసి తరువాత స్టా. స్టిచ్‌తో ప్రతి వరుస చివర కుట్టువరకు అల్లవలెను. మెడకు వెనుక ప్రక్క త్రిప్పుటకు సరిపడునంత పొడవు అల్లి కాస్టాఫ్ చేయవలెను.

<u>చంక బైండిగ్ లేక చంకకు అతుకు భాగం :—</u>
8 స్టి. కాస్టాఫ్ చేసి తరువాత మెడ బైండింగువలె 12 అంగుళాలు అల్లి కాస్టాఫ్ చేయవలెను. ఆవిధంగా రెండు ముక్కలు అల్లాలి.

<u>మేకప్ : లేక పూర్తి చేయుట :—</u> భుజములు, ప్రక్కలు కలిపి కుట్టాలి. మెడకు అల్లిన ముక్కను మెడ చుట్టూ కుట్టి, రెండు చేతులకు అల్లిన ముక్కలను చంకలకు అతికి తరువాత పూర్తి అయిన జంపరుని జాగ్రత్తగా యిస్త్రీ చేయవలెను.

★

మూలం : మొపాసా.

అవ్వ

—"శ్రీ శిల్పి"

కొన్ని కొన్ని సంఘటనలు మన హృదయానికి గట్టిగా హత్తుకు పోతాయి. మరిచిపోదామన్నా మరుపుకు రానంతగా అవి మన్ని వెంటాడుతుంటాయి.

ఈ సంఘటన జరిగి యెంతో కాలమైంది. అయినా నిన్న జరిగిన సంగతలా నా మనస్సులో మెదులుతూంది. అది జరిగిన తరువాత యెన్నో విచిత్ర విషయాలు కాల చక్రంలో తిరిగి పోతున్నాయి. అయితేనేం, అప్పటికి నాకు పన్నెండో యేడే అయినా ఆ అవ్వ మాత్రం నా స్మృతి పథంనుండి తొలిగిపోలేదు.

ఆ అవ్వ ప్రతి గురువారం నార వేయడానికి మా యింటికి వస్తూండేది. మా పల్లెలో పురాతనం యిల్లు వుంది. దానికి అంటుకుని మూడు నాలు చావళ్ళు కూడా వుండేవి. అవ్వ ఉదయం ఆరు ఏడు గంటలమధ్య వచ్చీ రాగానే నార గదిలోకి పోయి పని మొదలు పెట్టేది. సన్నగా, పొడవుగా వుండేవి. కాని, ముఖమంతా వెంట్రుకల మయం. ముక్కుమీద, ముక్కు క్రింద, చెక్కిళ్ళ మీద, గడ్డం మీద, అంతా వెంట్రుకలే. తెల్లబడ్డ కనుబొమలు వత్తుగా పొడుగ్గా దుబ్బుల్లా వుండేవి.

అవ్వ కుంటుతూ నడిచేది. కాని అది సామాన్యంగా కుంటివాళ్ళు నడిచినట్టు కాక సముద్రపు అలల్లో ప్రయాణం చేసే ఓడలా వుండేది.

అవ్వంటే నాకు ప్రాణం. నేను లేచీ లేవటంతోటే అవ్వుండే నార గదిలోకి పరుగెత్తే వాడిని. ఆ చలిలో నాకు జలుబు చేస్తుందేమోనని అవ్వ యెంతో జాగ్రత్త తీసుకునేది. ఆ వంకర టింకర వేళ్ళతో నార నేస్తూ నాకెన్నో కథలు చెప్పేది. ఆ పెద్ద కళ్ళజోళ్ళ అద్దాల్లో నుండి కండ్లు విచిత్రంగా రెట్టింపుగా కనిపించేవి. ఆ పల్లెలో జరిగిన వింతలు యెన్నెన్నో చెప్పేది. ఆ చెప్పే విధంలో యేం మహత్తు వుందోకాని ఆ చిన్నకథలే మరుపుకురాని గాథల్లా తోచేవి నాకు. మా అమ్మ సాయింత్రం చెప్పే మహాకవుల కథల్లో అవ్వ చెప్పిన కథలో వున్న నిండు దనం గానీ జీవం గానీ నాకు కనిపించేదికాదు.

ఓ గురువారం ఉదయమంతా అవ్వ చెప్పిన కథలు విన్నా, తరువాత తోటలోకి పండ్లు యేరుకోటావిక్కి వెళ్లాను. కాని యెందువల్లనో మళ్ళా అవ్వని చూడాలనిపించింది. అప్పుడు జరిగినదంతా యిప్పటికీ నాకు కండ్లకు కట్టినట్లుంది.

గది తలుపులు తెరువగానే అవ్వ బల్లప్రక్క పడిపోయి వున్నట్లు కనిపించింది. తల క్రిందికి త్రిప్పి వుంది. చేతులు చాచి వున్నాయి. కాని ఓ చేతిలో సూది, యింకో చేతిలో నా షర్టు ఆ విధంగానే వున్నాయి. పొడుగ్గా వున్న కాలు బల్లకిందకు చాచి వుంది. కండ్ల జోడు గోడ దగ్గర పడి వుంది. పొలి కేకలు పెడుతూ పరువెత్తాను. అందరూ పరుగెత్తుకుంటూ వచ్చేరు. అవ్వ చనిపోయిందన్నారు.

అప్పుడు నా చిన్ని హృదయం పొందిన ఆవేదన యింతా అంతా అని చెప్పలేను. నెమ్మదిగా వసారాలోకి వెళ్ళి ఓ చీకటి మూలలో చేరి యెంతగానో యేడ్చేను. చాలాసేపు ఆ విధంగానే కూర్చుని వున్నాను. చీకటి కూడా పడింది. హఠాత్తుగా ఓ లాంతరు తీసుకుని, మా అమ్మా, నాన్నా, మా వూరు డాక్టరుతో సహా అక్కడికి వచ్చేరు. కాని నన్ను వాళ్ళు చూడలేదు. డాక్టరు ఆ ప్రమాదం ఏవిధంగా జరిగిందీ చెబుతున్నాడు. అందులో చాలా భాగం నాకు అర్థం కాలేదు.

డాక్టరు చెప్పుకు పోతున్నాడు. ఆ మాటలు నా హృదయంలో చెక్కినట్లుగా మిగిలాయి. నిజానికి డాక్టరు చెప్పిన ప్రతి మాటా తిరిగి వల్లించ గల ననుకుంటా.

డాక్టరు అంటున్నాడు : "పాపం ! అభాగ్యురాలు. నే నీ వూరు వచ్చిన రోజే కాలు విరగకొట్టుకుంది. నేను వచ్చీ రావటంతోటే యీవిడ్ని చూడటానికి వెళ్ళవలసె

వచ్చింది. యెందువల్ల నంటే, ఆ దెబ్బ గట్టి దెబ్బ, ప్రమాదకరమైంది కూడాను.

"అప్పటికి యీమెకు పదిహేడేళ్ళుంటాయి. అందమైన పిల్ల. ఆమాటకి వస్తే గొప్ప అందగత్తనే చెప్పాలి. ఆమాట యిప్పు డెవ్వరూ నమ్మరు. ఇంతవరకూ నే నీకథని యెవ్వరికీ చెప్పలేదు. ఆ సంగతి నాకూ, ఇంకో వ్యక్తికీ తప్ప మరింకెవ్వరికీ తెలీదు. ఆ వ్యక్తి ఇప్పుడీ ప్రాంతాల్లో లేడు. ఈమె మరణించింది. ఇప్పుడు మీకీ విషయం చెప్పడం నాకు సబబుగా తోస్తుంది.

"ఒక బడి పంతులు అప్పుడీ వూళ్ళోకి వచ్చేడు. వయస్సులో వున్నవాడు, మంచి అందగాడున్నూ, సిపాయిలలో వుండే ఠీవి అతగాడిలో గోచరించేది. అతడి అందాన్ని మెచ్చుకునే ఆడవాళ్ళు చాలామంది వున్నా అతడంతగా పట్టించుకునేవాడు కాదు. అతడికి స్కూల్లో పెద్దపంతులంటే భయం ఒకటి. కాని చివరికి అతడికి యీ అందాల చిన్నదానిమీద మనస్సు పోయింది. ఎవ్వరికీ అందనివాడు తన్ని కోరుతున్నాడన్న భ్రమలో మురిసిపోయింది. కుట్టుపని పూర్తిచేసుకుని, ఒక గడ్డి మోపు దగ్గిర కలుసుకొమ్మని ఒప్పించేడు.

"తన పని పూర్తి చేసుకుని, యింటికి వెళుతున్నట్లు నటించి, పై గదిలో వున్న గడ్డిమోపుదగ్గిర తన ప్రియుని కొరకు ఎదురు చూసేది. అతడూ అక్కడకు చేరి చల్లని కబుర్లు మొదలు పెట్టాడో లేదో తలుపు తీసుకుని పెద్ద పంతులు ప్రత్యక్షమై 'ఇక్కడేం చేస్తున్నా'వని వురిమేడు. పట్టుబడిపోతానన్న భయంతో చిన్నవాడికి మతిపోయి నట్లయింది. 'కొంచం విశ్రాంతి తీసుకుందామని వచ్చేనండీ' అని నసిగేడు.

"ఆగది చాలా పెద్దది, దాదాపు అంతా చీకటి మయంగా వుంది. ఆ చిన్నవాడు, భయంతో వణికి పోతున్న ఆ పిల్లని మరో చివరికి తోస్తూ, 'అక్కడికి పోయి దాక్కో—నా వుద్యోగం కాస్తా వూడుతుంది. పోయి దాక్కో—ముందు' అని వూదేశాడు. పెద్ద పంతులు ఈ గుసగుసలు విని. 'అదెవరు ?' అన్నాడు.

'నే నొక్కడినేనండీ'

'కానేకాదు, నీవు మాట్లాడుతూండగా నే వినలేదూ ?'

'ఒట్టండీ, నే నొక్కడినే'

'అది నే కనుక్కుంటాగా' అంటూ గది తాళం వేసి దీపం కొరకు క్రిందికు దిగేడు.

"అసలే పిరికి పందేమో ఆ చిన్నవాడికి మతి అ పోయింది. దానితో ఒక్కసారిగా చేతగాని త పుట్టుకొచ్చింది. పదే పదే అనటం మొద 'అతడికి కనబడకుండా పోయి దాక్కొని జీవితం పొడుగునా నా నోటి దగ్గర కూడు తీసివేస్తావు. నా బ్రతుకంతా బండలు చేస్తావు' అని.

"తాళం తీస్తున్న శబ్దం వినిపించింది. ఆ పిల్ల రోడ్డు వైపుగా వున్న కిటికీ వడుగున తీసి రెక్కలు తెరిచింది నెమ్మదిగా 'అతడు వెళ్ళిపోయేక నన్ను లేవతీస్తావు కదూ !' అంటూ బయటకు దూకింది.

"ముసలి పంతులుకు యెవ్వరూ కనిపించలేదు. ఆశ్చర్యపోతూ క్రిందికి దిగిపోయేడు. ఓ పావుగంట పోయేక ఆ చిన్నవాడు తాను చేసిన పని చెప్పాడు. ఆ పిల్ల రెండో అంతస్థు నుండి దూకటం వల్ల లేవలేక అక్కడే పడుంది. నేను అతడితో వెళ్ళాను. వర్షం జోరుగా కురుస్తోంది. పాపం ఆ పిల్లని మా యింటికి చేర్చేను. కుడికాలు మూడు చోట్ల విరిగి బొమికలు బయట పడ్డాయి. బాధంతా ఓర్పుతో భరించింది. 'ఇది నాకు శిక్ష. తగిన శిక్షే అయింది' అని మాత్రం అంది.

"నా యింటి ముందు బండిక్రింద పడిందని ఒక కథ అల్లి చెప్పాను. నామాట అంతా నమ్మేరు. ఇదీ జరిగిన సంగతి. ఆమె ప్రేమగాథ ఇదొక్కటే. కన్యగానే మరణించింది. తన్ను తాను బలి చేసుకుంది. మరుగు పడిపోయిన వున్నత వ్యక్తి. ఈమె మీదవుండే గౌరవం వల్లే యిప్పుడీ సంగతి మీకూ చెబుతున్నాను."

డాక్టరు ముగించేడు. అమ్మకి ఏడ్పు ఆగలేదు, నాన్న నెమ్మదిగా ఏదో అన్నారు. ఆతరువాత వాళ్ళంతా వెళ్ళిపోయారు. నేను మాత్రం ఆ శూన్యంలో అలాగే కూలిపోయాను. కొంత సేపటికి బరువుగా పాదాల చప్పుడు యేదో మోసుకెడుతూన్న చప్పుడూ వినిపించింది.

వాళ్ళు అవ్వ శవాన్ని మోసుకెళ్ళి పోతున్నారు!

Edited, Printed & Published for the Andhra Mahila Sabha, Luz, Madras 4
by Mrs. A C. Krishna Rao, M.A., L.T., at the Andhra Mahila Press, 24-A, Luz Church Rd., Madras